RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

23 నవంబర్ 2024 శనివారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:20 | సంచిక:148



**సచివాలయ ప్రజాబలం ప్రతినిధి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటు కోసం జరుగుతున్న పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. డిసెంబర్ 9 న విగ్రహాన్ని ఆవిష్కరించాలని నిర్ణయించిన నేపథ్యంలో పనుల పురోగతిని పరిశీలించారు. అక్కడ పని చేస్తున్న వారిని పలకరిస్తూ వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.



**సచివాలయ ప్రజాబలం ప్రతినిధి:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారిని అమెరికా చట్టసభ సభ్యుడు, సౌత్ కరోలినా హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్ జేపీ మూర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

# ఫార్మా కంపెనీల ప్రతినిధులతో

# రేవంత్ రెడ్డి , మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**సచివాలయ ప్రజాబలం ప్రతినిధి:** కాలుష్య రహిత యూనిట్ల ఏర్పాటుకు ప్రముఖ ఫార్మా దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులకు ముందుకు వచ్చాయి. తమ కార్యకలాపాల విస్తరణతో పాటు గ్రీన్ ఫార్మా కంపెనీలను నెలకొల్పేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి.

సచివాలయంలో వివిధ ఫార్మా కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సంప్రదింపులు అనంతరం ఎంవోయూలపై ప్రతినిధులు, అధికారులు సంతకాలు చేశారు.

ఎంఎస్ఎన్ గ్రూప్, లారస్ ల్యాబ్స్, గ్లాండ్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ లాబోరేటరీస్, అరబిందో ఫార్మా, హెటిరో ల్యాబ్స్ కంపెనీలతో ఎంవోయూలు జరిగాయి.

ఈ ఆరు కంపెనీలు దాదాపు రూ.5,260 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నాయి. ఈ కంపెనీల విస్తరణ కార్యకలాపాల వల్ల ఫార్మా రంగంలో 12,490 మందికి ఉద్యోగాలు లభిస్తాయి. ఇప్పటికే గుర్తించిన ఫార్మా సిటీలో వీటికి అవసరమైన యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు కేటాయించనుంది.

ఎంవోయూల ప్రకారం..

ఎంఎస్ఎన్ ల్యాబ్స్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌తో పాటు ఆర్ అండ్ డీ సెంటర్ ఏర్పాటు చేస్తుంది.

లారస్ ల్యాబ్స్, అరబిందోలు ఫార్ములేషన్ యూనిట్లు నెలకొల్పుతాయి.

గ్లాండ్ ఫార్మా ఆర్ అండ్ డీ సెంటర్, ఇంజెక్టబుల్స్, డ్రగ్ సబ్‌స్టన్స్ మాన్యుఫాక్చర్ యూనిట్లను స్థాపిస్తుంది.

డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ ఇంజెక్టబుల్స్, బయో సిమిలర్స్ యూనిట్ ఏర్పాటు చేస్తుంది.

హెటిరో గ్రూప్ ఫినిషిడ్ డోస్, ఇంజెక్టబుల్స్ తయారీ పరిశ్రమ నెలకొల్పుతుంది.

మరో నాలుగు నెలల్లో ఈ ఫార్మా కంపెనీలు తమ నిర్మాణ పనులు చేపట్టేందుకు వీలుగా స్థలాలను కేటాయించటంతో పాటు, ఫార్మా సిటీలో అవసరమైన సదుపాయాలు కల్పించాలని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ అవగాహన ఒప్పందాల సందర్భంగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి గారు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ గారు, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి గారు, పరిశ్రమలు (పెట్టుబడులు) ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్ రెడ్డి గారు పాల్గొన్నారు.కంపెనీల తరఫున డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్ డైరెక్టర్ సతీష్ రెడ్డి లారస్ ల్యాబ్స్ ఈడీ వివి రవికుమార్ , గ్లాండ్ ఫార్మా సీఈవో శ్రీనివాస్ , ఎంఎస్ఎన్ ల్యాబ్స్ సీఎండీ ఎంఎస్ఎన్ రెడ్డి , అరబిందో డైరెక్టర్ మదన్‌మోహన్ రెడ్డి , హెటిరో గ్రూప్ ఎండీ బి.వంశీకృష్ణ ఈ సమావేశంలో పాల్గొన్నారు.



## సామాన్యులకు, చిన్న సంస్థలకు కూడా ఆర్బిట్రేషన్ మీడియేషన్ సేవలు అందుబాటులో ఉండాలి రేవంత్ రెడ్డి



సామాన్యులకు, చిన్న సంస్థలకు కూడా ఆర్బిట్రేషన్ మీడియేషన్ సేవలు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ప్రారంభమైన కామన్వెల్త్ ఆర్బిట్రేషన్ మీడియేషన్ సదస్సు 2024 లో పాల్గొని ప్రసంగించారు. మధ్యవర్తిత్వం నెరపడం ద్వారా సమస్యల పరిష్కారానికి ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సెంటర్ చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి గారు అభినందించారు. చర్చలు, సంప్రదింపులు, మధ్యవర్తిత్వం వల్ల వివాదాలు వీలైనంత తొందరగా పరిష్కరించుకోవడానికి అవకాశం ఉందని అన్నారు. అందుకు కృషి చేస్తున్న ఐఎఎంసీ సేవలు గ్లోబల్ ఇన్వెస్టర్స్, పెద్ద పారిశ్రామిక వేత్తలకే పరిమితం కాకుండా సామాన్యులకు కూడా అందుబాటులోకి రావాలని సీఎం కోరారు.




ప్రజాస్వామ్యానికి న్యాయవ్యవస్థ మూలస్తంభమని, అయితే భారీ సంఖ్యలో పేరుకుపోతున్న పెండింగ్ కేసులు న్యాయవ్యవస్థకు సవాలుగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ కేసుల భారాన్ని తగ్గించి వేగంగా, సమర్థవంతంగా కేసుల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వ్యవస్థలు అవసరమని చెప్పారు.

లండన్, సింగపూర్ తర్వాత ఆర్బిట్రేషన్ మ్యాప్‌లో హైదరాబాద్ నగరం ఉండటం గర్వకారణమని అన్నారు. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ వంటి కొత్త ప్రణాళికలతో హైదరాబాద్ గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోందని, సాఫ్ట్‌వేర్, ఫార్మా, లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్, బయో టెక్నాలజీ పరిశ్రమలకు హైదరాబాద్ పవర్ హబ్‌గా ప్రపంచ గుర్తింపు పొందిందని అన్నారు.ఈ సదస్సులో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ ప్రధాన ప్రసంగం చేశారు. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే , శ్రీలంక సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏహెచ్‌ఎండీ నవాజ్ , కామన్వెల్త్ లాయర్స్ అసోసియేషన్ ప్రసిడెంట్ డాక్టర్ పీటర్ డి.మేనార్డ్ కేసీ తో పాటు న్యాయ రంగానికి చెందిన అనేకమంది ప్రముఖులు సదస్సుకు హాజరయ్యారు.

## మత్స్య పరిశ్రమల అధికారులను అభినందించిన రేవంత్ రెడ్డి




2024 సంవత్సరానికి ఉత్తమ అంతర్గత మత్స్యకారుల జాతీయ అవార్డును తెలంగాణ రాష్ట్రం అందుకోవడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను అభినందించారు. మత్స్య పరిశ్రమల అభివృద్ధికి, చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు గుర్తింపుగా ప్రపంచ మత్స్య దినోత్సవం సందర్భంగా అందించే అవార్డు తెలంగాణ రాష్ట్రానికి దక్కింది.

కేంద్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా జాతీయ అవార్డును తెలంగాణ అధికారులు అందుకున్నారు. మత్స్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్ , ఆ శాఖ డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక ఆల గారు సచివాలయంలో సీఎం కి అవార్డును అందించారు. తెలంగాణ మత్స్య శాఖ దేశంలోనే అగ్రగామిగా నిలవడంపై ఈ సందర్భంగా సీఎం వారిని అభినందించారు.

ప్రజాబలం

23 నవంబర్ 2024 శనివారం

# అధిక సంతానం పరిష్కారమా?

మరింత మంది పిల్లలను కనమని దంపతులకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తాజాగా మరోసారి పిలుపునిచ్చారు. గత ఆరు సంవత్సరాల క్రితం ఆయన ఇదే మాట మాట్లాడారు. అప్పుడు మాట్లాడింది 15వ ఆర్థిక సంఘం కేంద్ర నిధుల కేటాయింపుకు, జనాభాకు ముడిపెట్టినప్పుడు. ఇప్పుడు మాట్లాడుతుంది 2026లో జనాభా ఆధారంగా కేంద్ర నిధుల కేటాయింపుతో పాటు పార్లమెంట్ నియోజక వర్గాల పునర్విభజన గురించి కేంద్రం నిర్ణయిస్తున్నపుడు. చిన్న కుటుంబం చింతల్లేని కుటుంబమనేది పాత సామెత, పెద్ద కుటుంబం సంతోష కరమైన కుటుంబమనేది నేటి సామెత అని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యగ్యంగా చెబుతూనే సంతానాన్ని పెంచమని తమిళ ప్రజలను కోరారు. జనాభా నియంత్రణలో అద్భుత విజయాలను సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు జరిమానా విధిస్తారా అంటూ చాలామంది మేధావులు, ఆర్థికవేత్తలు ప్రశ్నిస్తున్నారు. కేంద్రం అలా చేస్తే జనాభా పెరగడం తప్ప మాకు వేరే దారి లేదని మరి కొందరు వాదిస్తున్నారు. ఈ వాదనల్లో రెండు అంశాలు ఉన్నాయని రిజర్వు బ్యాంకు మాజీ చైర్మన్ దువ్వూరి సుబ్బారావు విశ్లేషించారు. ఒకటి ఆర్థిక అంశాలు, రెండు రాజకీయాలు. రాజ్యాంగం ప్రకారం మన దేశం రాష్ట్రాల సమాఖ్య (ఫెడరల్) విధానం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన బాధ్యతలను కేంద్ర జాబితా, రాష్ట్ర జాబితా, ఉమ్మడి జాబితాల్లో రాజ్యాంగం నిర్దేశించింది. ఈ బాధ్యతలను అమలు చేయడానికి నిధుల పంపిణీ గురించి కూడా అందులో పేర్కొన్నారు. కాంగ్రెసు రాజకీయ ఆధిపత్య కోణం నుండే రాష్ట్రాలను తమ ఆధీనంలో వుంచుకోవాలని చూస్తే, బిజెపి మాత్రం తన మాతృ సంస్థ ఆర్ఎస్ఎస్ సిద్ధాంతం ఆధారంగా, కార్పొరేట్ శక్తుల ఆర్థిక ప్రయోజనాల కోసం రాష్ట్రాలను బలహీనం చేస్తున్నది. వాజ్‌పేయి పాలనా కాలంలో అధ్యక్ష తరహా విధానాన్ని అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. ఇదే విధానాన్ని మోడీ కొత్త రూపాల్లో అమలు చేస్తున్నారు. ఒకే పన్ను, ఒకే భాష, ఒకే మతం, ఒకే విధానం, ఒకే ఎన్నిక ఇలా ఒకేలన్నీ అర్ఎస్ఎస్ ఎజెండాలోని కేంద్రీకృత పాలనకు 'ఓకే' చెప్పడంలో భాగమే. ప్రణాళికా సంఘాన్ని రద్దు చేయడం, నీతి ఆయోగ్ పేరుతో కేంద్ర దయాదాక్షిణ్యాల మీద రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేయడం, ప్రపంచ బ్యాంకు ద్వారా రాష్ట్రాలకు అప్పులు ఇప్పిస్తూ తమ గుప్పిట్లో పెట్టుకోవడం జరుగుతుంది. తాజాగా జనాభా లెక్కల ఆధారంగా కేంద్ర నిధుల పంపిణీ, పార్లమెంట్ స్థానాల పునర్విభజన ఎజెండాను తెర పైకి తెచ్చారు. ఇందు కోసం 2025లో జనాభా లెక్కలు సేకరిస్తారు. ఆ జనాభా ఆధారంగా 2026 నుండి కేంద్ర నిధులు, పార్లమెంట్ సీట్లు నిర్ణయిస్తారు. దీనివల్ల జనాభా తక్కువగా వున్న దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోతాయి.

ప్రస్తుత దేశ జనాభాలో సగం మంది 25 సంవత్సరాల వారే. దేశ జనాభా మధ్యస్త వయస్సు 28.4 సంవత్సరాలు. ప్రపంచంలోనే అత్యధిక యువ జనాభా వున్న దేశం మనది. అయితే ఈ పరిస్థితి దేశమంతా ఒకే విధంగా లేదు. జనాభా నియంత్రణ కోసం 1952లో ఏర్పడిన కుటుంబ నియంత్రణ జాతీయ కార్యక్రమాన్ని దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మరికొన్ని ఈశాన్య రాష్ట్రాలు సమర్ధవంతంగా అమలు చేయడంతో ఆయా రాష్ట్రాల్లో జనాభా పెరుగుదల తగ్గింది. జనాభా ఆధారంగా కేంద్ర నిధులు అంటే ఈ రాష్ట్రాలు నష్టపోతాయి. అందుకే 1971 జనాభా లెక్కల ఆధారంగా ఈ రాష్ట్రాలకు 25 శాతం వెయిటేజీ (అదనపు సౌకర్యం) ఇవ్వాలని 1976లో కేంద్రం నిర్ణయించింది. 13వ ఆర్థిక సంఘం వరకూ ఇదే విధానం కొనసాగింది. 2013లో రిజర్వుబ్యాంకు మాజీ చైర్మన్ ప్రొఫెసర్ వై.వి.రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన 14 ఆర్థిక సంఘం ఈ 25 శాతం వెయిటేజీని 17.5 శాతానికి తగ్గించి, 2011 జనాభా లెక్కలకు 10 శాతం వెయిటేజీ ఇచ్చింది. ఈ విధానం దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక స్థితిని దిగజార్చింది. ముఖ్యంగా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు 13వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధుల కంటే 14వ ఆర్థిక సంఘం ఇచ్చిన నిధుల్లో సంవత్సరానికి సుమారు 6 నుండి 8 వేల కోట్లు నష్టపోయాయి. 1971 నుండి 2011 మధ్య ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో జనాభా రెట్టింపు కాగా, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో గణనీయంగా తగ్గింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనాభా పెరుగుదల మందగించింది. 'జనాభా పేరుతో రాష్ట్రాలకు శిక్ష వేస్తారా?' అని 2018 ఏప్రిల్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో విలేకరుల సమావేశం పెట్టి మోడీని ప్రశ్నించారు. ఇదే నెలలోనే తెలంగాణ అప్పటి ముఖ్యమంత్రి చంద్రశేఖర్ –కేంద్రానికి మనం ఇస్తున్న పన్నుల్లో సగం కూడా తిరిగి కేంద్రం మనకు ఇవ్వడంలేదని, ఉత్తరాది రాష్ట్రాల కోసం మనం కష్టపడాల్సి వస్తుందని–ఘాటుగా మాట్లాడారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు కూడా 14వ ఆర్థిక సంఘం నిర్ణయంపై తీవ్రంగా నిరసన వ్యక్తం చేసాయి. 2005–10 మధ్య కేంద్రం రాష్ట్రాలకు ఇస్తున్న గ్రాంట్స్ లెక్కల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు రూ.1,33,471.45 కోట్లు, బీహార్‌కు రూ.75,648.83 కోట్లు ఇవ్వగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రూ.50,353.26 కోట్లు, కేరళకు రూ.19,607.72 కోట్లు మాత్రమే కేటాయించారు. దేశ జనాభాలో 16.30 శాతం వున్న ఉత్తరప్రదేశ్ దేశ స్థూల జాతీయ ఉత్పత్తి (జిడిపి)లో కేవలం 8.4 శాతం వాటాను మాత్రమే కలిగి ఉంది. జనాభాలో కేవలం 2.76 శాతం వున్న కేరళ దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 3.8 శాతం వుంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు దేశ స్థూల జాతీయ ఉత్పత్తిలో 2023–24లో 30 శాతానికి పైగా వాటా కలిగి వున్నాయి. ఇప్పటి వరకు జనాభాకు అదనంగా అనుసరిస్తున్న వెయిటేజీ విధానంలోనే దక్షిణాది రాష్ట్రాలతో పాటు, మరికొన్ని చిన్న రాష్ట్రాలు నష్టపోతుంటే 2026 తర్వాత జనాభా లెక్కల ఆధారంగానే నిధులు కేటాయిస్తే మా పరిస్థితి ఏమిటనేది ఈ రాష్ట్రాల ఆందోళన. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న జనాభా ఆధారిత నిధుల కేటాయింపు, పార్లమెంట్ స్థానాల పునర్విభజన అనేది ప్రపంచీకరణ, మతతత్వ విధానాల అమలులో భాగమే. 1991 నుండి దేశంలో అమలులోకి వచ్చిన ప్రపంచీకరణ విధానాలు అన్ని రాష్ట్రాలను అప్పుల్లో ముంచాయి. రోజువారీ అవసరాలకు కూడా కేంద్రం దగ్గర లేదా ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ బ్యాంకుల దగ్గర దేబిరించాల్సిన పరిస్థితి వచ్చింది. అలాంటి పరిస్థితులు ఎంత బలంగా వుంటే అంతగా ఈ ఆర్థిక సంస్థల షరతులకు రాష్ట్ర ప్రభుత్వాలు లొంగిపోతాయి. కాబట్టే కేంద్రం నుండి గ్రామ పంచాయితీ వరకు ప్రపంచ బ్యాంకు విధానాలు, షరతులు వేగంగా అమలవుతున్నాయి. చట్టబద్ధంగా రావలసిన నిధులను కూడా కేంద్రం ఇవ్వకుండా ప్రపంచ బ్యాంకుతో అప్పు ఇప్పిస్తామంటే అదే మహాప్రసాదం అన్నట్లుగా కొందరు ముఖ్యమంత్రులు చేతులు చాచి కళ్ళకు అద్దుకుంటున్నారు. ఇటీవల మన రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి ప్రపంచ బ్యాంకు ద్వారా ఇప్పించే రూ.15 వేల కోట్లను పార్లమెంట్‌లో దేశ ఆర్థికమంత్రి ఎంత ఘనంగా చెప్పారో, రాష్ట్ర ప్రభుత్వం ఎంత తన్మయత్వంతో స్వాగతించిందో చూశాం. ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు, రోజువారీ ఖర్చులకు కూడా కేంద్రం మీద రాష్ట్రాలు ఆధారపడేటట్లు చేయడం ద్వారానే దేశమంతా ఒకే విద్యుత్, విద్య, వైద్యం, రవాణా, గనుల విధానం అమలు చేయించి స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీలకు ఈ రంగాలను సులభంగా హస్తగతం చేస్తున్నారు. 2025 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ స్థానాలను పునర్విభజన చేసి 2026లో జమిలి ఎన్నికలకు పోవాలని కేంద్ర బిజెపి నిర్ణయించుకుంది. తాము బలహీనంగా వున్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంట్ స్థానాలను తగ్గించి, తమకు అనుకూలంగా వున్న ఉత్తరాది రాష్ట్రాల స్థానాలతో అధికారాన్ని సుస్థిరం చేసుకునేందుకు బిజెపి ప్రయత్నిస్తున్నది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని, సమాఖ్య వ్యవస్థను తుంగలో తొక్కేందుకు జమిలి ఎన్నికలను తెస్తున్నది. తమ మతతత్వ ఎజెండాను, కార్పొరేట్ అనుకూల ఆర్థిక విధానాలను మరింతగా అమలు చేసుకునేందుకు 2025 జనాభా లెక్కలను అవకాశంగా తీసుకుంటున్నది. రోగం ఒకటైతే, మందు మరొకటి ఇచ్చిన చందంగా కార్పొరేట్, మతోన్మాద జమిలి ప్రయోజనాల కోసం చేస్తున్న బిజెపి కుట్రలను చెప్పకుండా అధిక సంతానాన్ని పెంచమని ప్రజలకు రాష్ట్ర ముఖ్యమంత్రి పిలుపునిస్తున్నారు. బిజెపి అనుసరించే విధానాలను ప్రతిఘటించకుండా రాష్ట్రానికి రావలసిన నిధులు సాధించలేరు, ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోలేరు. ఈ విషయాన్ని గుర్తించకపోగా ఆ పార్టీతో టిడిపి, జనసేన ప్రత్యక్షంగా, వైసిపి పరోక్షంగా చెలిమి చేస్తూ దేశానికి, రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నాయి. మన రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా మతోన్మాద భావ వ్యాప్తి చెందడానికి ఆర్ఎస్ఎస్‌కు ఒక ఆయుధంగా పవన్ కళ్యాణ్ తోడ్పడుతున్నారు. రాష్ట్రాలను బలహీనం చేసే బిజెపి కుట్రలను చైతన్యవంతులైన ఆంధ్ర ప్రజలు ఐక్యంగా ప్రతిఘటించేందుకు సిద్ధం కావాలి.

# మూడు వారాల్లోనే దీపం-2 పథకం క్రింద 50 లక్షల మంది లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ

**రాష్ట్ర పౌర సరఫరాలు, ఆహారం, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్**

**జగన్ మోహన్ రెడ్డి కావాలనే దీపం-2 పథకంపై దుష్ప్రచారం**

**గ్యాస్ కంపెనీలు ఇచ్చిన అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్రంలో 1 కోటి 55 లక్షల 200 ల గ్యాస్ కనెక్షన్లు**

**దీపం-2 పథకంపై వస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మొద్దు**

**అర్హులైన చివరి లబ్ధిదారు వరకు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తాం**

**మహిళల ఆరోగ్య భద్రతే కూటమి ప్రభుత్వ లక్ష్యం**

**రాష్ట్రంలో విజయవంతంగా అమలవుతున్న ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం**

**అత్యంత పారదర్శకంగా, నిజాయితీగా పథకం అమలు**



కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందిన వారి సంఖ్య మూడు వారాల్లోనే 50 లక్షల మైలురాయిని చేరుకోవడం గర్వకారణమని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం విజయవాడ, కృష్ణలంకలోని కోత మిషన్ రోడ్డు ప్రాంతంలో జరిగిన దీపం-2 ప్రత్యేక కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్, విజయవాడ తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, పౌర సరఫరాల కార్పొరేషన్ వీసీ, ఎండీ జి.వీరపాండ్యన్, జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ డా. నిధి మీనా, విజయవాడ ఆర్‌డీవో కె.చైతన్య తదితరులు పాల్గొని లబ్ధిదారు ఎం.కోటేశ్వరమ్మ, కుటుంబ సభ్యులతో ముచ్చటించారు.

గ్యాస్ స్టవ్‌పై టీ కాచి, రుచి చూశారు. మాలాంటి కుటుంబాలకు ఏడాదికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తే.. ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.2,476.50 ప్రయోజనం లభిస్తుంది. ఇలాంటి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల పిల్లల్ని బాగా చదివించుకోగలుగుతున్నామని చెబుతూ ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా కోటీ 55 లక్షల వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని.. దీపావళి పండుగ రోజు ప్రతి మహిళ కళ్లల్లో సంతోషం నింపే విధంగా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందించే దీపం-2 పథకాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీకాకుళం జిల్లాలో లాంఛనంగా ప్రారంభించారని.. పథకం విజయవంతంగా అమలవుతోందని పేర్కొన్నారు. నారా చంద్రబాబు నాయుడు 1999లో దేశంలోనే మొదటిసారిగా మహిళల ఆరోగ్య భద్రత గురించి ఆలోచించి కట్టెల పొయ్యి పొగతో అనారోగ్య సమస్యలు వస్తాయనే ఉద్దేశంతో దీపం పథకాన్ని ప్రారంభించారని వివరించారు. గ్యాస్ కనెక్షన్, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉంటే చాలని ఇప్పుడు దీపం-2 పథకం ద్వారా లబ్ధిపొందొచ్చన్నారు. ప్రతిపక్షాలు, మాజీ సీఎం జగన్ కావాల్నా దుష్ప్రచారం చేస్తున్నారని, గ్యాస్ కనెక్షన్ల సంఖ్యపై కూడా అవగాహన లేకుండా కోటి 85 లక్షలు అంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. మూడు గ్యాస్ కంపెనీలు అందించిన సమాచారం మేరకు రాష్ట్రంలో కోటి 55 లక్షల 200 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని.. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పథకం అందేలా రూ. 894 కోట్ల అడ్వాన్సును గ్యాస్ కంపెనీలకు అందజేయడం జరిగిందన్నారు. గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి రాష్ట్రంలోని మహిళల సంక్షేమం లక్ష్యంగా, వారి పిల్లల భవిష్యత్తు బాగుండాలనే ఉద్దేశంతో పనిచేస్తున్నారన్నారు. ఇంత పెద్ద కార్యక్రమానికి సంబంధించి ఇప్పటివరకు కేవలం 521 ఫిర్యాదులు మాత్రమే అందడం కార్యక్రమం అమల్లో పారదర్శకత, నిజాయితీకి నిదర్శనమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ప్రతి ఇంటిలో సంతోషం నింపాలని, 48 గంటల్లోనే బ్యాంకు ఖాతాలో నిధులు జమవుతున్నాయని వివరించారు. మరింత మెరుగైన సేవలందించే విధంగా స్థానిక గ్యాస్ కంపెనీలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి లబ్ధిదారునికి పథకం ద్వారా లబ్ధి చేకూరేలా కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నామన్నారు.

అత్యంత పారదర్శకంగా పథకం అమలు: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ కట్టెల పొయ్యితో వంట చేస్తూ మహిళలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి నాడు సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు దీపం పథకాన్ని తీసుకొచ్చారన్నారు. ఇప్పుడు దీపం -2 పథకం ద్వారా 21 రోజుల్లోనే 50 లక్షల మందికి లబ్ధి చేకూరడం సంతోషంగా ఉందన్నారు. అతి తక్కువ ఫిర్యాదులు నమోదు కావడం ఈ పథకం అమలు పారదర్శకతకు నిదర్శనం అన్నారు.

# జగన్ ఆంధ్ర రాష్ట్రాన్ని బ్లాంక్ చెక్ లా అదానీ కి రాసి ఇచ్చారు

ఆంధ్రప్రదేశ్ ను "అదానీ ప్రదేశ్ "గా మార్చారు

1750 కోట్ల లంచాలకు ఆంధ్ర ప్రజల మనోభావాల తాకట్టు

ప్రపంచానికి తాకిన జగన్ అవినీతి ప్రపంచానికి తాకింది

అదానీ తో జగన్ చేసుకున్న ఒప్పందాలు అన్నింటిపై విచారణ జరగాలి

ఏపీలో అదానీ గ్రూప్ ను బ్లాక్ లిస్ట్ లో పెట్టాలి

ఏపీసీసీ ఛీఫ్ షర్మిల



హైదరాబాద్ అగ్రరాజ్యం బయట పెట్టే దాక అదానీ, జగన్ లంచాల గురించి తెలియలేదు. ఇక్కడ ఉన్న ప్రభుత్వ శాఖలు ఏం చేస్తున్నట్లు ? అంతర్ జాతీయ స్థాయిలో మన దేశ అవినీతి గురించి ఇప్పుడు చర్చ జరుగుతుంది. ఇది మన దేశానికి అవమానం. అదానీ దేశ పరువు తీస్తే... జగన్ ఆంధ్ర రాష్ట్రం పరువు తీశాడు. ఒక్క డీల్ లో 1750 కోట్లు లంచమా ? జగన్ గారు మీకు ఆంధ్రరాష్ట్ర ప్రజల ప్రయోజనాలు గుర్తుకు రాలేదా ? మీకు లంచాలు... ఇక్కడ డిస్కం లకు నష్టాలు. మీకు1750 కోట్లు లంచాలు..ఆంధ్ర రాష్ట్ర ప్రజల నెత్తిన 17 వేల కోట్ల సర్దుబాటు చార్జీలు మీ లంచాల కోసం ఆంధ్ర రాష్ట్రాన్ని అదానీ కి తాకట్టు పెడతారా ? గుజరాత్ లో ఇదే అదానీ యూనిట్ కి 1.99 పైసలు అమ్ముతున్నాడు. ఆంధ్రలో మాత్రం 2.49 పైసలకు అగ్రిమెంట్ చేసుకున్నారు. 1750 కోట్ల లంచం తీసుకొని ప్రజల నెత్తిన అదానీ పవర్ భారాన్ని మోపారు. 25 ఏళ్లు డీల్ కి పడే ప్రజలపై పడే భారం లక్ష కోట్లు. ఈ లక్ష కోట్లు అధనికి దోచుపెట్టే కుట్రలో మీ లంచం ఎంత ? లంచాలు ఇస్తే ప్రజల మనోభావాలను తాకట్టు పెడతారా? జగన్ అవినీతి పరుడు అని ప్రపంచం మొత్తం చర్చ చేస్తోందితదత. ఇది వైఎస్ఆర్ కుటుంబానికి, రాష్ట్రానికి అవమానం. ప్రజలు 5 ఏళ్లు అధికారం ఇస్తే దాన్ని దుర్వినియోగం చేశారు. 1750 కోట్ల లంచాలకు ఆశ పడి జగన్ రిప్యూటేషన్ ను తాకట్టు పెట్టాడు. అదానీ తో ఇదొక్కటే కాదు... ఇక్కడ జరిగిన ప్రతి డీల్ లో లంచాలు తీసుకొని ఉంటాడు. ప్రతి డీల్ లో లంచాలు తీసుకున్నాడు. ఎటువంటి దర్యాప్తులు లేవు కాబట్టి బయటపడటం లేదు. రాష్ట్రాన్ని అదానీ కి జగన్ తాకట్టు పెట్టాడు. గంగవరం పోర్టు ను అప్పనంగా అమ్మేశాడు. కేవలం 640 కోట్లకు అదానీ కి కట్టబెట్టారు. 30 ఏళ్ల తర్వాత గంగవరం పోర్ట్ ప్రభుత్వానికి చెందాలి. 10 శాతం ఉన్న వాట ను అమ్మేశారు. 9 వేల కోట్ల విలువ జేసే 10 శాతం వాట ను కేవలం 640 కోట్లకు అమ్మడం ఏంటి ? ఇలా అమ్మితే ఎంత కమిషన్ తీసుకున్నారు ? – కృష్ణపట్నం పోర్టు బెదిరించి అదానీ కి ఇప్పించారని ఆరోపించారు.

రాష్ట్రం మొత్తం కోల్ సప్లై చేసే కాంట్రాక్టు అదానీ కి ఇచ్చారు. బీచ్ శాండ్ కాంట్రాక్టు మొత్తం అదానీ చేతుల్లో పెట్టారు. విశాఖ లో సబ్ మెరైన్ కాంట్రాక్టు కూడా అదానీ చేతుల్లో పెట్టాలని అనుకున్నారు. అదానీ కి ఇచ్చిన కాంట్రాక్టు లకు ఎంత లంచం తీసుకున్నారు ? చంద్రబాబు ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తుంది. విద్యుత్ కొనుగోలు అగ్రిమెంట్ ను రద్దు చేయండి. అదానీ కంపెనీని ఏపిలో బ్లాక్ లిస్ట్ లో పెట్టండి. జగన్ కుదుర్చుకున్న ఒప్పందాలను రివ్యూ చేయాలి. ఈ దేశంలో వందల కొద్ది మోదాని స్కాం లు ఉన్నాయి. దేశం మొత్తం ఇంత స్కాం లు జరుగుతున్నా మోడీ చర్యలు లేవు. ఇప్పుడు అమెరికా అదానీ అరెస్టు వారెంట్ ఇచ్చింది. ఇప్పటికైనా మోడీ స్పందించాలని అన్నారు.

అదానీ పై చర్యలు తీసుకోవాలి. లేకుంటే మోడీ కూడా అదానీ అవినీతిలో భాగం. అదానీ గత 10 ఏళ్లలో బాగా ఎదిగాడు. దేశంలో రెండో ధనవంతుడు. ఇది మోడీ అండ లేకుంటే సాధ్యం కాదు. అమెరికాలో అదానీ బండారం బయట పడటం ఈ దేశానికి అవమానం. మోడీ నీ ఒక ప్రశ్న కు సమాధానం చెప్పాలని అడుగుతున్నాం. ఇండియా – అమెరికా మధ్య ఒప్పందాలు ఉన్నాయి. ఎక్కడ నేరస్తుడు పట్టుబడిన వెంటనే ఆ దేశానికి అప్పగించాలి. మరి అదానీ నీ మోడీ అమెరికా కి అప్పగిస్తారా ? మోడీ నిర్ణయం ఎంటో తేల్చాలి. మీ నిర్ణయం కోసం దేశ ప్రజలు అంతా చూస్తున్నారు. రేవంత్ ను కూడా విజ్ఞప్తి చేస్తున్న. అదానీ విషయంలో పునరాలోచన చేయాలని అన్నారు.

జగన్ మొన్న ఒక వీడియో ప్లే చేశారు. జగన్ కి నిజంగా చెల్లెలి మీద ప్రేమ ఉండి ఉంటే, బాలకృష్ణ లేదా ఆయన బిలింగ్ నుంచి తప్పుడు ప్రచారం జరిగింది అని తెలిసి ఉంటే, మీరు 5 ఏళ్లు ముఖ్యమంత్రిగా అన్నారు. అప్పుడు గాడిదలు కాశారా? ఎందుకు బాలకృష్ణ మీద విచారణ జరిపించలేదు ? చెల్లెలి మీద ప్రేమ ఉంటే ఎందుకు చర్యలు తీసుకోలేదు. నాకు అక్రమ సంబంధాలు అంట కట్టిన వాళ్ళు ఎవరో కూడా నాకు ఇప్పటికీ తెలియదు. నా బిడ్డల మీద ప్రమాణం చేసి చెప్తున్న. గత 5 ఏళ్లుగా నీ సోషల్ మీడియా సైన్యం తో నాపై తప్పుడు ప్రచారం చేయించలేదా ? మీకు అవసరం అనుకుంటే అందరినీ వాడుతారు. చివరికి నా వీడియో కూడా వాడుతారు. అమ్మపై కేసు పెడతారు.. నాన్న పేరు సీబీఐ ఛార్జ్ షీట్ లో పెట్టిస్తారు. మీకు మీరే సాటి జగన్ సార్ అని వ్యాఖ్యానించారు. .

# బాలికపై గ్యాంగ్ రేప్..

కడప నగర శివారులోని చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దిమడుగులో నెల రోజుల కిందట మైనర్ బాలికను ఇద్దరు అత్యాచారం చేశారు. ఇద్దరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. వీరిద్దరితోపాటు తోడుగా ఓ బాలుడు వెళ్ళాడు. నెల రోజుల తర్వాత కడపలోని దిశా పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించి చింతకొమ్మదిన్నె సిఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ముగ్గురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# దేశాభివృద్ధికి ప్రసారాల చేయూత

ప్రసార భారతి అనేది భారతదేశ అతిపెద్ద ప్రసార సంస్థ. దీని ప్రధాన కార్యాలయం న్యూ ఢిల్లీ లో ఉంది. ఇది పార్లమెంటు ద్వారా ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన స్వయం ప్రతిపత్తి సంస్థ. దూరదర్శన్, టెలివిజన్ నెట్వర్క్, ఆల్ ఇండియా రేడియోలను కలిగి ఉంటుంది. బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది. 1927 జూలై 23 న బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927. ఆగస్టు 26 న ప్రారంభ మైనాయి. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తి లోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆకాశ వాణి ప్రపంచం లోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ ఆధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార యంత్రాంగం ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. ప్రసార భారతి చట్టంను పార్ల మెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన తరువాత 1990 సెప్టెంబర్ 12 న భారత రాష్ట్రపతి అంగీకారం పొందింది. ఇది చివరకు నవంబర్ 1997 లో అమలు చేయబడింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆధీనంలో 1997 నవంబరు 23న స్థాపించ బడింది. ప్రసార భారతి చట్టం, 1990లో పేర్కొన బడిన ప్రసార భారతి కార్పొరేషన్ సంబంధిత ప్రధాన లక్ష్యాలు... దేశ ఐక్యతను, సమగ్రతను, రాజ్యాంగం ప్రసాదిం చిన విలువలను నిలబెట్టడం. జాతీయ లేదా అంతర్జాతీయ ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అన్ని విషయాలపై స్వేచ్ఛగా, నిజాయితీగా మరియు నిష్పక్ష పాతంగా తెలియ జేయడానికి పౌరుడి హక్కును పరిరక్షించడం మరియు దాని స్వంత అభిప్రా యాన్ని లేదా భావజాలాన్ని సమర్థించకుండా విరుద్ధమైన అభిప్రాయాలతో సహా సరసమైన మరియు సమతుల్య సమా చారాన్ని అందించడం. జాతీయ సమైక్యతను ప్రోత్సహించ డానికి, అక్షరాస్యత, వ్యవసాయం, గ్రామీణా భివృద్ధి, పర్యావరణం, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం మరియు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాలలో విద్య మరియు వ్యాప్తిపై ప్రత్యేక శ్రద్ధ చూపడం. మహిళల సమస్యలపై అవగాహన కల్పించడం మరియు సమాజంలోని పిల్లలు, వృద్ధులు మరియు ఇతర బలహీన వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం. విభిన్న సంస్కృతులు, క్రీడలు మరియు ఆటలు మరియు యువత వ్యవహారాలకు తగిన కవరేజీని అందించడం. సామాజిక న్యాయాన్ని ప్రోత్సహించడం, శ్రామిక వర్గాలు, మైనారిటీలు మరియు గిరిజన వర్గాల హక్కులను పరిరక్షించడం. పరిశోధనను ప్రోత్సహించడానికి మరియు ప్రసార సాంకేతికతలో బ్రాడ్కాస్టింగ్ ఫ్యాకల్టీలను అభివృద్ధిని విస్తరించడం లక్ష్యాలుగా ప్రసార భారతి స్థాపన జరిగింది. భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి చట్టం ద్వారా, అన్ని ఆస్తులు, అప్పులు, బాధ్యతలు, చెల్లించాల్సిన డబ్బు చెల్లింపులు, అలాగే ఆకాశవాణి, దూరదర్శన్ లు అన్ని చట్టపరమైన చర్యలు ప్రసార భారతికి భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ అనువర్తింప జేసింది. భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చేసరికి 6 ఆకాశవాణి కేంద్రాలు (కలకత్తా, ఢిల్లీ, బొంబాయి, మద్రాసు, లక్నో, తిరుచిరాపల్లి) మాత్రమే ఉన్నాయి. ఇప్పుడు 215 ఆకాశవాణి కేంద్రాలు 337 ప్రసార కేంద్రాలతో 99.13 శాతం ప్రజలకు ప్రస్తుతం సమాచారాన్ని, విజ్ఞానాన్ని, వినోదాన్ని అందిస్తున్నాయి. దూరదర్శన్ ఇండియా, దూరదర్శన్ అంతర్జాతీయ ఛానెల్ డిడి ఇండియా 37 దేశాలలో అందుబాటులో ఉంది. ఇది ఇప్పుడు యునైటెడ్ స్టేట్స్ లోని హాట్స్టార్, ఐటివి ప్లాట్ఫారమ్లలో కూడా అందు బాటులో ఉంది. న్యూస్ ఆన్ఎయిర్ యాప్, యాప్2 మిలియన్ కంటే ఎక్కువ డౌన్లోడ్లను కలిగి ఉంది. ఇది 270 కంటే ఎక్కువ రేడియో, టీవీ ప్రత్యక్ష ప్రసారాలను అందిస్తుంది. డిడి ఫ్రీ డిష్ దేశంలోనే అతిపెద్ద డిటిహెచ్ ఆపరేటర్ 40 మిలి యన్లకు పైగా గృహాలకు చేరువైంది. ప్లాట్ఫారమ్లో 50ప్లస్ అంకితమైన విద్యా ఛానెల్లతో సహా 116 టివి ఛానెళ్లు ఉన్నాయి. 2020- 21లో రూ.700 కోట్లకుపైగా ఆదాయాన్ని ఆర్జించింది. ప్రసార భారతి న్యూస్ సర్వీసెస్ టెలిగ్రామ్ ఛానెల్, ట్విట్టర్ హ్యాండిల్ ద్వారా ప్రసార భారతి డిజిటల్ న్యూస్ వింగ్గా స్థిరపడింది. దీని ట్విట్టర్ హ్యాండిల్కు వంద కెప్లస్ అనుచరులు న్నాయి. టెలిగ్రామ్ ఛానెల్కు 15కె ప్లస్ వినియోగ దారులున్నారు. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశవ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92 శాతం మొత్తం జనాభాలో 99.19శాతానికి చేరుకుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగుతున్నాయి.

## బహుముఖ ప్రజ్ఞాశాలి జగదీశ్ చంద్ర

మన దేశ ఔన్నత్యాన్ని విదేశాలకు చాటి చెప్పిన మేటి శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్. రేడియో విజ్ఞానంలో పితామహునిగా పేర్కొంటారు. ఒక అసాధారణ వ్యక్తి. భౌతిక శాస్త్రవేత్తగా, జీవ శాస్త్రవేత్తగా, జీవ భౌతిక శాస్త్రవేత్తగా, వృక్ష శాస్త్రవేత్తగా, పురావస్తు శాస్త్రవేత్తగా జగద్విఖ్యాతి పొందిన బహుముఖ ప్రజ్ఞాశాలి, విజ్ఞాన%అ%ఖని బోస్.

సైన్స్ ఫిక్షన్లను కూడా రచయిత కూడా. రేడియో, మైక్రోవేవ్ ఆప్టిక్స్ తో వృక్షశాస్త్రంలో గణనీయ ఫలితాల్ని సాధించిన బోస్ 1904లో అమెరికా నుంచి పేటెంట్ హక్కులు పొందిన తొలి శాస్త్రవేత్త, 1858 నవంబర్ 30న బెంగాల్ ప్రావిన్స్ (నేటి బంగ్లాదేశ్)లోని మున్సిగంజ్ లో 1858 నవంబర్ 30 న బంగ్లాదేశ్లోని మైమెన్సింగ్లో ప్రభుత్వంలో అసిస్టెంట్ కమిషనర్, బ్రహ్మ సమాజ్ సభ్యుడు భగవాన్ చంద్రబోస్కు ఆయన జన్మించాడు. భారతీయ సంప్రదాయాలకు అనుగుణంగా పెరిగిన అతని తండ్రి ఇంగ్లీష్ నేర్చుకునే ముందు బెంగాలీ నేర్చుకోవాలని అనుకున్నాడు. అతను ఒక స్థానిక పాఠశాలలో చదివాడు, అక్కడ అతని క్లాస్మేట్స్ విభిన్న వర్గాలు మరియు మతాలకు చెందినవారు. అతను కలకత్తాలోని సెయింట్ జేవియర్స్ పాఠశాలలో చేరాడు. అక్కడ జెస్యూట్ పూజారి ఫాదర్ యూజీన్ లాఫాంట్ ద్వారా సహజ శాస్త్రాలపై ఆసక్తిని పెంచు కున్నాడు. ప్రాథమిక విద్య సమయంలో బోస్ వద్ద - ముస్లిం నౌఖరు కుమారుడు కుడివైపున, మత్స్య కార్మికుని కుమారుడు ఎడమ వైపున కూర్చునే వారు. వారు చెప్పే పశు పక్ష్యాదుల కథలను బోస్ శ్రద్ధగా వినేవాడు. ప్రకృతిలోని జీవాలపై పరిశోధనాసక్తి కలగడానికి తన స్నేహితుల కథలే అంకురార్పణ చేశాయని ఆయన చెప్పేవారు. కలకత్తాలోని సెయింట్ జేవియర్ కళాశాల నుండి డిగ్రీ పూర్తి చేసి, వైద్య విద్య అభ్యసించేందుకు ఆయన లండన్ వెళ్లాడు. ఆరోగ్యం సహకరించని కారణంగా అక్కడ విద్యాభ్యాసం కొనసాగించలేక తిరిగి భారత దేశానికి చేరు కొ న్నారు. తర్వాత బోస్ ఇంగ్లాండ్లో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయాలని అనుకున్నాడు. కాని మనసు మార్చుకుని తన బావ ఆనందమోహన్ బోస్ సిఫార్సుపై కేంబ్రిడ్జ్లో నేచురల్ సైన్స్ చదివాడు. అక్కడ ఆయనకు ప్రముఖ ఉపాధ్యాయులు ఫ్రాన్సిస్ డార్విన్, జేమ్స్ దేవర్ మరియు మైఖేల్ ఫోస్టర్ బోధించాడు. ఆయన ఇంగ్లాండ్లో ఉన్న సమయంలో, ప్రఫుల్లా చంద్రరేతో స్నేహం చేశాడు. తరువాత ఆయన రసాయన శాస్త్రవేత్తగా కీర్తిని పొందాడు. కలకత్తాలోని ప్రెసిడెన్సీ కళాశాలలో భౌతికశాస్త్ర ఆచార్యునిగా చేరాడు.

జాతి వివక్ష పరాకాష్ఠకు చేరిన ఆ విద్యాసంస్థలో తన ఉద్యోగంలో జాత్యహంకారాన్ని ఎదుర్కొన్నాడు, అయన జీతం బ్రిటిష్ సహచరుల కంటే చాలా తక్కువ. బోస్ మూడేళ్లపాటు జీతం తీసుకోకుండా బోధించడం ద్వారా నిరసన తెలుపుతూ, తగినన్ని సౌకర్యాలు ఆర్థిక సాయం అందకున్నప్పటికీ పట్టుదలతో పరిశోధనలను కొనసాగించాడు. తరువాత, కళాశాల ఆయన నియామకాన్ని శాశ్వతంగా రద్దు చేసింది. జీతం బకాయిలను చెల్లించింది. 1917 లో, కలకత్తాలో బోస్ ఇన్స్టిట్యూట్ను స్థాపించాడు. అక్కడ శాస్త్రవేత్తలు మొక్కలపై పరిశోధనలు జరిపారు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్లను మొట్టమొదటి సారిగా వాడిన బోస్ వైర్లెస్ సిగ్నలింగ్ పరిశోధనలో అత్యద్భుత ప్రగతిని సాధించ గలిగాడు. రేడియో సిగ్నల్స్ ను గుర్తించడానికి అర్ధవాహక జంక్షన్ లను మొట్టమొదటి సారిగా వాడింది బోసే.1901 లో రాయల్ సొసైటీ ఆఫ్ లండన్లో బోస్ నిర్వహించిన ఒక ప్రసిద్ధ ప్రయోగం, మనుషుల మాదిరిగానే మొక్కలకు కూడా భావాలు ఉన్నాయని తేలింది. ఆయన ఒక మొక్కను బ్రోమైడ్ ద్రావణాన్ని కలిగి ఉన్న పాత్రలో ఉంచాడు, ఇది విషపూరిత మైనది. తన పరికరాన్ని ఉపయోగించి, మొక్క విషానికి ఎలా స్పందిస్తుందో తెరపై చూపించాడు. తెరపై వేగంగా, కదలికను చూడగా, అది చివరికి చనిపోయింది. ఒక జంతువును విషంలో ఉంచితే ఇలాంటిదే జరిగి ఉండేది. విషం కారణంగా మొక్క చనిపోయింది. బోస్ తన ఇన్స్ట్రుమెంట్ ను క్రెస్కోగ్రాఫ్ అని పిలిచాడు. మరిన్ని ప్రయోగాలు చేశాడు. ప్రపంచ వ్యాప్తంగా చాలా మంది శాస్త్రవేత్తలు ఆయన కనుగొన్న వాటిని ప్రశంసించారు. వ్యాపార దృష్టి ఏ మాత్రం లేని బోస్ తన పరిశోధనలను ఇతర శాస్త్రవేత్తలు వినియోగించుకుని, వాటి ఆధారంగా మరిన్ని కొత్త ఆవిష్కరణలు జరగాలనే సదుద్దేశంతో తన పరిశోధనలను బహిర్గత పరిచాడు. ప్రధానంగా తాను కను గొన్న క్రెస్కోగ్రాఫ్ సాయంతో వివిధ పరిస్థితులలో మొక్కల స్పందనను పరి శోధనాత్మకంగా నిరూపించాడు. జంతువుల, వృక్షాల కణజాలాలలో సమాంతర పరిశోధనలు చేసి ఉపయోగ కరమైన ఫలితాలు సాధించాడు. రేడియో తరంగాలను గుర్తించడానికి ఉపయోగించే కోహెరర్ అనే పరికరాన్ని మెరుగు పరిచాడు. 1887 లో, బ్రహ్మ సమాజ్ సంస్కర్త దుర్గా మోహన్ దాస్ కుమార్తె అబాలాను వివాహం చేసుకున్నాడు. 1896 లో, రేడియో తరంగాలపై పరిశోధన చేస్తున్న గుగ్లిఎల్మో మార్కోనిని కలిశాడు. జగదీష్ చంద్రబోస్ వైర్లెస్ టెలిగ్రాఫీని కనుగొన్నాడు.

1895 లో ప్రదర్శనను కూడా నిర్వహించాడు, కాని ఆయన పేటెంట్ కోసం దాఖలు చేయలేదు. మరోవైపు ఇటాలియన్ శాస్త్రవేత్త గుగ్లిఎల్మో మార్కోనీ 1897 లో బోస్ ప్రదర్శన తరువాత రెండు సంవత్సరాల అనంతరం ఇదే విధమైన ప్రదర్శన చేసాడు, కాని మార్కోని 1896 లో పేటెంట్ కోసం దాఖలు చేశాడు. కాబట్టి, బోస్ ఈ రంగంలో మార్గదర్శక పని చేసినప్పటికీ, మార్కోనీ ఈ ఆవిష్కరణకు ఘనత పొందాడు. 1937 నవంబర్ 23న తన 78వ ఏట బోస్ అవిభక్త భారతావని లోని బెంగాల్ ప్రావిన్స్ లోని నేటి జార?ండ్లోని గిరిడీలో కన్ను మూశాడు. బోస్ మరణించిన 80 సంవత్సరాల అనంతరం కూడా ఆయన చేసిన కృషి అందించిన గణనీయ సేవలు, సాధించిన ఫలితాలను ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది అనునిత్యం గుర్తు చేసుకుంటునే ఉన్నారు.

# పొగసూరుతున్న జీవితాలు

3.4 కోట్ల జనాభా కలిగిన ఢిల్లీవాసుల ఊపిరితిత్తులు పొగసూరుతున్నాయి. గాలి కాలుష్యం ప్రమాదకర స్థాయిలో కోరలు చాచడంతో వర్క్ ఫ్రమ్ హోమ్, విద్యాలయాలు మూసివేసి ఆన్లైన్ క్లాసులను తెరవడం, సగం మందితో కార్యాలయాల నిర్వహణ, వాహనాల క్రమబద్ధీకరణ, కృత్రిమ వర్షాలతో విషతుల్యమైన స్మోగ్ (స్మోక్ ం ఫాగ్) తీవ్రతను తగ్గించడానికి ప్రయత్నాలు, భవన నిర్మాణాల నిలిపివేతలు, విమాన రాకపోకలకు ఇబ్బందులు, చీపుర్లతో ఊడ్వకుండా తడి గుడ్డలతో తుడవడం, వాటర్ ట్యాంకర్లతో నీటిని చల్లించడం, అనవసర వాహన రద్దీని నియంత్రించడం, వ్యాపార సముదాయాల పని సమయాల్లో కోతలు, ప్రజలు బయట తిరగవద్దని హెచ్చరికలు చేయడం లాంటి అసాధారణ చర్యలకు ప్రభుత్వాలు పూనుకోకతప్పని పరిస్థితులు అనివార్యం కావడం విచారకరం. గత వారంలో గాలి నాణ్యత సూచీ (ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్) ఏడాది గరిష్ట స్థాయి 493కి చేరడం చూసాం. ప్రపంచ ఆరోగ్య సంస్థ వివరాల ప్రకారం సురక్షిత స్థాయి 15 వరకు మాత్రమే ఉండాలి. కాని దాని కన్న 30 రెట్లు అధికంగా పిఎం-2.5 కాలుష్య సూచీ చూపడం ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. ప్రతి ఏట శీతాకాల సీజన్ అక్టోబర్ - నవంబర్ నుంచి ఇలాంటి గాలి కాలుష్య భూతం మహానగరాలతో పాటు ఢిల్లీ వాసులకు నరకం చూపిస్తున్నది. గాలి నాణ్యత సూచీ లేదా ఏయిర్ క్వాలిటీ ఇండెక్స్ 200 దాటితే 'పూర్' అని, 300 దాటితే 'వెరీ పూర్' అని, 400 దాటితే అత్యంత ప్రమాదకరమని వైద్యులు వర్గీకరిస్తారు. ఢిల్లీ లాంటి అధిక గాలి కాలుష్య పరిస్థితులు గుర్గావ్, పాట్నా, జైపూర్, లక్నో, హైదరాబాదు, ఘాజియాబాద్?, కొల్కతా, ముంబాయి, బెంగళూరు, హైదరాబాదు లాంటి నగరాల్లో కూడా కొంత వరకు గమనించడం జరిగింది. భారత్లో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి సగానికి పైగా జరగడం, అపరిమిత వాహనాలు విడిచే పొగ, నిర్మాణరంగ ధూళి, పరిశ్రమలు వదిలే పొగలు, సమీప రాష్ట్రాల్లో వ్యవసాయ వ్యర్థాలను బహిరంగంగా కాల్చి వేయడం, పర్వదినాల్లో బాణాసంచా కాల్చడం లాంటి పలు కారణాలతో నగరాలు గాలి కాలుష్య కోరల్లో విలవిల్లాడుతున్నాయి. మహానగరవాసులు ఈ కలుషిత గాలిని పీల్చడంతో ఊపిరితిత్తులు దెబ్బతినడం వల్ల పిల్లలు, పెద్దలకు శ్వాస ఇబ్బందులు/హృదయ సంబంధ అనారోగ్యాలు కలుగుతున్నాయి. నేటి భారత మహానగరాల గాలి కాలుష్యాన్ని కట్టడి చేయడానికి ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళికలు ఏమీ అమలు పరచడం లేదు. తాత్కాలిక ఉపశమన చర్యలే తప్ప శాశ్వత పరిష్కార దిశగా ఎలాంటి పటిష్ట అడుగులు పడడం లేదు. ఢిల్లీలో పరిస్థితులు మరో విధంగా, హాస్యాస్పదంగా మారిపోతున్నాయి. ఢిల్లీ రాష్ట్ర ఆప్ ప్రభుత్వం, కేంద్ర భాజపా ప్రభుత్వాలు ఒకరి మీద మరొకరు కాలుష్య బురదను చల్లుకోవడం, మీరు చేయాలంటే మీరని వాదనలు చేయడానికి మాత్రమే పరిమితం అవుతున్నారు. తక్షణ ఉపశమనానికి కృత్రిమ వర్షాలు లేదా క్లౌడ్ సీడింగ్ పద్దతిలో వానలు కురిపించే ప్రయత్నాలు వెంటనే చేయాలని నగరవాసులు కోరుతున్నారు. శిలాజ ఇంధన వాహనాలను నియంత్రించడం, ఈవీ వాహనాలను ప్రోత్సహించడం, పరిశ్రమలను నగరాల నుంచి తరలించడం, నిర్మాణ రంగాలకు తాత్కాలిక సెలవులు ప్రకటించడం, వ్యవసాయ వ్యర్థాల కాల్చివేతలను నిషేధించడం లేదా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం, బొగ్గు ఆధార విద్యుత్తు/ఇతర ఉత్పత్తులకు బ్రేకులు వేయడం, వంట చెరుకు/బొగ్గు/పిడకలతో వంటలు చేయడాన్ని తగ్గించడం, చలి మంటలను అదుపు చేయడం, హరిత క్షేత్రాలను పెంచడం లాంటి పటిష్ట చర్యలు అమలు పరిస్తే కొంత వరకు నగరవాసులకు ఊపిరి పీల్చడం తేలికవుతుందని తెలుసుకోవాలి. మహానగరాలు కాలుష్య కేంద్రాలుగా మారి మరింత ప్రమాదకర స్థాయికి చేరక ముందే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరిచి శాశ్వత ప్రాతిపదికన నివారణ చర్యలను త్రికరణశుద్ధిగా చేపట్టాలి. ప్రభుత్వం ఏదైనా ప్రమాదంలో పడుతున్నది ప్రజలే అని గమనించాలి. పరిస్థితులు మరింత విషమించకుండా తక్షణమే మహానగర అభాగ్యులకు ఆయురారోగ్యాలను ప్రసాదించడానికి ప్రభుత్వాలు, నగర ప్రజలు నడుం బిగించాలి. మన ఆరోగ్యం అన్నింటి కన్న ప్రధానమని తెలుసుకొని వివేకంతో, విచక్షణతో అడుగులు వేద్దాం, నగరాలను ఆవాస ప్రదేశాలుగా పునర్ నిర్మించుకుందాం.

## మన్ కీ బాత్ తరహా ప్రోగ్రామ్ కు చంద్రబాబు ప్లాన్

గుంటూరు, నవంబర్ 22 ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వినూత్న తరహా కార్యక్రమాలతో ప్రజలతో మమేకం అయ్యేందుకు సిద్ధమవుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్వహిస్తున్న 'మన్ కీ బాత్' తరహాలోనే రాష్ట్రంలో కూడా ప్రజలతో నేరుగా చంద్రబాబు మాట్లాడనున్నారు. ఈ కార్యక్రమాన్ని సంక్రాంతి నుంచి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. గతంలో 1995 -2004 మధ్య ముఖ్యమంత్రిగా కొనసాగిన సమయంలో చంద్రబాబు నాయుడు 'డయల్ యువర్ సీఎం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం అప్పట్లో సంచలనంగా మారింది. ప్రజలు నేరుగా సీఎంకు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించేవారు.సంక్రాంతి నుంచి ఏపీలో మన్ కీ బాత్, డయల్ యువర్ సీఎం కార్యక్రమాల కలయిక ద్వారా ప్రజలతో మమేకం అయ్యేందుకు సీఎం చంద్రబాబు ప్రణాళికలు చేస్తున్నారు. ఇందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆడియో గానీ, వీడియో విధానంలో గానీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.ఇదిలాఉంటే.. సీఎం చంద్రబాబు అసెంబ్లీలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. సంఘ విద్రోహశక్తుల ఆట కట్టిస్తామని, సామాజిక మాధ్యమాల ద్వారా ఏ ఆడబిడ్డను అవమానించేలా వ్యవహరించినా అదే వారికి చివరి రోజవుతుందని హెచ్చరించారు. ఇష్టానుసారం వ్యక్తిత్వ హననం చేస్తే ఉపేక్షించమని అన్నారు. అదేవిధంగా పంచాయతీలకు రూ. 999 కోట్లు విడుదల చేశామని, త్వరలో రూ. 1,100 కోట్లు రాబోతున్నాయని చంద్రబాబు చెప్పారు. ఒకేరోజు రాష్ట్ర వ్యాప్తంగా 16వేల గ్రామ సభలు పెట్టాం. రూ. 4,500 కోట్లతో 30వేల పనులు చేపట్టాం. సంక్రాంతికి ముందే పనులు పూర్తి చేస్తామని చంద్రబాబు అసెంబ్లీ వేదికగా చెప్పారు

## మంథని మత్స్యకారుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తా

### -హామి ఇచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### -మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘం నాయకులు



మంథని మత్స్యకారుల సమస్యలను పూర్తిగా పరిష్కరిస్తానని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయిని పేట ప్రాంతానికి సంబంధించిన మత్స్యకారుల పలు సమస్యల విషయమై శుక్రవారం హైదరాబాద్ లోని మంత్రి కార్యాలయంలో ఐటీ పరిశ్రమలు శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ని మంథని మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు,జిల్లా డైరెక్టర్ పోతరవేని క్రాంతి ఆధ్వర్యంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. పారిశ్రామికంగా మత్స్యకారులకు కావలసిన సదుపాయాలు, వాటితోపాటు చేప పిల్లలు సరైన సమయంలో అందేలాగా చూడాలని, లేనియెడల నగదు బదిలీ కార్యక్రమం చేపట్టే విధంగా చేయాలని వారు మంత్రి ని కోరారు. అత్యధికంగా గోదావరి నది పరివాహక ప్రాంతం ఉన్న మంథని నియోజకవర్గం లో చేపల పెంపకం మరియు చేపల ఆధారిత పరిశ్రమల విషయమై ఆలోచించాలని విన్నవించారు. ఈ విషయంలో మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి తప్పకుండా మంథని నియోజకవర్గంలో మత్స్య పారిశ్రామిక ప్రాంతంగా తీర్చిదిద్దడానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి తో చర్చిస్తామని హామీ వారికి హామీ ఇచ్చారు. దీంతో వారు మంత్రి శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.పెద్దపెల్లి జిల్లా మత్స్య సహకార సంఘం డైరెక్టర్ గా పార్టీలకు అతీతంగా క్రాంతి చేస్తున్న సేవలను మంత్రి శ్రీధర్ బాబు అభినందించారు. ఇలాగే మత్స్యకారుల సమస్యలను పరిష్కరించే దిశగా ఇంకా బలంగా తయారు కావాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం నాయకులు సబ్బని సమ్మయ్య, పోతరవేని అర్జున్, పోలు కనక రాజ్, డిష్ రాజు, బొజ్జ శ్రీను,జడిగల లక్ష్మణ్ లతో పాటు పలువురు పాల్గొన్నారు.

# పదేళ్లు పోయో... మరో పదేళ్లు ఆగాలా...

విజయవాడ, నవంబర్ 22, గత ఎన్నికలలో తాను పోటీచేసిన రెండు స్థానాలలోనూ ఓడిపోయారు పవన్ కళ్యాణ్. పవన్ పని అయిపోయింది. ఇక రాజకీయ అస్త్ర సన్యాసం తీసుకోవాల్సిన సమయం వచ్చిందని ప్రతిపక్షాలు గేలిచేశాయి. అయినా అవన్నీ పట్టించుకోకుండా పవన్ కళ్యాన్ తన పని తాను చేసుకుంటూ ముందుకు సాగారు. గత ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత ప్రభావం బాగా కనిపించింది. అనూహ్యంగా కూటమి పక్షాలకు అఖండ విజయం అందించారు ప్రజలు. జనసేన కూడా తనకు కేటాయించిన సీట్లను నిలబెట్టుకోవడమే కాకుండా రెండు పార్లమెంట్ సీట్లు కూడా గెలిపించుకుంది. పవన్ ఏ పదవీ ఆశించకుండానే డిప్యూటీ సీఎం వంటి కీలక పదవి లభించింది. ఏపీలో ఇప్పుడు ఎక్కడ చూసినా జనసేన ప్రభంజనమే కనిపిస్తోంది. అయితే జనసేనానిఉండుండి ఓ బాంబు పేల్చారు. శాసనసభ సాక్షిగా మరో పదేళ్లు చంద్రబాబే సీఎం అని స్టేట్ మెంట్ ఇచ్చిపారేశారు.అభిమానులకు అదే మింగుడు పడటం లేదు.తమ అభిమాన నాయకుడిని సీఎంగా చూద్దామని పదేళ్లుగా ఎదురుచూస్తున్నారు పవర్ స్టార్ ఫ్యాన్స్ .అనుకోకుండా అనూహ్యంగా జనసేనకు వైసీపీ నుంచి వలసలు మొదలయ్యాయి.వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి పవన్ కళ్యాణ్ సీఎం అని అందరూ అనుకుంటున్నారు. వయసు రీత్యా చంద్రబాబు కూడా వేరొకరికి అవకాశం ఇవ్వాల్సిన పరిస్థితి. ప్రస్తుతం సీఎం రేసులో ఉన్న లోకేష్ కన్నా పవన్ అన్ని విషయాలలోనూ ముందంజలో ఉన్నారు. ఇక కేంద్రంలో బీజేపీ మద్దతు ఎలాగూ ఉండనే ఉంది. ఇన్ని అనుకూలతలు ఉండగా పవన్ ఎందుకలా మరో పదేళ్లు చంద్రబాబే సీఎం అని ఎందుకన్నారో ఎవరికీ అర్థం కావడం లేదు.జనసేనను స్థాపించిన పదేళ్ల తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు జనసేనాని. నిదానమే ప్రదానమనే సిద్ధాంతాన్ని అనుసరించే పవన్ కళ్యాణ్ పదవులు ఆశించకుండా..పార్టీని భూస్థాపితం చేయకుండా..ఏ పార్టీలోనూ విలీనం చేయకుండా..కేవలం తనని నమ్ముకున్న కార్యకర్తల కోసం పార్టీ సిద్ధాంతాలనే నమ్ముకుని నడిపించుకుంటూ వస్తున్నారు. పార్టీ స్థాపించినప్పుడు ఆర్థిక సమస్యలు. అందుకోసమే సినిమాలలో నటించి దాని ద్వారా వచ్చే ఆదాయంతో పార్టీని నడిపించుకుంటూ మధ్యమధ్య ఉచితంగా సామాజిక సేవలు, తన సొంత డబ్బుతో విద్యార్థులకు ఫీజులు, పేదలకు వైద్య సేవలు లాంటి గుప్త సాయాలు చేస్తూ వచ్చారు. మొన్నటి ఎన్నికలలో అనూహ్యంగా బీజేపీని టీడీపీని తన జనసేనతో కలిపి ఓ కూటమిని ఏర్పాటు చేశారు. జగన్ పై జన గర్జన చేశారు. పదేళ్ల తపస్సు ఫలించిందిప్రజలలో అనూహ్యంగా నమ్మకం పెరిగిపోయింది. ఇప్పుడు ఓటమి నుంచి కూటమి దాకా చేరుకున్నారు. ఇప్పుడు కూటమిలో ఉన్న మూడు పార్టీలలో జనసేనకు అనూహ్యంగా వలసలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా వైసీపీ నుంచి జనసేనకు క్యూ కడుతున్నారువైసీపీ కూడా వచ్చే అసెంబ్లీ నాటికి పుంజుకోవడం కష్టమే. అలాంటప్పుడు జనం కొత్త నేతను కోరుకోవడం సహజమే. జగన్ కూడా ఒక్క ఛాన్స్ అంటూ వచ్చారు. అయితే ఆ ఛాన్స్ దుర్వినియోగం కావడంతో అది కాస్తా మొన్నటి ఎన్నికలలో మిస్ ఫైర్ అయింది. మళ్లీ జగన్ కు అధికారం రావాలంటే విశ్వప్రయత్నమే చేయాలి. ఈలోగా జనసేన మరింత బలంగా తయారవుతోంది. బీజేపీ సపోర్టు తో వచ్చే ఎన్నికలలో క్రియాశీలక శక్తిగా మారనుంది.ఇన్నాళ్లూ పవన్ స్థాపించిన జనసేన నుంచి కార్యకర్తలు కూడా పార్టీని ,తమ నేతను జాగ్రత్తగా కాపాడుకుంటూ వస్తున్నారు. వారికి కావలసిందల్లా తమ నాయకుడిని సీఎం సీటులో చూడాలని. ఇంతకాలం కళ్లలో ఒత్తులు వేసుకుని ఈ అవకాశం కోసమే ఎదురుచూశారు. అయితే పవన్ ను అనూహ్యంగా డిప్యూటీ సీఎం పదవి వరించింది. రాష్ట్రంలో సెకండ్ ప్లేస్ దక్కించుకున్నారు. ఇటు చంద్రబాబు, అటు మోదీ కూడా పవన్ కే అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే మొదటి నుంచీ పదవీ వ్యామోహం లేనట్లుగా ఉండే పవన్ కళ్యాణ్ కు ఇది తేలికైన విషయమే. కాగా కార్యకర్తలు మాత్రం జీర్ణించుకోలేకపోవున్నారుఇక ఎప్పటినుంచో కాపు వర్గం నేతలు కూడా తమ సత్తా నిరూపించుకునే సమయం వచ్చిందని ఆనందపడుతున్నారు. చిరంజీవి సైతం కాపు వర్గం మద్దతు దక్కించుకోలేకపోయారు. కనీసం పదళ్లకయినా పవన్ కు ఆ ఆవకాశం లభించింది. ఈ పరిస్థితిలో తమ వర్గానికి అండగా ఉంటాడు పవన్ అని భావిస్తున్న తరుణంలో పవన్ పేల్చిన బాంబు కాపు వర్గాలు సైతం జీర్ణించుకోలేకపోతున్నాయి.పవన్ చెప్పినదాన్ని బట్టి మరో పదేళ్లు అంటే ఇప్పటి ఐదేళ్లతో కలుపుకుంటే మరో పదేళ్లు కలిపి 15 సంవత్సరాలన్నమాట. 15 ఏళ్లు ఎదురుచూడటమంటే మాటలు కాదు. పవన్ మాత్రం గోల్డెన్ ఛాన్స్ వదులుకుంటున్నారని కార్యకర్తలు, కాపు వర్గం భావిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీని బలపరిచే సమయం వచ్చింది. వైకాపా కూడా రేసులో వెనకబడింది. ఇదే సమయంలో జనం కూడా పవన్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో పవన్ డైలాగ్ అందరినీ డైలమాలో పడేసింది

# పీపీపీ మోడల్ లో అభివృద్ధి పనులు

విజయవాడ, నవంబర్ 22, తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో ఎక్కువగా మాట్లాడుతున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. అయితే చంద్రబాబునాయుడు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు. అంటే ఇప్పుడు రాష్ట్ర రహదారులపైనా ప్రయాణించాలన్న టోల్ గేట్లు తప్పవన్నమాట.గోదావరి నీటిని పెన్నాకు తరలించడానికి నదుల అనుసంధాన ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలిస్తున్నారు. కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం కు తరలిస్తారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ తరహాలో బ్యారేజీ నిర్మిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు-నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుంది. ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రూ.70 వేల కోట్లు కావాలి. అంత మొత్తం ప్రభుత్వం వద్ద ఉండదు. అందుకే చంద్రబాబు ఖఖఖ మోడల్ గురించి ఆలోచిస్తున్నారు.రోడ్లు, ప్రాజెక్టులు ప్రైవేటు, ప్రభుత్వ పార్టనర్ షిప్‌లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఆయా కంపెనీలు ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపిస్తారు. టోల్ వసూలు చేస్తారా నీటి తీరువా వసూలు చేస్తారా మరొకటా అన్నది తర్వాత. రైతుల పంటలకు కావాల్సినంత నీరు సదుపాయం వస్తే.. అంత కంటే కావాల్సిందేమీ ఉండదని అంచనా వేస్తున్నారు. ఖఖఖ విధానంతో ఏపీని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు నుంచీ చెబుతున్నారు . ప్రజల ఆదాయాలను పెంచితే వారు ఈ విధానం ద్వారా మేలు జరిగితే ఎంతో కొంత పన్నులు కట్టేందుకు సిద్ధంగా ఉంటారు. మేలు జరగకపోతే మాత్రం ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

# పీఏసీ పదవి దూరమేనా

విజయవాడ, నవంబర్ 22, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పీఏసీ చైర్మన్ ఎంపిక సైతం వైసీపీకి కలిసివచ్చినట్లు కనిపించడం లేదు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించి అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం చతికిల పడాల్సి వచ్చింది. దీంతో కేవలం 11 అంటే 11 సీట్లకు మాత్రమే వైసీపీ పరిమితం కావలసి వచ్చింది. దీంతో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లేకపోవడంతో శాసనసభలో కనీసం ప్రతిపక్ష హోదా లేదన్న విమర్శలను మూటకట్టుకుంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.అయితే ప్రతిపక్ష హోదా ఉండాలి అంటే కనీసమైన సభ్యుల సంఖ్య ఉండాలన్న నిబంధనలు చెబుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టును సైతం ఆశ్రయించింది. అయితే అనూహ్యంగా సభలో కీలకమైన బాధ్యతలు చేపట్టే పీఏసీ చైర్మన్ పదవి ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వవలసి ఉంటుందని వైసీపీ పట్టుపడుతోంది. ప్రధాన ప్రతిపక్షం పదవి కట్టుబెట్టాలన్న నిబంధనలు చెబుతున్న నేపథ్యంలో ప్రస్తుతం శాసనసభలో ప్రధాన ప్రతిపక్షం హోదా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కేలా లేదనిపిస్తోంది. ఋ నేపథ్యంలో ఎవరు ఆ బాధ్యతను చేపడుతారని ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో జనసేనకు ఛాన్స్ దక్కేలా కనిపిస్తోంది. జనసేన నుంచి పులపర్తి ఆంజనేయులు పేరును ఆపార్ట అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించినట్లు సమాచారం.

దీంతో పీఏసీ చైర్మన్ పదవిపై ఉత్కంఠ తొలిగింది.పీఏసీ చైర్మన్‌గా మొదట పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి చంద్రశేఖర్లతో కలిసి నామినేషన్లు దాఖలు చేయగా చివరి నిమిషంలో 20 మంది సభ్యులు ఉంటేనే పీఏసీ చైర్మన్‌గా నియమిస్తారని పీఏసీ సభ్యులుగా ఎంపిక కావాలన్నా, చైర్మన్‌గా ఎంపిక కావాలన్నా 20 మంది సభ్యుల మద్దతు కావాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని తెరపైకి తెచ్చింది అధికార కూటమి.దీంతో అవసరమైన 20 మంది సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో లేని నేపథ్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏసీ ఎన్నికయ్యే అవకాశం లేదని చర్చ నడుస్తోంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నుంచి 12 నామినేషన్లు దాఖలు కాగా పీఏసీలో మొత్తం 12 మంది సభ్యులు అందులో 9 మంది ఎమ్మెల్యేలు ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. అయితే మొత్తం అన్ని సభ్యులకు కూటమి ప్రభుత్వమే నామినేషన్ దాఖలు చేసింది.

పీఏసీ చైర్మన్‌గా 2014 ? 2019 మధ్య బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, 2019 ? 2024 మధ్య పయ్యావుల కేశవ్ బాధ్యతలను నిర్వర్తించగా, తాజాగా 2024 ? 2029 మధ్య ప్రతిపక్ష హోదా లేని పార్టీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉండటంతో ఆ బాధ్యతలను కూటమి ప్రభుత్వంలోని కీలక నేతకు కట్టబెట్టే అవకాశం ఉంది.

ప్రధాన ప్రతిపక్ష హోదా లేకపోవడం సభలో సంఖ్యాబలం లేని కారణంగా ప్రతిపక్ష హోదా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేని నేపథ్యంలో పీఏసీ చైర్మన్ నియామకం కూడా దక్కదన్న చర్చ నడుస్తోంది. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం తమకు 40 శాతం ఓట్ షేర్ ఉందని శాసనసభలో అధికార పక్షం, ప్రతిపక్షం రెండే ఉంటాయి. కాబట్టి ఆదిశగా నిర్ణయం తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేస్తుంది. కాగా, అధికారం కోల్పోయిన వైసీపీకి తాజా ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు పెద్ద దెబ్బ తగిలితే, ఇప్పుడు కీలకమైన పీఏసీ చైర్మన్ పదవి సైతం చేజారినట్లు కనిపిస్తోంది..!

# బెగ్గర్ మాఫియా....

కర్నూలు, నవంబర్ 22, చిన్న పిల్లలను కిడ్నాప్ చేసి వారితో బిచ్చమెత్తించి ఆ డబ్బులు తాము వాడుకునే రాక్షసుల గురించి సినిమాల్లోనే చూసి ఉంటాం. కానీ నిజంగానే అలాంటి మాఫియా ఉంది. ఏపీలో ఇలాంటి మాఫియాను గుర్తించారు. వారిని పట్టుకునేందుకు అధికారులు రంగంలోకి దిగారు. చిన్న పిల్లవాడు ఒంటి నిండా రంగు పూసుకుని గాంధీ అవతారంలో రోడ్డుపై కునికి పాట్లు పడుతున్న వీడియోను ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఆ వీడియో చూసి నారా లోకేష్ చలించిపోయారు. వెంటనే ఎవరో ఏంటో తెలుసుకోవాలని.. ఎందుకు అలా భిక్షాటన చేయాల్సి వస్తుందో గుర్తించాలని ఆదేశించారు. కర్నూలులో ఆ పిల్లవాడి కోసం వెదుకుతున్న పోలీసులకు అలాంటి వారు చాలా చోట్ల కనిపించారు. శరీరానికి రంగు పూసుకుని భిక్షాటన చేస్తున్న మరి కొందరు చిన్నారులను గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని, వివరాలు సేకరించారు. అంతా వ్యవస్థీకృతంగా జరుగుతున్న మాఫియాగా గుర్తించారు. ఆ పిల్లల తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించారు. అయితే ఈ బిచ్చగాళ్ల మాఫియా వెనుక ఉన్నది ఎవరో బయటకు లాగేందుకు ఆపరేషన్ ప్రారంభించారు.నిజానికి ఒక్క కర్నూలులోనే కాదు రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి బిచ్చగాళ్ల మాఫియాలు ఉంటాయి. అన్ని రకాల వయసుల వాళ్లు ఇందులో ఉంటారు. చంటి బిడ్డలను వేసుకుని కొంత మంది మహిళలు రోడ్డు మీదకు వస్తారు. నిండు గర్భిణి వేషంతో మరికొంత మంది వస్తారు. రూపాయి చేయని పెన్నును పది రూపాయలు పెట్టి కొనాలని దీనంగా అడిగేవారూ ఉంటారు. ఇదంతా ఓ బెగ్గింగ్ మాఫియా అని చాలా మందికి తెలుసు. అయినా కొంత మంది డబ్బులు ఇస్తూంటారు. పోలీసులు పట్టించుకోరు. ఈ మాఫియాను నడిపే వ్యక్తులు లక్షలు వెనకేసుకుంటూ ఉంటారు. పిల్లల్ని పావులుగా పెట్టుకుంటూ ఉంటారు. బెగ్గర్లు లక్షాధికారులుగా ఉన్నారని అనేక చోట్ల నుంచి వార్తలు వస్తున్నాయి. ముంబైలో ఒక్కో బెగ్గర్ లక్షలు సంపాదిస్తారు. లక్నోలో బెగ్గర్లకు ఐ ఫోన్లు కూడ ఆంటాయి. అక్కడ ఓ మాఫియాలాగా వ్యవస్థీకృతంగా ఉందో లేదో ఏపీలో మాత్రం పిల్లల జీవితాలను నాశనం చేస్తూ.. ఏమీ తెలియని వయసులో కూడా వారి ఒంటికి రంగులేసి భిక్షాటనకు పంపుతున్నారు. ఈ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేసే అవకాశాలు ఉన్నాయి.

# లీడర్ల లెటర్ల కోసం తిరిగేపని లేకుండా శ్రీవారి వీఐపీ దర్శనం

తిరుమల, నవంబర్ 22, తిరుమల శ్రీవారి దర్శనం ప్రతి ఒక్క హిందువుకు ఎంతో ముఖ్యం. పుట్టిన రోజు నాడు అయినా .. జీవితంలో ఏదైనా సాధించిన రోజు అయినా.. దూర ప్రాంతంలో ఉండి సొంత రాష్ట్రానికి వచ్చినా ముందుగా శ్రీవారి దర్శనం చేసుకోవాలని అనుకుంటారు.అందుకే తిరుమల కొండలపై ఎప్పుడూ విపరీతమైన రద్దీ ఉంటుంది. 300 దర్శనం టిక్కెట్లను మూడు నెలల ముందుగానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. ఇక వీఐపీ దర్శన టిక్కెట్లకు అయితే రాజకీయ నేతల సిఫారసు లేఖలు అవసరం. అయితే రాజకీయ నేతల సిఫారసు లేఖలు అవసరం లేకుండానే శ్రీవారి పథకం ద్వారా వీఐపీ దర్శన టిక్కెట్లు కొనుగోలు చేసే అవకాశాన్ని టీటీడీ కల్పిస్తోంది. ఎయిర్ పోర్టునూ ఈ ఫెసిలిటీ ఉంది. రేణిగుంట విమానాశ్రయంలో దిగిన వెంటనే శ్రీవాణి టిక్కెట్లు కొనుగోలు చేసి వీఐపీ దర్శనానికి వెళ్లవచ్చు. ఇప్పటి వరకూ ఉన్న శ్రీవాణి టికెట్ల సంఖ్య పెంచుతూ టీటీడీ నిర్ణయం తీసుకుంది. రేణిగుంట విమానాశ్రయంలో ప్రతిరోజూ జారీ చేస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల సంఖ్యను టీటీడీ 100 నుండి 200 కు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విమానాశ్రయంలో కరెంట్ బుకింగ్ కౌంటర్‌లో భక్తులు టికెట్లను బుక్ చేసుకోవచ్చని తెలిపింది. బోర్డింగ్ పాస్ ద్వారా తిరుపతి ఎయిర్‌పోర్ట్ కౌంటర్‌లో మాత్రమే ఈ ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేస్తారు. అలాగే తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం వెనుక వైపు ఉన్న శ్రీవాణి టికెట్ కౌంటర్ లో ఆఫ్ లైన్ లో జారీ చేస్తున్న టికెట్ల సంఖ్యను 900 నుండి 800 కు తగ్గించారు. మొదటి వచ్చిన వారికి మొదటి ప్రాతిపదికన ఈ టికెట్లను జారీ చేస్తారు. అంటే రోజుకు వెయ్యి మంది వరకూ వీఐపీ దర్శనం చేసుకోవచ్చు. ఈ దర్శనం టిక్కెట్ రూ. 10వేలు ఉంటుంది. ఇప్పటి వరకూ శ్రీవాణి ట్రస్ట్ కు పదివేలు విరాళం ఇచ్చే వారికి రూ. 500 కలిపి మొత్తం పదివేల ఐదు వందలకు ఈ టిక్కెట్ ఇస్తున్నారు. నిధులన్నీ శ్రీవారి ట్రస్టుకు వెళ్లేవి. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత రూల్స్ మార్చారు. తిరుమలలో కొత్త టీటీడీ బోర్డు ఏర్పడిన తర్వాత కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. భక్తులకు మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు తీసుకుటున్నారు. ఈ క్రమంలో రాజకీయ నేతల వద్దకు వెళ్లడం కన్నా ఇలా శ్రీవాణి టిక్కెట్లు కొనుగోలు చేయడం మంచిదని భావించే వారి కోసం ఈ ఏర్పాటు చేస్తున్నారు. గత ప్రభుత్వంలో వీఐపీ టిక్కెట్ల పేరుతో రాజకీయ నేతలు టిక్కెట్లు అమ్ముకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

మాస్టర్ ప్లాన్ కు అనుగణంగా లేని అభివృద్ధి

టీటీడీ మాస్టర్ ప్లాన్ 2019లో రూపొందించినా దానికి అనుగుణంగా అభివృద్ధి పనులు, నిర్మాణాలు జరగలేదని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. చారిత్రాత్మక చరిత్ర ఉట్టిపడేలా నిర్మాణాలు జరగడం లేదని అభిప్రాయపడ్డారు. పవిత్రత అనేది లేకుండా భవన నిర్మాణాలు చేశారని, తిరుమలలో కట్టిన నిర్మాణాలు సొంత పేర్లు ఉండకూడదని స్పష్టం చేశారు.తిరుమలలో పలువురు ప్రైవేట్ వ్యక్తులకు టీటీడీ భూమి కేటాయించడం ద్వారా స్వామి వారి భక్తుల కోసం వసతి గృహాలను నిర్మించి వాటిని టీటీడీకి అప్పగించే పద్ధతి ఎప్పటి నుంచో ఉంది. ఈ క్రమంలో కొందరు టీటీడీ కేటాయించిన భూముల్లో నిర్మాణాలు చేపట్టి వాటికి సొంత పేర్లను పెట్టుకోవడాన్ని గుర్తించారు. అలాంటి నిర్మాణాలకు టీటీడీ నుండి కొన్ని పేర్లు ఇస్తామని అవే పేర్లను ఆయా గెస్ట్ హౌస్‌లకు పెట్టుకోవాలని ఈవో స్పష్టం చేశారు. తిరుమలలో కట్టే టౌన్ ప్లానింగ్ ప్రకారం నిర్మించాలని, ఎలాంటి ప్లానింగ్ లేకుండా తిరుమలలో నిర్మాణాలు కట్టేశారని, సరైన నిబంధనలు లేకుండా కట్టినవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తిరుమలలో నూతన టౌన్ ప్లాన్ విభాగాన్ని ఏర్పాటు చేయడానికి ప్రయత్నం చేస్తామన్నారు. వచ్చే 25 సంవత్సరాలకు సంబంధించిన విజన్ డాక్యుమెంటరీ తయారు చేస్తామని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయాలనే ఉద్దేశంతో మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని చెప్పారు. తిరుమలలో మల్టిలెవల్, స్మార్ట్ పార్కింగ్, ఫుట్ పాత్ లు నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు.

# డిజిటల్ మీడియా పేరుతో దోచేశారు

కడప, నవంబర్ 22, రుకు ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు..చేసేదంతా పార్టీ ప్రచారం. ప్రచారమంటే అది మామూలు ప్రచారం కాదు. విషం చిమ్మడే పని అంటున్నారు. సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు, వికృత వీడియోలు, అడ్డగోలు కామెంట్స్ పెట్టడమే వాళ్ల డ్యూటీ అంట. ఆఫీస్‌కు పోవాల్సిన పనిలేదు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చెప్పాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఎక్కడ ఉన్నా ప్రాపగండ చేస్తే చాలంటూ వాళ్లకు బాధ్యత అప్పగించారట. కట్ చేస్తే లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటూ రెచ్చిపోయినోళ్ల తిక్క కథలు అంతా ఇప్పుడు బయటికి వస్తోంది. ఇలా కూడా చేయొచ్చా అన్నట్లుగా..ఓ మూడు కార్పోరేషన్ల నుంచి..ప్రభుత్వ డబ్బును ప్రసాదంలా పంచేశారట. సర్కార్ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాల్సిన కార్పొరేషన్ నుంచి నెలనెలా ప్రజాధనాన్ని జీతం ఇస్తూ..కూటమి నేతలు, వారి కుటుంబసభ్యుల మీద నీచమైన పోస్టులు పెట్టించారట. ఇదంతా వైసీపీ పెద్ద లీడర్ల డైరెక్షన్‌లో జరిగిందని..అప్పటి విషనాగుల వివరాలన్నీ ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని చెప్తున్నారు కూటమి నేతలు.చంద్రబాబు, పవన్ కల్యాణ్ కుటంబసభ్యులే కాదు..వైఎస్ షర్మిల, సునీతా మీద అడ్డగోలుగా, అసభ్యంగా పోస్టులు పెట్టిన పలువురిని..కొద్ది రోజులుగా అరెస్ట్ చేస్తూ వస్తున్నారు పోలీసులు. అందులో కొందరిని విచారించగా అసలు విషయం బయటికి వచ్చిందట. కూటమి పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యుల మీద పోస్టులు పెట్టే వ్యవహారం ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా నడిచిందని గుర్తించారట. పక్కా ప్లాన్‌తో వైసీపీ పెద్దల డైరెక్షన్‌లో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అందరికీ పోస్టర్లు డిజైన్ చేసి పంపిస్తారని..వాటిని వాళ్లు సోషల్ మీడియాలో పెడతారని పోలీస్ విచారణలో తేలిందట. అలా పోస్టులు పెట్టినందుకు కొందరికి అయితే లక్షలకు లక్షలు జీతాలు ఇచ్చారట. ఈ విషయాన్ని అరెస్ట్ అయిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లే పోలీసులకు చెప్పడంతో..ఈ మ్యాటర్ తెలిసి కూటమి నేతలు షాక్ అయినట్లు తెలుస్తోంది.కడప ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి కేసులో పోలీసులు తీగ లాగితే సోషల్ మీడియా పోస్టుల బాగోతం కథ మొత్తం బయటపడినట్లు చెబుతున్నారు. మొత్తం 46 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. వీరంతా నెలనెలా ప్రభుత్వ నుంచి జీతాలు తీసుకుంటూ..అప్పటి ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులైన మహిళల మార్ఫింగ్ ఫోటోలతో అసభ్యకర, నీచమైన కామెంట్స్‌తో ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నట్లు దర్యాప్తులో తేలిందంటున్నారు. ఈ 46 మందిలో 30 మంది ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ద్వారా జీతాలు తీసుకున్నట్లు విచారణలో గుర్తించారట.మిగిలిన వారికి ఏపీ ఈ ప్రగతి ఏపీ ఫైబర్ నెట్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ నుంచి శ్యాలరీస్ ఇచ్చారని అంటున్నారు. నిందితుల్లో 30 వేల రూపాయల నుంచి 3 లక్షల రూపాయల వరకు జీతాలు తీసుకున్నారని..అందులో ముగ్గురికి రెండు లక్షల 80 వేల జీతం 50 వేల రూపాయలు ఇతర అలవెన్స్ కూడా ఇచ్చినట్లు టాక్. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 130 మంది ఉద్యోగులతో డిజిటల్ మీడియా కార్పొరేషన్‌ను రన్ చేసిన వైసీపీ..వాళ్లందరినీ పార్టీ ప్రచారం కోసం, ప్రత్యర్థుల మీద దుష్ప్రచారం చేసేందుకు వాడుకుందంటున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా తాడేపల్లిలోని ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఆఫీస్‌లో తనిఖీలు చేసిన కడప పోలీసులు కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.వైసీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ సజ్జల భార్గవ్‌రెడ్డి డైరెక్షన్‌లో..పక్కా ప్లాన్ ప్రకారం ఇదంతా జరిగిందనేది కూటమి నేతల ఆరోపణ. ఆయనకు సన్నిహితులుగా ఉన్నవారు, వైసీపీ మద్దతుదారులకు నెలనెలా జీతాలు ఇచ్చి..అడ్డగోలుగా పోస్టులు పెట్టించేవారని పోలీసుల దర్యాప్తులో తేలిందంటున్నారు. వైసీపీ సోషల్ మీడియా కేంద్రంగా తయారయ్యే పోస్టులను..పోస్ట్ చేయడమే వీళ్ల పని అంటున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది ఒకే సామాజికవర్గం వారు ఉన్నారంటున్నారు కూటమి నేతలు. వాళ్లందరికీ బంధుత్వం కూడా ఉన్నట్లు ఆరోపిస్తున్నారు.

ఇలా కడప పోలీసుల దర్యాప్తులో బయటికి వచ్చిన బాగోతం ఇప్పుడు కొత్త టర్న్ తీసుకుంటోంది.ఇప్పటికే అసభ్యకర పోస్టులు, మహిళలను కించపరిచారంటూ కేసులు నమోదు అవుతుంటే..ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం మీద ఉన్నతస్థాయి విచారణ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సెగ ఏకంగా వైసీపీ పెద్ద నేతల దాకా వెళ్లే అవకాశం కూడా ఉందంటున్నారు. కార్పొరేషన్ల ఏర్పాటు చేసింది ఎందుకోసం? వాళ్లందరినీ ఉద్యోగులుగా ఎలా నియమించారు.? పార్టీ కోసం వాడుకుని ప్రభుత్వం నుంచి జీతాలు ఎందుకు ఇచ్చినట్లు.? ఈ ఓవరాల్ ఎపిసోడ్ వెనక మాస్టర్ మైండ్ ఎవరు..వాళ్లకు వంత పాడిందెవరనే దానిపై కూటమి సర్కార్ కూపీ లాగుతోందట. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అరెస్టులే కాదు..కార్పొరేషన్ల ద్వారా పార్టీ సానుభూతిపరులకు ఇచ్చినట్లు చెప్తున్న జీతాల రికవరీ కూడా చేస్తామంటున్నారు కూటమి నేతలు.

# జగన్ కు అదానీ దెబ్బ,,,

విజయవాడ, నవంబర్ 22, దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన ఓ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. సోలార్ విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన ఓ భారీ డీల్ కుదుర్చుకునేందుకు.. ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్-ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది.ఈ వివాదాస్పద వ్యవహారం క్రమంగా.. ఆంధ్రప్రదేశ్ గత సర్కార్ కు చుట్టుకుంటోంది. 2019- 2024 మధ్య అధికారంలోని ప్రభుత్వంతో గౌతమ్ అదానీ.. ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నడిపినట్లు ఆమెరికా విచారణ సంస్థ ఎఫ్‌బీఐ పరిశోధనలో వెల్లడైంది. ఇందుకోసం.. దాదాపు రూ.1,750 కోట్లు చేతులు మారినట్లు అమెరికా విచారణ సంస్థ.. ఆ దేశ కోర్టుకు సమర్పించిన ఫైలింగ్ లో వెల్లడించింది.లాభదాయకమైన సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు రూ. 2.029 కోట్లు లంచం ఇచ్చినందుకు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీ, మరో ఆరుగురు వ్యక్తుల ప్రయత్నించినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపడతామని ప్రకటించిన అమెరికా విచారణ సంస్థ.. ప్రాథమిక నివేదికను కోర్టుకు అందించింది. ఈ కుట్రలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తి సహకారం ఎక్కువగా ఉందన్న ఎఫ్‌బీఐ.. తేదీలతో సహా వారి మధ్య భేటీలను వెల్లడించి, ఆశ్చర్యపరిచింది.భారత్ లో అతిపెద్ద సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సహా మరో ఆరుగురు.. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వజూశారని అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. అయితే.. ఈ ఒప్పందాలను చూపించి బ్యాంకులు, ఇన్వెస్టర్లను తప్పుడు సమాచారంతో మోసం చేసి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఇందులో అమెరికా ఇన్వెస్టరు సైతం ఉండడంతో.. తమ దేశ పెట్టుబడిదారుల్ని మోసం చేస్తున్నారన్న కారణంతో ఆమెరికా దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తునకు సంబంధించిన అంశాలను తెలుపుతూ.. కోర్టులో ఎఫ్‌బీఐ ఫైలింగ్ చేసింది.రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు.. అదానీ గ్రీన్ ఎనర్జీ గ్రూప్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల సహకారం కోరిన అదానీ, ఇతర నిందితులు.. ప్రతిగా భారీగా లంచాలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. భారత ప్రభుత్వంలోని వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా ఇచ్చేందుకు ప్రయత్నించారని ఎఫ్‌బీఐ నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకునే ఒప్పందాలతో అదానీ గ్రీన్ ఎనర్జీ, దాని అనుబంధ సంస్థలకు పెద్ద మొత్తంలో లాభం చేకూరుతుందని పేర్కొంది.సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం కుదుర్చేందుకు అదానీ స్వయంగా ప్రయత్నించారు.ఇందుకోసం..అతను ఆంధ్రప్రదేశ్ లోని అత్యున్నత స్థాయి కార్యనిర్వహాక వ్యక్తిని కలిశారు అని అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ స్పష్టంగా వెల్లడించింది. ఇక్కడే అసలు విషయం పూర్తిగా వెల్లడైంది. ఆమెరికా విచారణ సంస్థ తేదీలతో సహా తెలిపినట్లుగా..2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. నాడు విద్యుత్ సరఫరా ఒప్పందాలపై చర్చలు జరిగినట్లు ప్రభుత్వం తెలపగా.. దాదాపు ఏడు మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ముఖ్యమంత్రి జగన్ అంగీకారం తెలుపారు. ఇది.. భారత్ లోని మరే ఇతర రాష్ట్రాలు చేసుకోలేనంత భారీ ఒప్పందంగా.. అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వెల్లడించింది.

# గౌతమ్ ఆదానీకి వరుస షాక్ లు



ముంబై, నవంబర్ 22, మనదేశంలో అపర కుబేరుడు.. రిలయన్స్ సంస్థను అధిగమించి.. అన్ని రంగాలలో దూసుకుపోతున్న గౌతమ్ అదాని కి దెబ్బల మీద దెబ్బలు తగులుతున్నాయి. గ్రీన్ ఎనర్జీ విషయంలో న్యూయార్క్ అధికారులు అభియోగాలు మోపిన నేపథ్యంలో.. ఆయన కంపెనీకి చెందిన షేర్లు విపరీతమైన నష్టాలను నమోదు చేశాయి.ఈ విషయాన్ని మర్చిపోకముందే మరో షాక్ గౌతమ్ ఆదానికి తగిలింది. గౌతమ్ అదాని ప్రపంచంలోని పలుదేశాలలో వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అందులో కెన్యా కూడా ఒకటి. కెన్యా దేశంలో గౌతం అదాని గ్రూప్ రెండు ప్రాజెక్టులను ఆదేశ ప్రభుత్వంతో కుదుర్చుకుంది. కెన్యా దేశంలో పవర్ ట్రాన్స్ మిషన్ లైన్లో నిర్మించడానికి కెన్యా దేశంతో గతంలో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ప్రకారం 700 మిలియన్ డాలర్లను కెన్యా ప్రభుత్వం ఖర్చు చేయనుంది. అయితే గౌతమ్ అదాని గ్రీన్ ఎనర్జీ కంపెనీ పై ఆరోపణలు రావడంతో.. న్యూయార్క్ అధికారులు అభియోగాలు మోపి.. ఏకంగా అరెస్టులకు వారెంట్లు జారీ చేయడంతో కెన్యా ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ క్రమంలో గౌతమ్ అదానీ గ్రూప్ తో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేసుకుంటున్నట్టు కెన్యా అధ్యక్షుడు విలియం రుతో ప్రకటించారు. ఇది మాత్రమే కాకుండా జేకేఐ విమానాశ్రయ విస్తరణ ప్రణాళికలు కూడా రద్దు చేస్తున్నట్టు వెల్లడించారు. దీంతో గౌతమ్ అదాని గ్రూప్ కు కోలు కోలేని షాక్ తగిలింది. కొంతకాలంగా గౌతమ్ అదానీ గ్రూప్ కెన్యాలో కార్యకలాపాలు సాగిస్తోంది. మైనింగ్లో అడుగుపెట్టడానికి ప్రణాళికలు రచిస్తోంది. ఇప్పటికే కెన్యా ప్రభుత్వంతో వ్యూహాత్మక వ్యాపారాలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నది. ఈ క్రమంలోనే కెన్యా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గౌతం అదానీ గ్రూప్ కు కోలుకోలేని షాక్ ఇచ్చింది.సౌర విద్యుత్ తయారీ లో భాగంగా 20 సంవత్సరాల లో రెండు బిలియన్ డాలర్ల లాభం పొందడానికి గౌతం అదానీ కంపెనీ ఒప్పందాలకుదురుచుకుంది. కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే అంతస్థాయిలో లాభాలు కళ్ల చూడాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలో అధికారులకు 265 మిలియన్ డాలర్లను గౌతమ్ అదానీ గ్రూప్ లంచాలుగా ఇచ్చిందని అభియోగాలు ఒక్కసారిగా గుప్పమన్నాయి. అంతేకాకుండా గౌతమ్ అదానీ ఏర్పాటు చేసిన గ్రీన్ ఎనర్జీ కంపెనీలోకి అక్రమంగా అప్పులు వచ్చాయని.. పెట్టుబడిదారులు కూడా తప్పుడు విధానాలలో ఇన్వెస్ట్మెంట్ చేశారని న్యూయార్క్ అధికారులు అభియోగాలు మోపారు. దీంతో గౌతమ్ ఆదాని గ్రూప్ మరోసారి వార్తల్లోకి ఎక్కింది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి స్టాక్ మార్కెట్లో గౌతమ్ ఆదాని కంపెనీకి సంబంధించిన షేర్లు ఒక్కసారిగా పతనమయ్యాయి. అయితే న్యూయార్క్ అధికారులు మోపిన అభియోగాలను తాము కోర్టులోనే తేల్చుకుంటామని గౌతమ్ ఆదాని ప్రకటించినప్పటికీ జరగాల్సిన నష్టం జరిగిపోయింది. న్యూయార్క్ అధికారులు మోపిన అభియోగాలు అలా ఉండగా.. కెన్యా ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను రద్దు చేయడం ఇప్పుడు సంచలనంగా మారింది.

# పిల్లలకు సోషల్ మీడియా నిషేధం....

ప్రస్తుతం చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు మొబైల్ ఫోన్‌తోనే ఎక్కువ సేపు గడుపుతున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ఈ పరిస్థితి మరీ తీవ్రమైంది. ఎప్పుడైనా సోషల్ మీడియా యాప్‌ల్లో అంతరాయం కలిగితే వినియోగదారులు ఎంతో గాబరా పడుతుంటారు. దీన్ని బట్టి సోషల్ మీడియా ప్రభావం మనుషులపై ఎంతగా ఉంటుందో చెప్పవచ్చు. అయితే ఈ వినియోగం పిల్లల జీవితంపై ఎక్కువ వ్యతిరేక ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. పిల్లలు మానసిక కుంగుబాటుతో పాటు అనేక సమస్యలకు గురవుతున్నారు.ముఖ్యంగా అమ్మాయిల విషయంలో అశ్లీల దృశ్యాలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం పరిపాటి అవుతోంది. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించేలా చట్టాన్ని తీసుకురావడానికి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం స్వాగతించాల్సిందే. నవంబర్ 18న ఆస్ట్రేలియా పార్లమెంట్ సమావేశంలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు.ప్రజా ప్రతినిధులు ఆమోదించిన 12 నెలల తరువాత ఈ చట్టం అమలులోకి వస్తుందని చెప్పారు. తల్లిదండ్రుల సమ్మతి ఉన్న పిల్లలకు లేదా ఇప్పటికే అకౌంట్స్ ఉన్న పిల్లలకు కూడా ఇందులో మినహాయింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ చట్టం అమలైన తరువాత ఎక్స్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు 16 ఏళ్ల లోపు పిల్లలను తమ సైట్ల నుంచి ఎలా మినహాయించాలో ఆలోచించాలని సూచించారు.నిర్దేశించిన వయో పరిమితిని సోషల్ మీడియా సంస్థలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఈ జరిమానా వర్తించదు. చిన్నపిల్లలకు యాక్సెస్ నిరోధించే బాధ్యత సోషల్ మీడియా సంస్థలదే. ఆ బాధ్యత తల్లిదండ్రులు లేదా యువతపై ఉండదు. దీనిపై ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, హెడ్ ఆఫ్ సేఫ్టీ యాంటిగోన్‌డేవిస్ ప్రభుత్వం నిర్ణయంచే వయో పరిమితులను తమ సంస్థ గౌరవిస్తుందని చెప్పారు. అయితే ఈ నిబంధనలను ఎలా అమలు చేయాలన్న దానిపై లోతైన చర్చ అవసరమన్నారు. యాప్ స్టోర్‌లలో, ఆపరేటింగ్ సిస్టమ్‌లలో సమర్థవంతమైన టూల్స్‌తో తల్లిదండ్రులు వారి పిల్లలు ఏ యాప్ వాడాలో నియంత్రించవచ్చని చెప్పారు.ఇది చాలా సులభమైన, సమర్థవంతమైన పరిష్కారం అని అభిప్రాయపడ్డారు. గత ఏడాది 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా వాడకంపైనిషేధంవిధించాలనిఫ్రాన్స్ ప్రతిపాదించింది.కానీవినియోగదారులు, తల్లిదండ్రుల సమ్మతితో నిషేధాన్ని దాటవేయగలిగారు. అమెరికాలో 13 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను యాక్సెస్ చేయాలంటే తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరిగా ఉండాల్సిందే. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాలని చాలా సోషల్ మీడియా సంస్థలు విధానాలను ఏర్పర్చుకున్నాయి. బ్రిటన్ మీడియా రెగ్యులేటర్ 'ఆఫ్‌కామ్' 2022లో నిర్వహించిన అధ్యయనంలో బ్రిటన్ లోని 80% మంది పిల్లలు 12 ఏళ్ల వయసులోనే సోషల్ మీడియా అకౌంట్లు కలిగి ఉన్నారని బయటపడడం విశేషం. అమెరికా సర్జన్ జనరల్స్ ఆఫీస్‌కు చెందిన 2023 అడ్వైజరీ అధ్యయనంలో సోషల్ మీడియా నుంచి పిల్లలను నెల రోజుల కన్నా ఎక్కువ కాలం దూరంగా ఉంచితే వారికి మానసిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టమైంది.మన దేశంలో లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సోషల్ మీడియాకు ఏ విధంగా నిమగ్నం అయిపోతున్నారో అధ్యయనం నిర్వహించింది. సోషల్ మీడియా ప్రభావం 9 ఏళ్ల నుంచి 17 ఏళ్ల పిల్లలపై ఎలా ఉంటుందో తెలుసుకోడానికి ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 31 వరకు 368 అర్బన్ జిల్లాల్లో 13,743 మంది తల్లిదండ్రులపై సర్వే చేయగా 70,000 స్పందనలు వచ్చాయి. 66 శాతం తల్లిదండ్రుల్లో 47% మంది తమ పిల్లలు ప్రతిరోజూ మూడు నాలుగు గంటలు, 10 శాతం తల్లిదండ్రులు తమ పిల్లలు ఆరు గంటలకు మించి సోషల్ మీడియాలోనే లీనమైపోతున్నారని వెల్లడించారు. 58% తల్లిదండ్రులు తమ పిల్లల్లో దూకుడుతనం కనిపిస్తోందని, 49% తల్లిదండ్రులు తమ పిల్లలు అసహనంగా ఉంటున్నారని, మరో 49% మంది తమ పిల్లలు నీరసంగా ఉంటున్నారని తెలిపారు. 42 శాతం మంది తమ పిల్లలు కుంగుబాటుకు గురవుతున్నారని, 30% మంది తమ పిల్లలు అన్ని విషయాల్లో అత్యుత్సాహం చూపిస్తుంటారని చెప్పారు. ఏదేమైనా పిల్లల మానసిక ప్రవర్తనపై, ఆరోగ్యంపై సోషల్ మీడియా అనేక విధాలుగా వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నట్టు స్పష్టమవుతోంది. అయితే ఆస్ట్రేలియాలో పిల్లలకు సోషల్ మీడియా నిషేధం అమలు ఎలా సాధ్యమవుతుందో మున్ముందు గమనించాల్సిందే.

# 5నెలల ముందే ఆప్ పేర్లు ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 22, అవినీతి రహిత పాలన అందించడమే లక్ష్యంగా ఆమ్ ఆద్మీ పార్టీ పురుడు పోసుకుంది. పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీలో ఈ పార్టీని ప్రారంభించారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు షాక్ ఇచ్చి.. ప్రారంభించిన ఏడాదికే ఢిల్లీలో అధికారంలోకి వచ్చింది ఆప్. పార్టీ అధినేత కేజ్రీవాల్ ఢిల్లీకి మూడుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత పంజాబ్‌లోనూ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారు. ఉత్తర భారత దేవంలోని గోవా, గుజరాత్, హర్యాన, పశ్చిమబెంగాల్ తదితర రాష్ట్రాలోనూ పోటీ చేసిన ఆప్.. ఎన్నికల నిబంధనల మేరకు ఓట్లు సాధించి జాతీయ పార్టీగా కూడా గుర్తింపు పొందింది. ఇక ఎన్నికల వేళ.. అరవింద్ కేజ్రీవాల్ నుసరించే వ్యూహాలు భిన్నంగా ఉంటాయి. రాజకీయాల్లో ఆరితేరిన నేతలకు భిన్నంగా కేజ్రీవాల్ ఆలోచిస్తారు. వ్యూహాలు రచిస్తారు. పంజాబ్ ఎన్నికల్లో ఆయన సీఎం అభ్యర్థిని ప్రజల అభిప్రాయం మేరకే ఎంపిక చేశారు. ఈమేరకు టెక్నాలజీ సాయంతో ఓటింగ్ కోరారు. ఆప్ విధానాలు నచ్చి వివిధ పార్టీల నేతలు కూడా అందులో చేరారు. ఇక పంజాబ్‌లో కూడా ప్రస్తుతం ఆప్ అధికారంలో ఉంది.ఢిల్లీ మద్యం కుంభకోణంలో చిక్కుకున్న అర్వింద్ కేజ్రీవాల్ నాలుగు నెలలు జైల్లో ఉన్నారు. సీఎంగా జైలు నుంచే పాలన సాగించారు. అయితే బెయిల్ మంజూరైన తర్వాత సీఎం పదవికి రాజీరామా చేశారు. అతిషిని తన వారసురాలుగా సీంఎ కుర్చీలో కూర్చోబెట్టారు. ఇదిలా ఉంటే.. ఢిల్లీలో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికలో కోసమే పార్టీని మరింత బలోపేతం చేయడానికి అరవింద్ కేజ్రీవాల్ సీఎం పదవికి రాజీనామా చేశారని పలువురు అభిప్రాయపడ్డారు. అయితే పార్టీ కోసం ఢిల్లీలో పాదయాత్ర కూడా చేస్తారని ఆ పార్టీ నేతలు తెలిపారు. కానీ, పాదయాత్ర చేయలేదు. ప్రస్తుతం ఢిల్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు.ఇక ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉంది. కానీ, అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. పార్టీ తరఫున వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే తొలి జాబితాను విడుదల చేశారు. ఇందులో 11 మంది పేర్లు ఉన్నాయి. దీంతో ఢిల్లీ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించిన తొలి పార్టీగా ఆప్ నిలిచింది.

ఇక కేజ్రీవాల్ ప్రకటించిన ఆఫ్ ఫస్ట్ లిస్ట్‌లో ఛత్తర్పూర్ నుంచి బ్రహ్మ సింగ్, తన్వార్, కిరాడి నుంచి అనిల్ ఝా, విశ్వాస్‌నగర్ నుంచి దీపక్ సింగ్లా, రోహతాస్ నగర్ నుంచి సరితాసింగ్, లక్ష్మీనగర్ నుంచి బీబీ.త్యాగి, బదార్పూర్ నుంచి రామ్ సింగ్, సీలన్‌పూర్ నుంచి జుబీర్ చౌధురి, సీమాపురి నుంఇ వీర్ సింగ్ ధిగాన్, హోండా నుంచి గౌరవ్‌శర్మ, కర్వాల్ నగర్ నుంచి మనోజ్ త్యాగి, మాటియాల నుంచి సోమేష్ షౌకీన్ పేర్లు ప్రకటించారు. 11 మందిలో ఆరుగురు కాంగ్రెస్. బీజేపీ నుంచి ఆప్‌లో చేరిన వారే ఉన్నారు. బీజేపీ మాజీ నేతలు బ్రహ్మసింగ్ తన్వర్, అనిల్ ఝా, బీబీ త్యాగితోపాటు కాంగ్రెస్ మాజీ నాయకులు చైదరి జుబేర్ అహ్మద్, వీర్ ధింగన్, సుముష్ సోకీన్లను అభ్యర్థులుగా కేజ్రీవాల్ ప్రకటించారు. ముగ్గురు సిట్టింగ్‌కు కేజ్రీవాల్ టికెట్ నిరాకరించారు

# బీఎస్ఎన్ఎల్ వైపు ప్రజల చూపు

ముంబై, నవంబర్ 22, (న్యూస్ పల్స్) టారిఫ్‌లను ఖరీదైనవిగా మార్చిన తర్వాత టెలికాం కంపెనీలు నిరంతరం ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయి. టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా సెప్టెంబర్ నెల చందాదారుల డేటాను విడుదల చేసింది. ట్రాయ్ విడుదల చేసిన డేటాను చూస్తుంటే, జియో, ఎయిర్ టెల్, ఐడియా కంపెనీల పరిస్థితి చాలా దారుణంగా ఉందని స్పష్టమవుతోంది. మరోవైపు ప్రభుత్వ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ లాభపడుతోంది. సెప్టెంబరు నెలలో టెలికాం కంపెనీలు కోటి మందికి పైగా సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయినట్లు తెలుస్తోంది.సెప్టెంబర్ నెలలో భారతీ ఎయిర్‌టెల్ 14 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను కోల్పోగా, వోడాఫోన్ ఐడియా 15 లక్షల మంది సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాల కంటే ముఖేష్ అంబానీకి చెందిన టెలికాం కంపెనీ రిలయన్స్ జియో భారీ నష్టాలను చవిచూసింది. సెప్టెంబర్ నెలలో జియో దాదాపు 79 లక్షల మంది సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయింది. అంటే ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాతో పోలిస్తే జియో పరిస్థితి మరింత దారుణంగా మారిందని తెలిసిపోతుంది.

రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియా, భారతీ ఎయిర్‌టెల్ మళ్లీ ప్రజల విశ్వాసాన్ని పొందాలంటే, కంపెనీ తన వ్యూహాన్ని కొంచెం మార్చుకోవాలి. టారిఫ్ పెంపు కారణంగా కోపంతో ఉన్న వినియోగదారులు బీఎస్ఎన్ఎల్‌కి మారుతున్నారు. ఎందుకంటే బీఎస్ఎన్ఎల్ ప్లాన్‌లు చాలా చౌకగా ఉంటాయి. దీని నుండి జియో, ఎయిర్‌టెల్, వోడాఫోన్ ఐడియా వినియోగదారులను మళ్లీ నెట్‌వర్క్‌కి కనెక్ట్ చేయవలసి వస్తే, ప్లాన్‌లను చౌకగా చేయవలసి ఉంటుందని స్పష్టమవుతుంది. లేదంటే వినియోగదారులు తక్కువ ధరకు ప్లాన్‌లను అందించాల్సి ఉంటుంది.ఒకప్పుడు అందరూ ప్రైవేట్ కంపెనీలతో సహవాసం చేసేవారు. కానీ టారిఫ్‌ల పెంపు తర్వాత ఆట మొత్తం మారిపోయింది. ఒకవైపు ఠితీబివశ్రీ, ఏతినీ, ఎతి టారిఫ్ పెంపును ప్రకటించగా, మరోవైపు ఖాఔఒ కంపెనీ టారిఫ్‌లను పెంచదని స్పష్టం చేసింది. క్రమంగా ప్రజలు బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్‌కి కనెక్ట్ అవ్వడానికి ఇదే కారణం. సబ్‌స్క్రైబర్‌లను కోల్పోయే బదులు బీఎస్ఎన్ఎల్ సెప్టెంబరులో 8 లక్షల మంది కొత్త సబ్‌స్క్రైబర్‌లను నెట్‌వర్క్‌లోకి చేర్చుకుంది. దీంతో బీఎస్ఎన్ఎల్‌కు మంచి రోజులు వస్తున్నాయి. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 4జీ నెట్‌వర్క్‌ను కొన్ని ప్రాంతాల్లో ఉంది. పూర్తి స్థాయిలో తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు ముమ్మరం అవుతున్నాయి. అంతేకాకుండా 5జీ నెట్‌వర్క్‌ను కూడా త్వరలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వేగంగా పనులు కొనసాగుతున్నాయి.

# రామకుప్పంలో కిడ్నాపర్ల ముఠా అరెస్ట్

చిత్తూరు కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పంలో కిడ్నాపర్ల ముఠాను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 14న మండలంలోని గోవిందపల్లి మాజీ సర్పంచ్ కుటుంబాన్ని ఐటీ శాఖ పేరుతో కిడ్నాప్ చేసిన సంగతి పాఠకులకు విధితమే. ఈ కేసులో ప్రధాన నిందితులు ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల చెంత మూడు వాహనాలు సీజ్ చేశారు. రైస్ పుల్లింగ్ వ్యవహారంతో పాటు ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్ కు కారణమని తెలిసింది.

# మోడీనే టార్గెట్ చేసిన ట్రుడో..

న్యూఢిల్లీ, నవంబర్ 22, (న్యూస్ పల్స్) కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో స్వార్థంతో భారత్, కెనడా మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఖలిస్తానీ ఉగ్రవాది, సిక్కు వేర్పాటు వాది అయిన హర్‌దీప్ సింగ్ నిజ్జర్ ఏడాది క్రితం కెనడాలో హత్యకు గురయ్యాడు. ఈ హత్య వెనుక భారత ఏజెంట్ల హత్య ఉందని కెనడా ప్రధాని ట్రూడో ఆరోపించారు. దీనిని భారత్ నాడే ఖండించింది. సాక్షాలు ఉంటే ఇవ్వాలని సూచించింది. ఏడాదిపాటు మౌనంగా ఉన్న కెనడా.. తాజాగా ఈ విషయాన్ని తెరపైకి తెచ్చి.. భారత రాయబారులను విచారణ చేసేందుకు సిద్ధమైంది. వెంటనే అప్రమత్తమైన భారత్.. కెనడాలోని భారత రాయబారులను వెనక్కి పిలిపించింది. భారత్‌లోని కెనడా రాయబారులను ఇక్కడి నుంచి బహిష్కరించింది. దీంతో దౌత్య సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో కెనడా.. భారత్ విషయాలను అమెరికాకు చెందిన న్యూయార్క్ టైమ్స్ పత్రికకు అందించి కథనాలు రాయించింది. అంతటితో ఆగకుండా నిజ్జర్ హత్య గురించి భారత హోం మంత్రి అమిత్‌షాకు ముందే తెలుసని ఆరోపించింది.పాకిస్తాన్ తరహాలో భారత్‌తో గిచ్చి కయ్యం పెట్టుకోవాలని చూస్తున్న కెనడా ప్రధాని ట్రూడో తాజాగా మరోమారు కెనడా పత్రిలో భారత ప్రధాని మోదీపై ఓ కథనం రాయించారు. అందులో నిజ్జర్ హత్య గురించి భారత ప్రధాని మోదీకి ముందే తెలుసని రాసుకొచ్చింది. ఈ కథనాన్ని భారత్ తీవ్రంగా ఖండించింది. వచ్చే ఏడాది జరిగే ఎన్నికల్లో గెలవడానికి భారతీయులను తమవైపు తిప్పుకోవడానికి కెనడా ప్రధాని చేస్తున్న చీప్ ట్రిక్స్‌లో ఇది ఒకటి అయింది.ఇక కెనడా కథనంపై భారత విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందించారు. తాము సాధారణంగా మీడియాలో వచ్చే కథనాలపై స్పందిరమని, కొన్ని అసత్య ప్రకటనల నేపథ్యంలో స్పందించాల్సి వస్తోందన్నారు. నిరాధారమైన ఇలాంటి కథనాలు హాస్యాస్పదమని పేర్కొన్నారు. ఇలాంటి వార్తలకు అధికారుల జవాబు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. ఇలాంటి కథనాలతో రెండు దేశాల మధ్య సంబంధాలను మరింత దెబ్బతీస్తాయని తెలిపారు.

## ప్రభాస్ తో నాకు సంబంధం లేదు షర్మిల

హైదరాబాద్ స్టార్ హీరో ప్రభాస్ తో తనకు ఎలాంటి సంబంధం లేదని రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ వైఎస్ షర్మిల స్పష్టం చేశారు. వైఎస్ జగన్ తన సైతాన్ సైన్యంతో ప్రభాస్ తో నాకు సంబంధం ఉందని ప్రచారం చేయించారని ఆమె ఆరోపించారు. 'నేనెప్పుడూ ప్రభాస్ ను చూడలేదు. నా పిల్లల మీద ప్రమాణం చేసి అప్పుడు చెప్పా.. ఇప్పుడు చెబుతున్నా' అని వైఎస్ షర్మిల అన్నారు.

# పాలిటిక్స్ కు పోసాని బైబై...



హైదరాబాద్, నవంబర్ 22, సినీ నటుడిగా,రచయితగా,దర్శకుడిగా ఎంతో మంచి గుర్తింపు తెచ్చుకున్న పోసాని కృష్ణ మురళి, రాజకీయాల్లోకి అడుగుపెట్టి పదునైన మాటలతో ప్రత్యర్థులను విమర్శించిన సందర్భాలను ఎన్నో మనం చూసాము. 2009 వ సంవత్సరంలో మెగాస్టార్ చిరంజీవి స్థాపించిన ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేసిన పోసాని కృష్ణ మురళి, ఆంధ్ర ప్రదేశ్ లోని గుంటూరు జిల్లా, చిలకలూరిపేట నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే గా పోటీ చేసి ఓడిపోయాడు. ఆ తర్వాత ప్రజారాజ్యం పార్టీ ని కాంగ్రెస్ లోకి విలీనం చేసిన తర్వాత నుండి వైసీపీ పార్టీ లో చేరిన పోసాని కృష్ణ మురళి, అప్పటి నుండి నేటి వరకు వేరే పార్టీ మారకుండా, వైసీపీ లోనే కొనసాగుతూ వచ్చాడు. మాజీ సీఎం జగన్ ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ పదవులు ఆఫర్ చేసినప్పటికీ కూడా తీసుకోకుండా నిస్వార్థంగా ఆ పార్టీ కోసం ఇన్నాళ్లు పని చేస్తూ వచ్చాడు.ఎవరైనా వైసీపీ పార్టీ పై విమర్శలు చేస్తే, వాళ్లపై ఈయన నోరు ఎవ్వరూ ఊహించని రీతిలో పారేసుకునేవాడు. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ ని ఆయన ఏ స్థాయిలో తిట్టాడో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. పవన్ కళ్యాణ్ తల్లిని, కూతుర్లని కూడా వదలకుండా అత్యంత నీచమైన పదజాలంతో, సభ్య సమాజం సిగ్గుపడేలా, ఆయన సొంత ఇంట్లో మనుషులు కూడా అసహ్యించుకునే రేంజ్ పదాలు ఉపయోగించాడు. దీనిపై అప్పట్లో పవన్ కళ్యాణ్ అభిమానులు పోసానిపై దాడి చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. పోలీస్ సెక్యూరిటీ తో ఆయన బయట తిరిగేవాడు. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చింది.పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నాడు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ లపై అసభ్యకరమైన వ్యాఖ్యలు చేస్తున్న ఒక్కొక్కరిని అరెస్ట్ చేస్తున్న నేపథ్యంలో పోసాని మీద కూడా కేసు నమోదు అయ్యింది.త్వరలోనే ఆయన అరెస్ట్ కాబోతున్నాడు అనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. దీంతో పోసాని కాసేపటి క్రితమే ప్రెస్ మీట్ ని ఏర్పాటు చేసి 'నేను ఇన్ని రోజులు రాజకీయ పరంగా, నేను ఇష్టపడిన నాయకుడిని ఎలా పొగుడుతూ వచ్చానో మీ అందరికీ తెలుసు. నిజాయితీ గల నాయకులను ఎల్లప్పుడూ పొగుడుతూ ఉండడం, వాళ్లకి సపోర్టుగా నిలబడి నేను మాట్లాడిన తీరుని కూడా మీరంతా గమనించారు. ఇక మీదట నేను రాజకీయాలకు దూరం గా ఉండాలని నిర్ణయించుకున్నాను. ఈ క్షణం నుండి నేను చనిపోయే వరకు నా కుటుంబం కోసం బ్రతుకుతాను. పవన్ కళ్యాణ్, చంద్రబాబు, జగన్ రాజకీయాల జోలికి వెళ్లను. సాక్షి టీవిలో ఈమధ్యనే డింగ్ డాంగ్ అనే ప్రోగ్రాం చేయడానికి ఒప్పుకున్నాను. కానీ ప్రోగ్రాం రాజకీయాలకు సంబంధించినది కాబట్టి, అందులో నుండి కూడా తప్పుకుంటున్నాను' అంటూ చెప్పుకొచ్చాడు పోసాని కృష్ణ.

# ఏటా పెరుగుతున్న రిటైర్మెంట్ భారం
## ఉద్యోగ వయస్సు పెంచే యోచన

హైదరాబాద్, నవంబర్ 22, ఆరు గ్యారెంటీల అమలు..సంక్షేమ పథకాలు..అప్పులకు వడ్డీలు-ఇన్‌స్టాల్ మెంట్స్.. ఇలా తలకు మించిన భారంతో అసలే ఆర్థిక కష్టాల్లో ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి ఇప్పుడు టెన్షన్ వచ్చి పడిందట. ఉద్యోగుల రిటైర్మెంట్ టాపిక్ రేవంత్ సర్కార్‌ను కలవర పెడుతోందట. ఈ ఏడాది చివరకు రిటైర్ అవుతున్న 8 వేల మంది ఉద్యోగులతో పాటు వచ్చే ఐదేళ్లలో రిటైరవుతున్న 44 వేల మంది ఉద్యోగులకు బెనిఫిట్స్ ఎలా చెల్లించాలన్న ఆలోచనలో పడింది కాంగ్రెస్ సర్కార్. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగుల ఏజ్ లిమిట్ 58 నుంచి 61 ఏళ్లకు పెంచారు. వాళ్ల రిటైర్‌మెంట్ గడువు ఈ సర్కార్ హయాంలో ముగుస్తుంది. దీంతో ఒక్కసారిగా రిటైర్ అవుతున్న ఉద్యోగుల భారం రేవంత్ సర్కార్‌పై పడుతుందని అంటున్నారుపదవీ విరమణ తర్వాత ప్రభుత్వ ఉద్యోగికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ చాలానే ఉంటాయి. వారి బేసిక్ పేకు అనుగుణంగా ఊఖీం, సీసీఏ, డీఏలను కలుపుకుని మొత్తం వేతనానికి 10 రెట్లు లీవ్ శాలరీ రూపంలో ఇవ్వాల్సి ఉంటుంది. ఈ లీవ్ శాలరీల మొత్తం ఒక్కో ఉద్యోగికి సగటున 8 లక్షల వరకు ఉంటుందట. అలాగే గ్రాట్యుటీ కింద 12 లక్షలు, కమ్యుటేషన్ రూపంలో మరో 20 లక్షల రూపాయలు చెల్లించాలి. వేతనం నుంచి నెలనెలా దాచుకున్న జనరల్ ప్రావిడెంట్ ఫండ్, గ్రూప్ ఇన్సురెన్స్, సరెండర్ లీవ్‌లు అన్ని కలుపుకుని ఒక్కో ఉద్యోగికి సగటున 30 నుంచి 50 లక్షల రూపాయలు ప్రభుత్వం చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఈ డిసెంబర్ చివరి నాటికి 8 వేల మంది ఉద్యోగులు రిటైర్ కానున్నట్లు అధికారిక వర్గాలు చెబుతున్నాయి.2025 డిసెంబర్ నాటికి దాదాపు 10 వేల మంది ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో 2026, 2027లోనూ దాదాపు 10 వేల మంది చొప్పున ఉద్యోగులు రిటైర్ అవ్వనున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. 2028లో మరో 8 వేల మంది పదవీ విరమణ చేస్తారు. ఇలా రిటైర్డ్ అవుతున్న ఉద్యోగులకు చెల్లించడానికి ప్రభుత్వానికి అదనంగా ప్రతి సంవత్సరం దాదాపు 5 వేల కోట్ల రూపాయలు అవసరమవుతాయని అంటున్నారు అధికారులు. అంటే నెలకు తక్కువలో తక్కువ 400 కోట్లు వీరికే కేటాయించాలన్నమాట.ఈ సంవత్సరం ఇప్పటికే రిటైరైన ఉద్యోగులతో పాటు, ఈ డిసెంబర్‌లో రిటైర్ అవుతున్న ఉద్యోగులకు దాదాపు 3 వేల 200 కోట్ల వరకు అవసరం అవుతాయని అంచనా వేస్తున్నారు. అసలే ఆర్థిక కష్టాలను ఎదుర్కొంటున్న తెలంగాణ ప్రభుత్వం రిటైర్ ఉద్యోగులకు బెనిఫిట్స్ చెల్లించే పరిస్థితుల్లో లేదని సచివాలయ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల ఏజ్ లిమిట్‌ను పెంచడమే ఇప్పటి పరిస్థితికి కారణమన్న వాదన వినిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 58 నుంచి 61 ఏళ్లకు పెంచారు కేసీఆర్. 2021లో తీసుకున్న ఈ నిర్ణయంతో 2024 మార్చి 31 వరకు తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్లు దాదాపు జరగలేదు. దీంతో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వాళ్లకు ఎలాంటి చెల్లింపులు చేయాల్సిన అవసరం రాలేదు. కేసీఆర్ హయాంలో మూడేళ్ల పాటు రిటైర్మెంట్లు లేకపోవడం..రేవంత్ అధికారంలోకి వచ్చిన 3 నెలల నుంచే పదవీ విరమణలు మొదలవడంతో ఒక్కసారిగా భారం మీద పడుతోందట. రిటైరైన ఉద్యోగులకు బెనిఫిట్స్ పే చేయడం కాంగ్రెస్ సర్కార్‌కు కష్టంగా మారిందట.ఇక తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2022 జులైకి సంబంధించిన డీఏ ప్రకటించింది. ఇంకా మరో నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయ్. ఇక కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగులు సాధారణ జీవిత బీమా కింద జమ చేసుకున్న ఫండ్స్‌ను వాడుకుంది. ఇప్పుడు రిటైరయ్యే ఉద్యోగులకు వారి జీఎల్ఏ పాటు జీపీఎఫ్ ఇంట్రెస్ట్ కూడా చెల్లించాల్సి వస్తోంది. ఇవన్నీ రేవంత్ ప్రభుత్వానికి తలకు మించిన భారంగా మారాయని తెలుస్తోంది. వచ్చే ఐదేళ్లలో ఏకంగా 44 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేయనున్నారు. వీళ్లందరికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద సగటున 30 లక్షల నుంచి కోటి రూపాయల వరకు చెల్లించాలి. అంటే వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రభుత్వంపై దాదాపు 20 వేల కోట్ల రూపాయల భారం పడొచ్చని అంచనా వేస్తోంది ఆర్థిక శాఖ.

అందుకే ప్రత్యామ్నాయాలు ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.పక్క రాష్ట్రం ఏపీలో ఉద్యోగుల రిటైర్మెంట్ ఏజ్ 62 ఏళ్లుంటే..తెలంగాణలో 61 ఏళ్లుగా ఉంది. అలా ఏడాది పెంచితే ఎలా ఉంటుందని లెక్కలు వేసుకుంటుందట ప్రభుత్వం. ఏడాది తర్వాత అయినా బెనిఫిట్స్ ఎలా సెటిల్ చేస్తామని చర్చోపచర్చలు జరుపుతుందట. ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంచడమా లేదా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను బాండ్స్ రాసివ్వడమా.? మంత్లీ ఇన్‌స్టాల్‌మెంట్‌లో చెల్లించడమా అనే డైలమాలో ఉందట రాష్ట్ర ప్రభుత్వం.

# మందు జాగ్రత్త పడుతున్న సర్కార్

హైదరాబాద్, నవంబర్ 22,తెలంగాణలో రేవంత్ సర్కార్ 'మందు' జాగ్రత్త చర్యలు మొదలు పెట్టింది. గత వేసవిలో రాష్ట్రంలో బీర్ల కొరత ఏర్పడడంతో మందుబాబులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. మరోవైపు బీర్ల తయారీని నీటి కొరత కూడా ఏర్పడింది. వేసవి వచ్చిందంటే మందు బాబులు బీర్లు తాగేందుకే ఎక్కువగా ఆసక్తి చూపుతారు. సాధారణ రోజులకన్నా.. ఎండలు ఎక్కువగా ఉన్న రోజుల్లో బీర్లకు డిమాండ్ ఉంటుంది. ఏటా ఫిబ్రవరి నుంచే బీర్లకు డిమాండ్ మొదలవుతుంది, ఏప్రిల్, మే నెలల్లో డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో దీంతో వచ్చే వేసవిలో బీర్లకు కొరత రాకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న మద్యాన్ని వీలైనంత ఎక్కువగా తాగించడమే లక్ష్యంగా బీర్ల తయారీ పెంచాలని బేవరేజెస్ నుంచి కంపెనీలకు ఆదేశాలు అందాయి. ఇప్పటి నుంచే ఒత్తిడి పెంచుతోందిరాష్ట్రంలో సంగారెడ్డి జిల్లాలో ఉన్న ఓ బేవరేజెస్ కంపెనీ నెలకు మూడు లక్షల నుంచి నాలుగు లక్షల కేసుల బీర్లు ఉత్పత్తి చేస్తుంది. ఎక్సైజ్ అధికారుల ఒత్తిడి మేరకు ఈ కంపెనీ నెలవారీ ఉత్పత్తిని 5 లక్షల కేసులకు పెంచింది. ఇక మరో బేవరేజెస్ కంఎనీ నెలకు సుమారు 25 లక్షల కేసుల బీర్లు ఉత్పత్తి చేస్తుంది. రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకుని దీని ఉత్పత్తిని 30 లక్షల కేసులకు పెంచినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. అయితే బీర్లకు ఎక్స్‌పైరీ డేట్ ఉంటుంది. ఉత్పత్తి జరిగిన తేదీ నుంచి ఆరు నెలలు మాత్రమే వినియోగించాలి. దీంతో ఇప్పటి నుంచే ఉత్పత్తి పెంచుకుంటూ పోతే డిమాండ్‌కు సరపడా స్టాక్ అందుబాటులో ఉంచే అవకాశం ఉంటుందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.రాష్ట్రంలో బీర్ల తయారీ కంపెనీలు సంగారెడ్డి జిల్లాలోనే ఉన్నాయి. యూబీ కంపెనీకి చెందిన రెండు యూనిట్లు, కల్స్‌బర్గ్, లీలాసన్స్, క్రౌన్, ఏబీ ఇన్‌బీస్ అనయూసర్?బుష్ వంటి కంపెనీల యూనిట్లు ఉన్నాయి. ఇవీ బీర్లు ఉత్పత్తి చేస్తున్నాయి. తెలంగాణ అంతటికీ ఈ కంపెనీల నుంచే బీర్లు సరఫరా అవుతున్నాయి. ఎక్సైజ్ శాఖ లెక్కల ప్రకారం.. జిల్లాలో ఉన్న బేవరేజెస్ కంపెనీల యూనిట్ల ఉత్పత్తి సామర్థ్యం ఏడాదికి 6,800 లక్షల లీటర్లు. ఈ బీర్ల తయారీకి అవసరమైన నీటి కోసం ఆయా కంపెనీలు ఏకంగా పైపులైన్లు వేసుకున్నాయి. కొన్ని కంపనెనీలు మంజీరా నీటిని వినియోగిస్తున్నాయి.

# రియల్ బూమ్ మాములుగా లేదుగా

హైదరాబాద్, నవంబర్ 22, హైదరాబాద్‌కు ప్రపంచ వ్యాప్తంగా బ్రాండ్ ఇమేజీ ఉందన్న విషయం తెలిసిందే. అదే బ్రాండ్ మరోసారి రుజువైంది. దేశంలో ఎక్కడా లేని విధంగా.. ఎవరూ ఊహించనంతగా హైదరాబాద్ మరో ఖ్యాతి సాధించింది. ఎవరూ ఊహించని విధంగా హైదరాబాద్‌లో రియల్ బూమ్ ఇక్కడే ఉందని వివిధ సర్వేలు వెల్లడించాయి. మరోవైపు.. ఇక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్లను చూస్తే కూడా అదే అర్థం అవుతోంది. తాజాగా.. నైట్ ఫ్రాంక్ ఇండియా రిపోర్ట్‌లోనూ అదే వెల్లడైంది. హైదరాబాద్ రియల్ ఎస్టేట్ ఏ రేంజ్‌లో ట్రెండ్ అవుతున్నదో చూడచ్చు. బయట జరుగుతున్న ప్రచారానికి, జరుగుతున్న రిజిస్ట్రేషన్లకు లింకు లేకుండా ఉంది. అంతలా టాప్ ట్రెండింగ్‌లో రియల్ బూమ్ ఉంది.హైదరాబాద్‌లో రిజిస్ట్రేషన్లు పడిపోతున్నాయి.. రియల్ బూమ్ పూర్తిగా ఇబ్బందికర పరిస్థితుల్లోకి నెట్టివేయబడిందని ప్రతిపక్షాలు గగ్గోలు పెట్టాయి. అయితే.. వాటన్నిటికీ ఈ సర్వేలే సమాధానాలు చెప్పాయి. హైదరాబాద్ బ్రాండ్ తగ్గించాలని చూసినా.. తగ్గుతోందని ప్రచారం చేసినా అది ఏ మాత్రం సాధ్యపడలేదు. రియల్ ఎస్టేట్ రంగం దేశవ్యాప్తంగా కాస్త డౌన్ ట్రేండ్ కనిపిస్తోంది. కానీ.. భాగ్యనగరంలో మాత్రం తగ్గేదేలే అన్నట్లుగా రియల్ బూమ్ పెరుగుతూనే ఉంది. తాజాగా.. నైట్ ఫ్రాంక్ ఇండియా ప్రైమ్ సిటీ ఇండెక్స్ రిపోర్టు ప్రకారం దేశంలోనే అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో హైదరాబాద్ నంబర్ స్థానంలో నిలిచింది. దేశంలోని ఆరు ప్రధాన నగరాల్లో హైదరాబాద్ టాప్ ప్లేసులో నిలిచింది. రెండో స్థానంలో బెంగళూరులో నిలిచింది. ఆ తరువాత ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, చెన్నై నగరాలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల కల్పన, స్థిరాస్తి రంగం విస్తరణ, ప్రభుత్వ విధానాల పరిపాలన, జనాభా పెరుగుదల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని ఈ సర్వే విశ్లేషించింది. హైదరాబాద్ సిటీలో రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ ఏటా పది శాతం వృద్ధి కనబరుస్తూ వస్తున్నదని రిపోర్ట్‌లో పేర్కొంది2023లో హైదరాబాద్ రెసిడెన్షియల్ రంగంలో రియల్ ఎస్టేట్ 11 శాతం వృద్ధి సాధించింది. పెట్టుబడిదారులు, వినియోగదారులు హైదరాబాద్‌లో స్థిరాస్తులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారని వెల్లడించింది. బ్రాడ్ రోడ్లు, అండర్ పాస్‌లు, రింగ్ రోడ్లు, మెట్రో విస్తరణ కారణంగా రవాణా సదుపాయాలు నగరానికి నలువైపులా ఉన్నాయి. ఇంకా పెరుగుతూనే ఉన్నాయి. ఇవి కాస్త నగర విస్తరణకు, స్థిరాస్తి రంగ వృద్ధికి యూజ్ అయినట్లుగా తెలుస్తోంది. మరోవైపు.. నగరంలో మెట్రో ద్వారా గంటలోనే గమ్యస్థానానికి చేరుకునే వెసులుబాటు కలిగింది. దీంతో నగరం విస్తరించేందుకు కారణంగా నిలిచింది. ఐటీతోపాటు ఫార్మాసుటికల్స్, బయో టెక్నాలజీ రంగాలు కూడా విస్తరిస్తుండడం మరింత అడ్వాంటేజీగా మారాయి. వీటి కారణంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగి స్థిరాస్తి రంగానికి డిమాండ్ ఏర్పడింది.సంస్థలు ఇచ్చే రిపోర్టుతో పాటే జనవరి నుంచి ఆగస్టు మధ్య జరిగిన రిజిస్ట్రేషన్ల సంఖ్య చూసినా ఇదే అర్థం అవుతోంది. ఆగస్టులో హైదరాబాద్ సిటీలో 6,439 ఇళ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. వీటి విలువ రూ.4,043 కోట్లు. గతేడాదితో పోలిస్తే 17 శాతం విలువ పెరిగింది. ఈ ఏడాది జనవరి నుంచి ఆగస్టు వరకు 8 నెలల్లో 54,483 ఇండ్ల రిజిస్ట్రేషన్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 18 శాతం పెరిగాయి. ఈ లెక్కల ప్రకారం చూసినా హైదరాబాద్ నగరంలో రియల్ వ్యాపారం జోరు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్‌తోపాటే రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి ఏరియాల్లో రియల్ వ్యాపారం జోరు ఏమాత్రం తగ్గలేదు.

# ఫస్ట్ వీక్ లో మరిన్ని నామినేటెడ్ పోస్టులు

హైదరాబాద్, నవంబర్ 22, తెలంగాణ రాష్ట్రంలో రాబోవు 20 రోజుల్లో నామినేటెడ్ పదవుల భర్తీ పీసీసీ కార్యవర్గం కూర్పు పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయ్యి వచ్చే డిసెంబర్ 7వ తేదీకి ఏడాది పూర్తవుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వార్షిక విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఉమ్మడి జిల్లాల వారీగా విజయోత్సవాలను నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గాల వారిగా కూడా నిర్వహించాలని యోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో జరిగిన పార్టీ ముఖ్యనేతల సమావేశంలో పలు అంశాలు నాయకుల మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జి దీపాదాస్ మన్షి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నట్లు సమాచారం.మహారాష్ట్ర జార్ఖండ్ రాష్ట్రాలలో ఎన్నికలు పూర్తి కావడంతో ముఖ్యమంత్రి అందుబాటులో ఉన్న నాయకులతో సమావేశం అయ్యారు. సుదీర్ఘంగా దాదాపు రెండు గంటలపాటు ఈ సమావేశం కొనసాగినట్లు తెలుస్తోంది. ప్రధానంగా రాష్ట్రంలో జరుగుతున్న కుల గణన అంశం, వార్షిక విజయోత్సవాలు, కార్పొరేషన్ల ఛైర్మన్లు నియామకము తదితర అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది.ఉమ్మడి వరంగల్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిన్న మొన్న రెండు రోజులు కొనసాగిన వార్షిక విజయోత్సవాలు, స్థితిగతులపై చర్చించారు. జన సమీకరణ, సమావేశ నిర్వహణపై, ప్రజల్లో వస్తున్న స్పందన తదితరాంశాలపై చర్చించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఉమ్మడి జిల్లాలతో పాటు నియోజకవర్గాల వారిగా ఈ సమావేశాలు నిర్వహించే విషయమై చర్చకు వచ్చినట్లు సమాచారం.ఇప్పటికే మొదటి దశలో 36 మందికి నామినేటెడ్ ఛైర్మన్ పదవులు భర్తీ చేయడంతో పాటు అనేక మార్కెట్ యార్డ్ కమిటీలు. దేవాదాయ శాఖ ట్రస్ట్ బోర్డు కమిటీలు. గ్రంథాలయ ఛైర్మన్లు, వివిధ రకాల కమిషన్లు ఏర్పాటు చేసినప్పటికీ, మరిన్ని పదవులు పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారికి ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమయత్వం అవుతోంది. ఇప్పటికి భర్తీ చేసిన 36 పదవులకు మరో 15 కార్పొరేషన్లు పెద్దవి భర్తీ చేయాల్సి ఉంది. మిగిలిన వాళ్లకు వివిధ కార్పొరేషన్లలో డైరెక్టర్లుగా, కమిషన్లలో సభ్యులుగా నియమించి పార్టీ కార్యకర్తల్లో సంతృప్తి పరచాలని చూస్తోంది. అదేవిధంగా పిసిసి కార్యవర్గం రూపకల్పనపై కూడా చర్చించినట్లు విశ్వసినీ వర్గాలు చెబుతున్నాయి. పిసిసి విస్తృత స్థాయి సమావేశంలో అనేక అంశాలు చర్చకు వచ్చాయి. అదేవిధంగా నియోజకవర్గాలలో జరుగుతున్న కులగణన ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు తదితర వాటిపై కూడా చర్చించారు. నియోజకవర్గాల వారీగా వార్షిక విజయోత్సవాలను నిర్వహించాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించడంతో ఈ వ్యాధికి సమావేశంలో పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు.

# అతని జీవితంలో ఆమె సగం

ఖమ్మం, నవంబర్ 22,భార్య, భర్తల బంధం .. ఎప్పటికీ ఆదర్శంగా నిలిచేలా ఉండాలి.. నేడు మారుతున్న సమాజంలో చిన విషయాలకే మనస్పర్థలు, గొడవలతో దూరం అవుతున్నారు. అర్థం చేసుకునే ఓపిక ,ఆలోచన ఉండటం లేదు. కష్టాలు, సమస్యలు వస్తే కుంగిపోవడం, బాధ పడుతున్నారు.పెళ్లి జన్మజన్మల అనుబంధమని, చెరోసగంగా భార్యాభర్తలు జీవనం సాగించడం అన్యోన్య దాంపత్యమని పెద్దలు చెబుతారు. ఈ తరహాలోనే ఓ భార్య తన భర్తను బతికించుకునేందుకు కాలేయదానం చేసి ఆయనలో సగభాగంగా మారడమే కాదు. కలకాలం కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని పెళ్లి రోజున చేసిన ప్రతిజ్ఞకు కట్టుబడి నిలిచినట్లయింది. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం పెద్ద ఈర్లపూడికి చెందిన ధారావత్ శ్రీను ఖమ్మంలోని ఏపీజీవీబీ బ్యాంకు లో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆయన భార్య లావణ్య ఎల్ఎల్బీ చివరి సంవత్సరం చదువుతుండగా వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

అతడి పేరు ధారావత్ శ్రీను. స్వస్థలం పెద్ద ఇర్లపూడి, ఖమ్మం జిల్లా. అతని భార్య పేరు లావణ్య.. వారిద్దరికీ కొన్ని సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. మొదట్లో వారిద్దరి సంసారం సజావుగా సాగింది. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. శ్రీను వ్యవసాయం చేస్తుంటాడు. ఖాళీ సమయంలో కూలీ పనులకు వెళ్తుంటాడు. లావణ్య కూడా అంతే. ఉన్నంతలో హాయిగా సాగిపోతున్న వీరి సంసారంలో అనుకోని కుదుపు ఏర్పడింది. దీంతో శ్రీను ఆస్పత్రి పాలు కావాల్సి వచ్చింది. ఫలితంగా లావణ్య కన్నీరు మున్నీరయింది. ఈ క్రమంలో అతడిని పరీక్షించిన వైద్యులు కాలేయం (లివర్) పాడైందని చెప్పారు. లివర్ మార్పిడే ఇందుకు ఏకైక మార్గమని వివరించారు. దీంతో అతడి కుటుంబ సభ్యులు లివర్ ఇవ్వడానికి ముందుకు రాలేదు. దీంతో లావణ్య తన భర్తను బతికించుకోవడానికి ముందుకు వచ్చింది. లివర్ ఇవ్వడానికి తన సమ్మతం తెలిపింది. దీంతో వైద్యులు లావణ్య కు పరీక్షలు నిర్వహించారు. ఆమె లివర్ సెట్ అవుతుందని భావించారు. దీంతో ఆమెను కొద్ది రోజులపాటు తమ పర్యవేక్షణలో ఉంచుకున్నారు. ఆ తర్వాత ఆమెకు శస్త్ర చికిత్స చేసి.. ఆమె లివర్ లోని కొంత భాగాన్ని శ్రీను శరీరంలోకి చొప్పించారు.లావణ్య శరీరం నుంచి లివర్ భాగాన్ని శ్రీను శరీరంలోకి చొప్పించడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం అతడు కోరుకుంటున్నాడు. మన శరీరంలో లివర్ దానంతతట అది వృద్ధి చెందుతుంది. ఇప్పుడు శ్రీను శరీరంలో కూడా లివర్ అదే పనిగా డెవలప్ అవుతుందని వైద్యులు చెబుతున్నారు. " శ్రీను గతంలో అనారోగ్యానికి గురయ్యాడు. అది అతడి లివర్ మీద ప్రభావం చూపించింది. క్రమక్రమంగా లివర్ పాడయింది. దీంతో అతడి శరీరం నుంచి లివర్ తొలగించాల్సి వచ్చింది. లివర్ లేకుంటే మనిషి బతకడం కష్టం. అందువల్ల అతడి భార్య శరీరంలో కొంత భాగాన్ని తీసి శ్రీను శరీరంలోకి చొప్పించాం. ఫలితంగా అతడు శరీరం లో లివర్ వృద్ధి చెందుతోంది. మొత్తంగా చూస్తే శ్రీను ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు.. లావణ్య ముందుకు వచ్చి తన భర్త ప్రాణాలు కాపాడుకుంది. భార్యాభర్తల అనుబంధాన్ని మరోసారి చాటింది. తన భర్త పై ఉన్న ప్రేమను ప్రదర్శించింది. లావణ్య లాంటి భార్య ఉండటం శ్రీను పూర్వజన్మల అదృష్టమని" వైద్యులు చెబుతున్నారు. తన శరీరం నుంచి లివర్ భాగాన్ని కొంత శ్రీను శరీరంలోకి చొప్పించిన తర్వాత.. లావణ్య తన భర్తను చూసింది. కన్నీటి పర్యంతమైంది. ఈ వీడియో సామాజిక మాధ్యమాలలో తెగ సందడి చేస్తోంది. తన భర్త కోసం లివర్ దానం చేసిన లావణ్య పై నెటిజన్లు ప్రశంసల జలు కురిపిస్తున్నారు.

# పదవ తరగతి విద్యార్థిని పై కర్రతో దాడి
## గత కొన్ని రోజులుగా వేధిస్తూ ఇంటికి వెళ్లి మరీ దాడి చేసిన నిందితుడు

నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం బ్రాహ్మణ పల్లి లో అమానుష ఘటన చోటుచేసుకుంది, పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని అదే ప్రాంతానికి చెందిన మాదర్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా ప్రేమించాలని వేధిస్తూ వున్నాడు. గురువారం సాయంత్రం బాలిక ఇంటికి వెళ్లి కర్ర తో తల మీద దాడిచేయగా విద్యార్థినికి గాయాలయ్యాయి. విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కూతురుని అదే ప్రాంతానికి చెందిన మాదర్ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా వేధిస్తున్నాడని తాము ఎన్నిసార్లు చెప్పినా తమ మాట వినడం లేదని హఠాత్తుగా ఈరోజు కత్తి కర్ర తీసుకువచ్చి తమ ఇంటి మీద దాడికి వచ్చాడని తమ కూతురి మీద దాడి చేయబోవుగా అడ్డుకున్న తల్లి పైన కూడా దాడి చేశాడని కర్రతో తమ కూతురి తలపై కొట్టడంతో గాయాలు అయ్యాయని అన్నారు. ఈ మాదర్ నుండి తమ కుటుంబానికి తమ కూతురుకు ప్రాణహాని ఉందని విద్యార్థిని తల్లితండ్రులు వాపోతున్నారు, ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని మాదర్ నుండి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు...

## ఏసీబీ దూకుడు...

# బయట పడుతున్న తిమింగలాలు

హైదరాబాద్, నవంబర్ 22, తెలంగాణలో ఏసీబీ దూకుడు మీద ఉంది. అవినీతి అధికారులకు చెమటలు పట్టిస్తోంది. వరుసగా కేసులు నమోదు చేస్తూ.. అవినీతి అధికారుల ఆటకట్టిస్తోంది. అయినా.. అధికారులు మాత్రం మారడం లేదు. లంచాలకు మరిగి పేదల రక్తం పీలుస్తున్నారు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయిస్తున్నారు.ఏసీబీ.. ఈ మాట వింటే అవినీతి అధికారులు వణికిపోతున్నారు. ఏసీబీ అంత దూకుడు మీద ఉంది. కేవలం 21 రోజుల్లో 12 కేసులు నమోదు చేసి ఏసీబీ అధికారులు రికార్డ్ సృష్టించారు. బాధితులకు అండగా నిలుస్తున్నారు. తాజాగా.. తెలంగాణలో ఇద్దరు అవినీతి అధికారులను పట్టుకున్నట్టు ఏసీబీ వెల్లడించింది.

21 రోజుల్లో 12..

21.11.2024న సంగారెడ్డి జిల్లా సదాశివపేట మండలం ఆత్మకూరు పంచాయతీ కార్యదర్శి పి.సచిన్ కుమార్‌ను ఏసీబీ పట్టుకుంది. ఇంటి నంబర్ కోసం లంచం డిమాండ్ చేయగా.. బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. రూ.15 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

21.11.2024న మహబూబాబాద్ జిల్లా సర్వే, భూ దస్తవేజుల కార్యాలయంలో పనిచేసే సీనియర్ డ్రాఫ్ట్‌మెన్ కళంగి జ్యోతి క్షేమ బాయిని ఏసీబీ పట్టుకుంది. భూమికి సంబంధించి టిప్పన్ రికార్డును ఇవ్వడానికి లంచం డిమాండ్ చేసింది. రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కింది.

20.11.2024న హైదరాబాద్‌లోని మలక్‌పేటలో స్టేట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్లు (మహబూబ్ బాషా, సోమశేఖర్)ను ఏసీబీ పట్టుకుంది. బ్యాంక్ అకౌంట్‌ను అన్‌ఫ్రీజ్ చేయడానికి లెటర్ ఇచ్చేందుకు లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. బాధితుడు రూ.50 వేలు ఇస్తుండగా ఏసీబీ పట్టుకుంది.

20.11.2024న హైదరాబాద్‌లోని జూబ్లిహిల్స్‌లో జీహెచ్‌ఎంసీ శానిటరీ ఉద్యోగులు ఎండీ సలీం ఖాన్, జి.గణేష్‌ను ఏసీబీ పట్టుకుంది. కాఫీ దుకాణంపై పన్ను విధించకుండా ఉండేందుకు వీరు రూ.60 వేలు డిమాండ్ చేశారు. బాధితుడు రూ.25 వేలు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

19.11.2024న పెద్దపల్లి జిల్లా అంతరగాం మండల తహసీల్దార్ వి.రమేష్ ఏసీబీకి చిక్కారు. పోలీసులు పట్టుకున్న ట్రాక్టర్‌ను విడుదల చేయడానికి లంచం డిమాండ్ చేశారు. రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ద్వారా రూ.12 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ఎంట్రీ ఇచ్చారు. వారిని చూసి డబ్బులు బయటకు విసిరేసి పారిపోయాడు. అతన్ని పట్టుకున్నారు. గతంలో కూడా రమేష్‌ను ఏసీబీ పట్టుకుంది.

18.11.2024న గద్వాల జిల్లా ఇటిక్యాల మండలంలో పంచాయతీ రాజ్ ఇంజనీర్ పాండురంగారావును ఏసీబీ పట్టుకుంది. రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

14.11.2024న కామారెడ్డి జిల్లా లోని లింగంపేటలో ఎస్సై పి.అరుణ్, స్టేషన్ రైటర్ రామస్వామిని ఏసీబీ పట్టుకుంది. రూ.10 వేలు లంచం తీసుకుంటూ వీరు ఏసీబీకి చిక్కారు.

13.11.2024న నిర్మల్ పురపాలక కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎంఏ షకీర్ ఖాన్ రూ. 15 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కాడు.

08.11.2024న నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్సై బి. కృష్ణ కుమార్ ఏసీబీకి చిక్కాడు. బాధితుడి నుంచి రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ పట్టుకుంది.


07.11.2024న మహబూబ్‌నగర్ జిల్లా విద్యాధికారి ఆటి రవీందర్‌ను ఏసీబీ పట్టుకుంది. పదోన్నతికి సంబంధించి రూ. 50 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

05.11.2024న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి పుల్లయ్యను ఏసీబీ పట్టుకుంది. విద్యుత్తు మీటర్ కోసం ఎన్వోసీ ఇవ్వడానికి పుల్లయ్య లంచం డిమాండ్ చేశారు.

02.11.2024న ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల తహశీల్దార్, జండాగూడెం, పోచంలొద్ది గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎం.శేఖర్‌లను ఏసీబీ పట్టుకుంది. సీసీ రోడ్డు నిర్మాణానికి సంబంధించిన చెక్కును ఇవ్వడానికి రూ.12 వేలు లంచం డిమాండ్ చేశారు. లంచం డబ్బులు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

# కోట్లాది భక్తులకు ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా

## -నేడు బాబా జయంతి



కోట్లాది భక్తులకు ఆయన ఆధ్యాత్మిక గురువు.ఆయన కులాలకు, మతాలకు అతీతంగా నిలిచారు. ఆయన భక్తులలో హిందువులతో పాటు ముస్లింలు, క్రిస్టియన్లు కూడా చాలామంది ఉన్నారు. సత్యసాయి బాబా వారు సత్యనారాయణ రాజుగా 1926 నవంబరు 23న పెద్ద వెంకప్ప రాజు, ఈశ్వరమ్మ దంపతులకి, ఓ నిరుపేద వ్యవసాయ భట్టు రాజుల కుటుంబంలో అనంతపురం జిల్లా లోని, పుట్టపర్తి అనే కుగ్రామంలో జన్మించాడు. బాబాకు నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. బాబా చిన్న వయసులోనే చాలా అద్భుతాలు చేశాడని చెబుతారు. చిన్న వయసులోనే బాబా అపర మేధావి, సేవాభావం గల వ్యక్తిగా ముద్ర పడ్డారు. అపర మేధావి అయిన బాబాకు నాట్యంలో, సంగీతంలో, రచనలలో మంచి పట్టు ఉంది. బాబా స్వయంగా పాటలు, పద్యాలు రాసి భక్తులను వినిపించాడు.1940వ సంవత్సరం మార్చి 8వ తేదీన తన సోదరుడు శేషమ రాజుతో కలిసి ఉరవకొండలో ఉన్న సమయంలో బాబాను ఓ తేలు కుట్టిందంట. ఆ సమయంలో బాబా తన స్పృహను కోల్పోయారంట. తేలు కుట్టిన కొద్ది రోజులకు బాబా బిహేవియర్‌లో మార్పు వచ్చింది. తనకు తాను నవ్వుకోవడం, ఏడ్వటం, అప్పటికప్పుడే నిశ్శబ్దంగా మారి పోవడం చేసేవారు. ఆ సమయంలో ఇతను తనకు ఇంతకుముందు ఏ మాత్రం పరిజ్ఞానం లేని సంస్కృతంలో పాటలు పాడేవారు. బాబా పరిస్థితి చూసి వైద్యులు హిస్టేరియా అని నమ్మేవారు. దీంతో చేసేది లేక బాబా తల్లిదండ్రులు బాబాను పుట్టపర్తికి తీసుకు వచ్చారు. వారు బాబాను అనేకమంది వైద్యుల వద్దకు, ఆధ్యాత్మిక గురువుల వద్దకు తీసుకు వెళ్లారు.మే 23 1940లో బాబా చేసిన ఓ చర్య వల్ల బాబా తండ్రి బాబాను ఓ అద్వితీయ మహోన్నతుడుగా భావించాడు. బాబా తండ్రి ఓ కర్ర తీసుకొని నీవెవరు అని అడిగాడు. అప్పుడు బాబా తాను షిరిడీ సాయిబాబా ప్రతిరూపాన్ని అని చెప్పాడు. ఆ తర్వాత బాబా తనకు ఎవరితోనూ సంబంధం లేదని చెప్పారు. తాను షిర్డీ సాయికి ప్రతిరూపం అని చెప్పడం, తనకు ఎవరితోనూ సంబంధాలు లేవని చెప్పడంతో ఆయనకు భక్తులు తయారవడం ప్రారంభం అయింది. పద్నాలుగేళ్లకే బాబా ఆధ్యాత్మిక మార్గం పట్టారు. ఆ తర్వాత సత్యసాయి మద్రాసుకు, దక్షిణ భారతంలో పర్యటనలు ప్రారంభించారు. దీంతో తొందరగానే ఆయనకు భారీ సంఖ్యలో భక్తులు తయారయ్యారు. 1944వ సంవత్సరంలో భక్తులు బాబా స్వగ్రామం పుట్టపర్తిలో ఓ మందిరాన్ని నిర్మించారు. ఆ తర్వాత 1948లో ప్రారంభం అయిన ప్రశాంతి నిలయం 1950కి పూర్తయింది. 1957వ సంవత్సర కాలంలో బాబా ఉత్తర భారత దేశ దేవాలయాల సందర్శనకు వెళ్లారు. 1954లోనే బాబా చిన్న పాటి గ్రీన్ హాస్పిటల్‌ను పుట్టపర్తిలో నిర్మించారు. 1963లో బాబాకు నాలుగుసార్లు గుండెనొప్పి వచ్చింది. ఆ సమయంలో బాబా తాను మరణించాక కర్ణాటకలో ప్రేమసాయి అవతారం ఎత్తుతానని చెప్పారు.ఆ తర్వాత 1968 జూన్ 29న బాబా మొదటిసారి విదేశాలకు వెళ్లారు. ఉగండా, నైరోబీ తదితర దేశాలకు వెళ్లారు. ఆయా దేశాలకు వెళ్లిన బాబా తాను ఏ మతపరంగా రాలేదని ప్రేమను పంచడానికే వచ్చానని చెప్పారు. తనవైపు ఎవరినీ తిప్పుకోవడానికి, ప్రలోభ పెట్టడానికి రాలేదని, కేవలం ప్రేమ పంచి, ఎవరిపై వారికి నమ్మకం కలిగించడానికే వచ్చానని ఆయా దేశాలలో చెప్పేవారు.మన రాష్ట్రం రాజధానిలో ప్రసిద్ధి పొందిన శివం మందిరాన్ని 1973లో ఎస్టాబ్లిష్ చేశారు. అలాగే 1981 జనవరి 19న చెన్నైలో సుందరం మందిరాన్ని ప్రారంభించారు. 1995లో రాయలసీమ ప్రాంతంలో బాబా నీటి ప్రాజెక్టు పనులు చేపట్టారు. 2001లో పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించారు. బాబా 2005వ సంవత్సరం నుండి వీల్ చైర్‌కే పరిమితం అయ్యారు. తాను దేహం కలవాడిని కాదని, దేహిని అని చెప్పారు. తాను నిర్యాణం చెందినప్పటికీ మళ్లీ పుడతానని పలు సందర్భాలలో చెప్పారు. అయితే భక్తుల ప్రార్థనలే తనకు ప్రాణం అని కూడా చెప్పారు. ప్రతి దేహం గిట్టక తప్పదని చెప్పారు.బాబా తన భజనల సీడీలను చాలా విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తులను, వేల సేవాకేంద్రాలు, ప్రజలకు నీటి సౌకర్యం కల్పించిన శ్రీ భగవాన్ సత్యసాయి బాబ తాను స్థాపించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లోనే గత నెల 28న మంచాన పడ్డారు. 28 రోజుల అనంతరం బాబా ఆదివారం ఏప్రిల్ 24న ఉదయం 7.40 నిమిషాలకు నిర్యాణం చెంది బాబా భక్తులలో విషాదం నింపారు.

# వరిని కాల్చొద్దు...

మెదక్, నవంబర్ 22, రి కోతల తర్వాత రైతులు వరి కొయ్యలను తగలబెడుతున్నారు. అయితే.. దీని ద్వారా రైతులకు నష్టం జరుగుతోందని.. పర్యావరణంలో కాలుష్యం పెరుగుతోందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అటు ప్రభుత్వం కూడా వరి కొయ్యలు తగలబెట్టొద్దని అన్నదాతలకు సూచిస్తోంది.రైతులు వరి పంటను కోసిన తర్వాత కొయ్యలను కాలబెడితున్నారు. దీంతో భూమిలో ఉన్న కోట్ల సూక్ష్మజీవులు నశించిపోతాయని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రభాకర్ రెడ్డి వివరించారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ రైతు నేస్తం కార్యక్రమంలో డాక్టర్ ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ.. చాలామంది రైతులు వరి పంట కోసిన తర్వాత మొదళ్లను కలబెడుతున్నారు. దీనివలన అనేక అనర్ధాలు జరుగుతాయని ఆయన వ్యాఖ్యానించారు. వరికొయ్యలను తగులబెట్టడం ద్వారా నేలకు మేలు చేసే క్రిమికీటకాలు కాలిపోయి నశిస్తాయని చెప్పారు. భూమిలో సారం తగ్గిపోవడం, వాయు కాలుష్యం పెరిగిపోవడం లాంటి నష్టాలు కలుగుతున్నాయని వివరించారు. మట్టిలోని సూక్ష్మజీవులు దెబ్బతింటాయని, నీటి నిల్వ తగ్గుతుందన్నారువరి కొయ్యల మొదళ్లలో ఉన్న సూక్ష్మజీవులు భూమిని సారవంతం చేయుటలో తోడ్పడతాయని ప్రభాకర్ రెడ్డి వివరించారు. మొక్కలకు అన్ని రకాల పోషక పదార్ధాలు అందించడంలో సహకరిస్తాయని చెప్పారు. భూమిని గుల్లగా మార్చి.. నీరు, గాలిని పట్టి ఉంచి మొక్కలకు అందిస్తాయన్నారు. మొక్కల వ్యర్ధాలు, సేంద్రియ పదార్ధాలు భూమిలో కుళ్లి పోవడానికి సూక్ష్మజీవులు సహకరిస్తాయన్నారు. రసాయన ఎరువులు భూమిలో వేసినప్పుడు అవి మొక్కలు తీసుకునే రూపంలో మార్చునకు తోడ్పడతాయన్నారు. ఈ సూక్ష్మజీవులు పంటపై చీడ పురుగులు రాకుండా కాపాడుతాయని చెప్పారు...రైతులు ఈ వరి కొయ్యలను భూమిలో కలియబెట్టి మురిగేటట్లు చేస్తే.. అది పొలానికి మంచి ఎరువుగా పనిచేస్తుందని ప్రభాకర్ రెడ్డి వివరించారు. మరల వేసుకునే పంట అధికంగా పండే అవకాశం ఉందన్నారు. మామూలుగా పంట అధికంగా పండాలంటే రైతులు పంట కోసిన తర్వాత పశువుల ఎరువు, కోళ్ల ఎరువు కానీ పోస్తుంటారు. అలాకాకుండా ఈ వరి కొయ్యలనే మురగబెడితే మంచి సేంద్రియ ఎరువుగా పనిచేస్తుందన్నారు. రైతులు అలాగే కొయ్యలను కాలబెట్టుకుంటూ పోతే వ్యవసాయం పాతిక సంవత్సరాలు వెనక్కి పోవడమే కాకుండా.. చివరికి పంటలు పండించడానికి పనికిరాకుండా పోతాయన్నారుఆయిల్ ఫామ్ తోటలు సాగు చేయడం వలన రైతులు అధిక లాభాలు పొందవచ్చుని.. ఉద్యాన శాఖ అధికారి రమేష్ స్పష్టం చేశారు. సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖ అధికారి రమేష్ మాట్లాడుతూ.. నీటి వసతులున్న వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్ ఫామ్ తోటలు సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చని వివరించారు.ఫామాయిల్ సాగుకు ఇతర పంటతో పోల్చితే తక్కువ పెట్టుబడి అవసరమవుతుందని రమేష్ వివరించారు. ఫామాయిల్ సాగు చేసే రైతులు మొదటి మూడు సంవత్సరాలు అంతర పంటల ద్వారా ఆదాయం సమకూర్చుకోవచ్చున్నారు. ఈ పంటలో ఎటువంటి చీడపీడల బెడద ఉండకపోవడం వలన రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గి.. ఆదాయం పెరుగుతుందన్నారు. ఫామాయిల్ పంటకు కచ్చితమైన మార్కెట్ సదుపాయం ఉండడం వలన నీటి సదుపాయం కలిగిన రైతులు ఈ పంట సాగుకు ఆసక్తి చూపాలని సూచించారు.

# వరంగల్ రైతు డిక్లరేషన్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు.హరీష్ రావు

ఖమ్మం పర్యటనలో భాగంగా ఖమ్మం పత్తి మార్కెట్ మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్, పార్లమెంట్ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాత మధు, మాజీ ఎమ్మెల్యే వెంకట వీరయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ కమల్ రాజ్, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఖమ్మం జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అతిపెద్ద మార్కెట్లో ఒకటైన ఖమ్మం పత్తి మార్కెట్ను సందర్శించడం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత రైతుల పరిస్థితి దారుణంగా మారింది. వరంగల్ రైతు డిక్లరేషన్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదు. పత్తికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి, ఆ బోనస్ను బోగస్ చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. కనీసం మద్దతు ధర వచ్చే పరిస్థితి కూడా లేదు. మార్కెట్ సెక్రటరీ ఇచ్చిన లెక్కల ప్రకారం రూ.6,500 మద్దతు ధర దాటడం లేదు. అకాల వర్షాలతో పంట దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, కనీసం మద్దతు ధరకు కూడా పండించలేని పరిస్థితి ఉంది. రూ.500 బోనస్ దేవుడే ఎరుగు, కానీ మద్దతు ధరకు వెయ్యి రూపాయలు రైతు నష్టపోతున్నారు. రైతులకు సాయం చేయడానికి ఎందుకు ఈ ప్రభుత్వానికి ఇబ్బంది? రైతులను ఆదుకోలేదు, వ్యవసాయ కూలీలను ఆదుకోలేదు, ఏ ఒక్క వర్గాన్నీ ఆదుకోలేదు. పత్తి రైతులు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడింది. పత్తి మద్దతు ధర రూ.7,500 ఉండాల్సి ఉండగా, కేవలం రూ.6,500 మాత్రమే రైతులకు అందిస్తున్నారు. ఇవి మార్కెట్ యార్డ్ సెక్రటరీ ఇచ్చిన లెక్కలే. ఖమ్మం పత్తి మార్కెట్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయండి. శంకర్ రమాదేవి అనే రైతులు 8 ఎకరాల్లో పత్తి పండిస్తే, కనీసం 5 క్వింటాళ్ల పంట కూడా రాలేదని, వచ్చిన దానికి కూడా మద్దతు ధర ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడ కూడా పత్తి రైతులకు మద్దతు ధర రావడం లేదు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, 2021లో రూ.11,000కు పత్తి కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు.

ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎందుకు సగానికి సగం పత్తి ధర పడిపోయింది? ఇది దళారుల దోపిడీ వల్లే. రూ.7,520 మద్దతు ధరను పత్తి రైతులకు ఇవ్వాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తున్నాం. రైతులకు కనీసం రూ.500 బోనస్ ఇవ్వాలని కూడా డిమాండ్ చేస్తున్నాం. దళారులు రూ.6,500కు పత్తి కొనుగోలు చేసి, సీసీఐ కేంద్రాలకు రూ.7,500కు అమ్ముతున్నారు. మిర్చి రైతులను కూడా ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసింది. గత సంవత్సరం రూ.23,000 మద్దతు ధర వస్తే, ఈసారి రూ.13,000 కూడా రావడం లేదు. మాయమాటలు చెప్పి రైతులను నట్టేట ముంచడం మంచిది కాదు, కాంగ్రెస్ ప్రభుత్వం. రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేశారు. రూ.15,000 రైతు భరోసాను ఇవ్వమని మోసం చేశారు. రూ.15,000 కౌలు రైతులకు ఇస్తామని మోసం చేశారు. రూ.12,000 రైతు కూలీలకు ఇస్తామని మోసం చేశారు. రూ.500 బోనస్ ఇస్తామని కూడా మోసం చేశారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా, ప్రజా సమస్యలు పట్టించుకునే పరిస్థితిలో లేరు. ఒకరిపై ఒకరు పైచేయి కోసం పాకులాడడమే తప్ప, ప్రజా సమస్యల కోసం పనిచేయడం లేదు. 4 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరగం వడ్లు ఖమ్మం జిల్లాలో పండితే, ఇప్పటివరకు 19 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు చేశారని అన్నారు.

ఒక రైతుకైనా సన్నరగం వడ్లకు బోనస్ వచ్చిందా అని అడుగుతున్నాను. సకాలంలో మిల్లులు అనుసంధానం చేయకపోవడం, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం, గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడం వల్ల ధాన్యం దళారుల పాలైంది. సీసీఐ కేంద్రాలను కేంద్ర ప్రభుత్వం పెట్టామని చెబుతున్నా, వాస్తవానికి సీసీఐ కేంద్రాలు కనబడడం లేదు. పత్తి సీసీఐ కేంద్రాల్లో 7,000 మెట్రిక్ టన్నులు కొంటే, మార్కెట్లో 15,000 మెట్రిక్ టన్నుల పత్తి కొనుగోలు జరిగింది. ముఖ్యమంత్రి పత్తి కొనుగోలుపై సమీక్ష చేయడం లేదు. ముఖ్యమంత్రి రు మద్యం అమ్మకాలపై సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారు, కానీ పత్తి వరి కొనుగోళ్లపై సమీక్ష చేయడం లేదు. మద్దతు ధరకు ధాన్యం కొనకపోతే, ఎవరికి మెమోలు జారీ చేయడం లేదు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా చేయాలని ముఖ్యమంత్రి కంకణం కట్టుకున్నారేమో. ఈరోజు పత్తి రైతులు కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లుగా అన్ని రకాల పంటలకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. పత్తిని రూ.7,500కు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

# ఏడు జిల్లాల్లో వెదర్ అలెర్ట్

హైదరాబాద్, నవంబర్ 22, (న్యూస్ పల్స్)తెలంగాణలో గజ గజ మొదలైంది. రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గుతున్నాయి. మంచు ఎక్కువగా కురుస్తోంది. దీంతో సాయంత్రం 5 గంటల నుంచే చలి మొదవుతుంది. ఉదయం 9 గంటల వరకూ వణికిస్తోంది తెలంగాణపై చలి పులి పంజా విసురుతోంది. ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా తక్కువగా నమోదవుతున్నాయి. కనిష్ట ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. గడిచిన నాలుగు రోజులుగా చలి తీవ్రత పెరుగుతోంది. రాష్ట్రంలోని కొన్ని చోట్ల 10 డిగ్రీల సెల్సియస్ కన్నా తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం(నవంబర్ 20న) రాష్ట్రంలో అత్యల్పంగా సిర్పూర్‌లో 10.5 డిగ్రీల సెల్సియస్, పొచ్చెరలో 11.8. కుంటాలలో 12.6, ర్యాలీలో 13.1 డిగ్రీల సెల్సియస్ చొప్పున కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నవంబర్‌లోనే ఇంత తక్కువగా నమోదవడం ఇదే మొదటిసారని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు. కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుండడంతో వాతావరణ శాఖ కూడా అలర్ట్ జారీ చేసింది.కనిష్ట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీలకు దిగువన నమోదవుతుండడంతో వాతావరణ శాఖ రాష్ట్రంలోని ఆరు జిల్లాలకు అలర్ట్ జారీ చేసింది. మంచిర్యాల, మెదక్, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, సంగారెడ్డి జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరింత తగ్గుతాయని తెలిపింది. ఈ జిల్లాల ప్రజలు చాలా అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఇక హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో 15 డిగ్రీలకు దిగువన ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది.చలి వణికిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలోని చిరు వ్యాపారులు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు ఉదయమే వాహనాలు నడిపే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొగ మంచు కారణంగా రోడ్లపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. రానున్న రోజుల్లో చలి మరింత పెరిగే అవకాశం ఉన్నందున వృద్ధులు, పిల్లలు, చిరు వ్యాపారులు, పారిశుధ్య కార్మికులు, తెల్లవారుజామునే వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. రాబోయే వారం రోజులు వాతావరణం పొడిగానే ఉంటుందని తెలిపారు.చలిగాలులు పెరుగుతున్న నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం హెల్త్ అడ్వయిజరీ కూడా జారీ చేసింది. చలి నుంచి రక్షించుకోకపోతే హైపోథెర్మియా, చర్మం లోపలి కణజాలం గడ్డకట్టి గాయాలు కావడం, పెర్నియా, ఇమ్మర్షన్ వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని తెలిపింది. చలి తీవ్రత నేపథ్యంలో వృద్ధులు, చిన్నారులు, దివ్యాంగులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. వేడి వేడి ఆహారం తీసుకోవాలని, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే వస్త్రాలు ధరించాలని తెలిపింది.

డాక్టర్ల సూచనలు

? తీవ్రమైన చలితో హైపోథెర్మియాతో పాటు ఇమ్మర్షన్, పెర్నియో వంటి వ్యాధులు వచ్చే అవకాశముంది. సరిపడా నీరు, పౌష్టికాహారం తీసుకోవాలి..

? గర్భిణిలు, చిన్నపిల్లలు, వృద్ధులు, శ్వాస సంబంధిత ఇబ్బందులు ఉన్నవారు ప్రస్తుత సీజన్ లో అతి జాగ్రత్తగా ఉండాలని వైద్యారోగ్యశాఖ బులెటిన్ విడుదల చేసింది.

? జలుబు, ఫ్లూ, ముక్కు నుంచి నీళ్లు కారటం వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. విటమిన్ సీ ఉండే ఆహారాలను అధికంగా తీసుకోవాలి.

? చలి తీవ్రత దృష్ట్యా ఇంట్లో కర్రలు కాల్చడం వంటి చేయవద్దని హెచ్చరించింది. దీని వల్ల కార్బన్ మోనాక్సైడ్ ప్రభావంతో అనారోగ్య సమస్యలు వస్తాయి.

తెలంగాణలో చలి తీవ్రత పెరుగుతోంది. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు తగ్గిపోతున్నాయి. రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ప్రభుత్వం హెల్త్ అడ్వైజరీ జారీ చేసింది. కోల్డ్ వేవ్ నేపథ్యంలో పబ్లిక్ హెల్త్ అడ్వైజరీ జారీ చేశారు. వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# సినిమా



## తెలుగు నటులను ఆదరించండి



ఈ శుక్రవారం నాలుగు కొత్త చిత్రాలు ప్రేక్షకుల ముందుకువస్తున్నాయి. వీటిపై నటుడు బ్రహ్మాజీ సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. తెలుగు వారిని ప్రోత్సహించాలని కోరారు. 'మలయాళం, తమిళ హీరోలతో పాటు మన టాలెంటెడ్ తెలుగు హీరోలను కూడా ప్రోత్సహించండి' అని కోరారు. మహేశ్ బాబు మేనల్లుడు 'దేవకీ నందన వాసుదేవ'తో తెలుగు ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. తెలుగమ్మాయి, మిస్ ఇండియా మానస వారణాసి ఈ సినిమాతో తెరంగేట్రం చేస్తున్నారు. 'హనుమాన్' ఫేమ్ ప్రశాంత్ వర్మ రాసిన కథతో దర్శకుడు అర్జున్ జంధ్యాల ఈ సినిమాని తెరకెక్కించారు. అలాగే 'జీబ్రా'తో తనలోని ఓ కొత్త నటుడిని చూస్తారంటున్నారు సత్యదేవ్. ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంలో డాలీ ధనంజయ మరో కథానాయకుడు. ప్రియ భవానీశంకర్, జెన్నీఫర్ పిషినాటో కథానాయికలు. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఇక విష్వక్‌సేన్ హీరోగా రవితేజ ముళ్లపూడి తెరకెక్కించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. మీనాక్షీ చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోయిన్లు. వీటితో పాటు హర్ష నర్రా, సందీప్ సరోజ్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రోటి కపడా రొమాన్స్' కూడా ప్రేక్షకుల ముందుకురానుంది.

## నవ్వించే జాతకాల పిచ్చోడి కథ



మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వం వహించిన సినిమా 'సారంగపాణి జాతకం'. శ్రీదేవి మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' విజయాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న మూడో చిత్రమిది. డిసెంబర్ 20న సినిమా విడుదల చేయనున్నారు. గురువారం హీరో విజరు దేవరకొండ చేతుల మీదుగా టీజర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'నా బ్రదర్ దర్శి (ప్రియదర్శి)తో నా కెరీర్ స్టార్ట్ చేశా. ఇంట్రెస్టింగ్ కథల్లో లీడ్ రోల్స్ చేస్తూ మనకు మంచి సినిమాలు అందిస్తున్నాడు. టీజర్ చూశాను. ఇందులో దర్శి పాత్రకు జాతకాల మీద నమ్మకం ఉంటుంది. జాతకాలు ఎంత నిజం అనేది నాకు తెలియదు. 'పెళ్లి చూపులు' చేసినప్పుడు మేం ఈ స్థాయికి వస్తాం అని ఊహించలేదు. డెస్టినీ మమ్మల్ని ఇక్కడికి తీసుకు వచ్చింది. మోహనకృష్ణ ఇంద్రగంటి తీసిన 'అష్టా చమ్మా' సినిమా చూసి బాగా నవ్వుకున్నాను. అలాగే శ్రీదేవి మూవీస్ అధినేత శివలెంక కృష్ణప్రసాద్‌కు ఈ సినిమా పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు.

## విడాకులు కావాల్సిందే...



కోలీవుడ్ స్టార్ కపుల్ ధనుష్, ఐశ్వర్య రజినీకాంత్ తమ 18 ఏళ్ల వైవాహిక జీవితానికి ఫుల్ స్టాప్ పెట్టబోతున్నట్లు ప్రకటించిన విషయం తెల్సిందే. ఇక మీదట తాము జీవితాన్ని కలిసి పంచుకోలేమని నిర్ణయం తీసుకున్న ధనుష్, ఐశ్వర్య విడాకులకు సిద్ధం అయ్యారు. కొన్ని నెలల క్రితం వీరిద్దరు విడాకుల గురించి అధికారికంగా ప్రకటన చేశారు. ప్రతి విడాకుల కేసుకు కొన్ని నెలల సమయం ఇచ్చే కోర్టు ధనుష్, ఐశ్వర్య విడాకులకు సమయం ఇచ్చింది. విడాకుల కేసులో ధనుష్, ఐశ్వర్య రజినీకాంత్ మరోసారి కోర్టుకు హాజరు అయ్యి తాము కలిసి ఉండలేమని చెప్పారు. దీంతో త్వరలోనే కోర్టు అధికారికంగా వీరికి విడాకులు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. సూపర్ స్టార్ రజినీకాంత్ కూతురు ఐశ్వర్య, స్టార్ హీరో ధనుష్ 2004లో వివాహం చేసుకున్నారు. 18 ఏళ్ల పాటు వైవాహిక జీవితం సాగించిన వీరిద్దరూ కొన్నాళ్ల క్రితం విడిపోయారు. ఇద్దరు తనయులు ఉన్న ఈ జంట విడాకుల కోసం ఈ ఏడాది ఆరంభంలో కోర్టుకు వెళ్లారు. కోర్టు వీరి విడాకులకు కొంత సమయం ఇచ్చింది. తాజాగా చెన్నై ఫ్యామిలీ కోర్టుకి ధనుష్, ఐశ్వర్య రజనీకాంత్‌లు హాజరు అయ్యారు. కోర్టులో మరోసారి వీరిద్దరు తాము కలిసి ఉండటం సాధ్యం కాదని, తమకు విడాకులు కావాల్సిందే అంటూ న్యాయమూర్తితో చెప్పడం జరిగిందట. దీంతో కోర్టు త్వరలోనే తీర్పు ఇచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 27కి ధనుష్, ఐశ్వర్యల విడాకుల కేసును వాయిదా వేసింది కోర్టు. ఇద్దరూ కోర్టుకి ప్రత్యక్ష్యంగా హాజరు అయ్యి విడాకులు కావాల్సిందిగా అంగీకారం తెలియజేయడంతో కోర్టు విడాకులు మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయి. ఈనెల 27న ఈ జంటకి అధికారికంగా కోర్టు విడాకులు మంజూరు చేయవచ్చు అంటూ తమిళ మీడియాలో కథనాలు వస్తున్నాయి. చివరి వాయిదాకు వీరిద్దరూ హాజరు కావడంతో కోర్టు నుంచి విడాకులు దాదాపుగా కన్ఫార్మ్ అయినట్లే అంటూ న్యాయవాదులు చెబుతున్నారు. ఇప్పటికే వీరు విడిగా ఉంటున్న విషయం తెలిసిందే. ధనుష్ – ఐశ్వర్య రజనీకాంత్‌లను కలిపేందుకు మధ్య వర్తులు చర్చలు జరిపారని, కానీ వారు కలిసి ఉండేందుకు ఆసక్తిని చూపించడం లేదని తేలడంతో కోర్టు విడాకులు మంజూరు చేయనుంది. ధనుష్ కంటే ఐశ్వర్య రజినీకాంత్ వయసులో పెద్ద. ధనుష్ సోదరి, ఐశ్వర్య రజనీకాంత్ స్నేహితులు. ఆ పరిచయంతో ధనుష్‌తో ఐశ్వర్య ప్రేమలో పడింది. ఐశ్వర్యని వివాహం చేసుకోవడంతో ధనుష్ సినీ కెరీర్ ఒక్కసారిగా టర్న్ అయిందని రజనీకాంత్ అభిమానులు అంటూ ఉంటారు. కేవలం కెరీర్ కోసమే ఐశ్వర్యను ధనుష్ పెళ్లి చేసుకున్నాడు అంటూ ఆరోపణలు కూడా చాలానే వచ్చాయి.

## సంస్కృతంలో 'వస్సాహి ..' పాట




రవితేజ తమ్ముడు రఘు కొడుకు మాధవ్ హీరోగా నటిస్తోన్న సినిమా 'మిస్టర్ ఇడియట్'. సిమ్రాన్ శర్మ హీరోయిన్. జేజేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఎల్ఎల్‌పీ పతాకంపై యలమంచి రాణి సమర్పణలో నిర్మాత జేజేఆర్ రవిచంద్ నిర్మిస్తున్నారు. దర్శకురాలు గౌరీ రోణంకి డైరెక్ట్ చేస్తున్నారు. త్వరలోనే ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. తాజాగా నటుడు శివాజీ చేతుల మీదుగా ఈ సినిమా నుంచి 'వస్సాహి వస్సాహి..' లిరికల్ సాంగ్ రిలీజైంది. బ్యూటిఫుల్ కంపోజిషన్‌తో, కలర్ ఫుల్ పిక్చరైజేషన్‌తో ఈ పాట ఆకట్టుకుందని, ఇంతవరకు సంస్కృత భాషలో ఏ పాట రాలేదు, ఇది ఫస్ట్ సాంగ్ అని శివాజీ ప్రశంసించారు. ఈ పాటను అనూప్ రూబెన్స్ మంచి బీట్‌తో కంపోజ్ చేయగా, శివశక్తి దత్తా సాహిత్యాన్ని అందించారు. సింగర్ శ్రీరామచంద్ర ఎనర్జిటిక్‌గా పాడారు. 'సౌందర్య సార, మకరంద దార, శృంగార పారవరా, సౌవర్ణ ప్రతిమ, లావణ్య గరిమ ఇదంకిం తమాషా వస్సాహి వస్సాహి' అంటూ సంస్కృత సాహిత్యంతో ఆకట్టుకునేలా సాగుతుందీ పాట అని మేకర్స్ చెప్పారు.

### ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారు



అశోక్ గల్లా తన సెకండ్ మూవీ 'దేవకీ నందన వాసుదేవ' చిత్రం ఈరోజు విడుదల కానుంది. ఈ చిత్రానికి గుణ 369తో హిట్ కొట్టిన అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహించారు. ప్రశాంత్ వర్మ కథ అందించారు. మానస వారణాసి హీరోయిన్‌గా నటించారు. నల్లపనేని యామిని సమర్పణలో లలితాంబిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సోమినేని బాలకృష్ణ నిర్మించారు. ఈ సందర్భంగా అశోక్ గల్లా మాట్లాడుతూ, 'ప్రశాంత్ గారు నా దగ్గర కథ వుంది వింటావా? అనడిగారు. కథ విన్నాక అద్భుతంగా అనిపించింది. ఈ సినిమాలో యాక్షన్, ఎమోషన్ అద్భుతంగా వుంటుంది. అర్జున్ గారు, ప్రశాంత్ వర్మ కథని చాలా ఎలివేట్ చేశారు. ప్రశాంత్ వర్మ గారు అనుకున్న దానికంటే అవుట్ పుట్ బెటర్‌గా వచ్చింది. మానసకి ఇది మొదటి సినిమా. తన క్యారెక్టర్‌కి కథలో ప్రాముఖ్యత వుంటుంది. దేవదత్త విలన్ రోల్‌కి ఒప్పుకోవడంతో సినిమా మరో స్థాయికి వెళ్ళింది. కమర్షియల్ జోన్‌లో సినిమా చాలా బావుంటుంది. ప్రేక్షకులు కచ్చితంగా ఎంజాయ్ చేస్తారనే నమ్మకం వుంది. నెక్ట్స్ ప్రాజెక్టు సితారలో చేస్తున్నా. అది కంప్లీట్ యూత్ స్టోరీ'.అని వివరించారు.

## 24న వస్తున్న కిస్సిక్ సాంగ్




ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ కాంబినేషన్‌లో రూపొందుతోన్న ఇండియన్ బిగ్గెస్ట్ ఫిలిం 'పుష్ప-2' ది రూల్' చిత్రం ఇప్పుడు ఇండియాలో హాట్ టాపిక్. సుకుమార్ రైటింగ్స్ అసోసియేషన్‌తో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, యలమంచిలి రవిశంకర్‌లు ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన ట్రైలర్ తరువాత సినిమాపై అంచనాలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నట విశ్వరూపం డిసెంబరు 5న ప్రపంచమంతా చూడబోతుంది. ఇక ఈ చిత్రంలో అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ప్రత్యేక పాట అప్‌డేట్ వచ్చేసింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీలపై చిత్రీకరించిన కిస్సిక్ సాంగ్‌ను చెన్నయ్‌లో జరగనున్న గ్రాండ్ ఈవెంట్‌లో ఈ నెల 24న ఏడు గంటల రెండు నిమిషాలకు విడుదల చెయ్యబోతున్నారు. ఒకవైపు ఐకాన్ స్టార్ డ్యాన్సుల గురించి, డ్యాన్సుల్లో ఆయన ఎనర్జీ, స్టయిల్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మరో వైపు డ్యాన్సుల్లో తనకంటూ ఓ ముద్ర వేసుకున్న కథానాయిక శ్రీలీల కాంబోలో ప్రత్యేక గీతం అంటే ఇక ఫ్లోర్ ఫైరే. ఈ సాంగ్ పుష్ప- 2లో మరో సెన్సేషన్ సాంగ్‌గా నిలవబోతుంది. ఈ ఇద్దరి డ్యాన్సింగ్ ఫైర్‌కు రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ బాణీలు తోడైతే.. ఇక మాస్ జాతరే.

## రామ్ నయా సినిమా షురూ..



రామ్ పోతినేని హీరోగా అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న సినిమా గురువారం ఉదయం పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఈ చిత్రానికి మహేష్ బాబు పి దర్శకత్వం వహిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలు. హీరోగా రామ్ 22వ చిత్రమిది. ఇందులో రామ్ సరసన భాగ్యశ్రీ బోర్సే నాయికగా నటిస్తున్నారు. హీరో రామ్ పోతినేని, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మీద చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు గోపీచంద్ మలినేని కెమెరా స్విచ్ఛాన్ చేయగా, మరో దర్శకుడు హను రాఘవపూడి క్లాప్ ఇచ్చారు. తొలి సన్నివేశానికి దర్శకుడు వెంకీ కుడుముల గౌరవ దర్శకత్వం వహించారు. చిత్ర దర్శకుడు మహేష్ బాబుకు మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలితో పాటు ఆ సంస్థ సీఈవో చెర్రీ స్క్రిప్ట్ అందజేశారు. 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' విజయం తర్వాత దర్శకుడు మహేష్ బాబు ఫీల్ గుడ్ అండ్ క్రేజీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిస్తున్న చిత్రమిది. యువతను ఆకట్టుకునే అంశాలతో పాటు చక్కటి కథ, కథనంతో సినిమా రూపొందుతోందని దర్శక, నిర్మాతలు అన్నారు.

# నెతన్యాహుకు ఐసిసి అరెస్టు వారంట్



అమెస్టర్‌డామ్ : గాజాలో యుద్ధ నేరాలకు, మానవాళి వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారంటూ ఇజ్రాయిల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలంట్‌లకు అంతర్జాతీయ న్యాయస్థానం అరెస్టు వారంట్లు జారీ చేసింది. హమాస్ నేత ఇబ్రహీమ్ అల్ మాస్రికి కూడా అరెస్టు వారంటు జారీ అయింది. నెతన్యాహు, గాలంట్‌లు గాజాలో అమానుష రీతిలో మారణకాండకు పాల్పడ్డారని, ఆహారం, నీరు వంటి మౌలిక అవసరాలను కూడా అందనివ్వకుండా అమానవీయ చర్యలకు దిగడంతో వేలాదిమంది ప్రజలు మరణించారని న్యాయస్థానం పేర్కొంది. ఇందుకు అవసరమైన సాక్ష్యాధారాలను కూడా గుర్తించామని పేర్కొంది. గాజాలో యుద్ధ నేరాలకు పాల్పడలేదంటూ ఇజ్రాయిల్ ఈ వారంట్లను తోసిపుచ్చింది. గతేడాది అక్టోబరు 7న ఇజ్రాయిల్‌పై హమాస్ దాడి, అందుకు ప్రతిగా గాజాలో ఇజ్రాయిల్ నరమేధం నేపథ్యంలో నెతన్యాహు, గాలంట్‌లను అరెస్టు చేయాలని ఐసిసి ప్రాసిక్యూటర్ కరీమ్ ఖాన్ మే 20న కోరారు.

# ఒప్పందాలు రద్దు చేసుకున్న కెన్యా

నైరోబి : అమెరికాలో గౌతమ్ అదానీపై కేసు నమోదైన నేపథ్యంలో అదానీ గ్రూపుతో అన్ని ఒప్పందాలను కెన్యా రద్దు చేసుకుంది. దేశంలో ప్రధాన విమానాశ్రయం నిర్వహణను అప్పగించడంతో సహా అదానీ గ్రూపుతో అన్ని ఒప్పందాల రద్దు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని అధికారులను కెన్యా అధ్యక్షులు విలియం రుటో గురువారం ఆదేశించారు. విద్యుత్ సరఫరా లైన్ల నిర్మాణం కోసం అదానీ గ్రూపునకు చెందిన ఒక యూనిట్‌తో దేశ ఇంధన మంత్రిత్వ శాఖ గత నెలలో సంతకం చేసిన 736 మిలియన్ డాలర్ల పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ఒప్పందాన్ని కూడా రద్దు చేయాలని అధికారులను అధ్యక్షులు ఆదేశించారు. ప్రజలను ఉద్దేశించిన ప్రసంగంలో రుటో ఈ విషయాలను వెల్లడించారు. 'ఇంధన మంత్రిత్వ శాఖతోపాటు పెట్రోలియం, రవాణశాఖలకు చెందిన సంస్థలను అదానీ గ్రూపుతో అన్ని ఒప్పందాలను తక్షణమే రద్దు చేసుకోవాలని ఆదేశించాను' అని రుటో తెలిపారు. దర్యాప్తు సంస్థలు, భాగస్వామ్య దేశాలు ఇచ్చిన కొత్త సమాచారం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# సంక్షోభంలో కాప్ 29 చర్చలు!




బాకూ : వాతావరణ మార్పుల వల్ల తలెత్తుతున్న సంక్షోభాలను, విపత్తులను ఎదుర్కొనేందుకు ఏర్పాటు చేయాలని భావిస్తున్న నూతన వాతావరణ నిధి ప్యాకేజీపై గురువారం తెల్లవారు జామున విడుదల చేసిన ముసాయిదాను ఐక్యరాజ్య సమితి వాతావరణ ఒప్పందంపై సంతకాలు చేసిన ప్రతి ఒక్క దేశమూ తిరస్కరించింది. ఈ ముసాయిదా ఖరారుకు చాలా దూరంలో వుందని, తగు సూచనలు, సలహాలు అందజేయాల్సిందిగా అన్ని దేశాలను కోరామని కాప్29 అధ్యక్షవర్గం పేర్కొంది. ఏకాభిప్రాయం పొందే లక్ష్యంతో మరికొన్ని మార్పులు, చేర్పులు చేసి, సవరణలతో మరో కొత్త ముసాయిదాను రూపొందిస్తున్నామని ప్రకటించింది. రోజురోజుకు పెరుగుతున్న సవాళ్ల నేపథ్యంలో ఏటా కనీసం 1.3 లక్షల కోట్ల డాలర్లు అవసరమవుతాయని వర్ధమాన దేశాలు ఇప్పటికే స్పష్టం చేశాయి. 2009లో ఇచ్చిన 100 బిలియన్ల డాలర్ల హామీ కంటే ఈ మొత్తం కనీసం 13 రెట్లు ఎక్కువ. సంపన్న దేశాలు ఇంకా అధికారికంగా మొత్తాన్ని ప్రతిపాదించనప్పటికీ ఆ మొత్తం ఏటా 200 బిలియన్ల నుండి 300 బిలియన్ల డాలర్ల వరకు వుండేలా చూసుకోవాలని యురోపియన్ యూనియన్ దేశాలు చర్చిస్తున్నట్లు చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులు సూచనప్రాయంగా తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న కాప్ 29 సదస్సు లక్ష్యం జీరోగా మిగిలిందని కొలంబియా పర్యావరణ మంత్రి సుశానా మహ్మద్ వ్యాఖ్యానించారు. ఇక్కడ సంపన్న దేశాల వద్ద నిధులు లేకపోవడం సమస్య కాదని, వారు భౌగోళిక రాజకీయాలకు పాల్పడుతుండడమే సమస్యగా వుందని ఆమె వ్యాఖ్యానించారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు ప్రతినిధుల నుండి మీడియా నుండి పరిశీలకుల నుండి హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. మెరుగైన ఫలితం లేకుండా బాకూ నుండి వదిలివెళ్ళేద లేదని జి 77 స్పష్టం చేసింది. వాతావరణ నిధిని అంతర్జాతీయ పెట్టుబడుల లక్ష్యంగా మార్చాలని సంపన్న దేశాలు చేస్తున్న ప్రయత్నాలను జి 77 అధ్యక్షులు అదోనియా అయెబరె తీవ్రంగా నిరసించారు.

# న్యాయవ్యవస్థను పునరుద్ధరిస్తాం



కొలంబొ : గత ప్రభుత్వ తప్పులను పరిష్కరించి, న్యాయవ్యవస్థను పునరుద్ధరిస్తామని శ్రీలంక అధ్యక్షుడు అనురా కుమార దిసనాయకె పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు తాను ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తానని హామీ ఇచ్చారు. గురువారం ఉదయం నూతన ప్రభుత్వంతో కొలువుదీరిన పార్లమెంటునుద్దేశించి దిసనాయకె ప్రసంగించారు. నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి) పార్టీ పొదుపు వాగ్దానానికి తాను కట్టుబడి ఉంటానని అన్నారు. సైనిక గన్ సెల్యూట్, మోటార్ బైక్ కవాతు వంటి అధికారిక లాంఛనాలకు దూరంగా నిరాడంబరంగా దిసనాయకె పార్లమెంటులోకి ప్రవేశించారు. చట్టం ముందు అందరినీ సమానంగా, జవాబుదారీగా ఉండేలా న్యాయవ్యవస్థను బలోపేతం చేస్తామని అన్నారు. గతంలో నేరాల వల్ల ప్రభావితమైన ప్రతి ఒక్కరికి న్యాయం చేకూరుస్తామని అన్నారు. దేశ ఆర్థికవ్యవస్థపై రాష్ట్రపతి దృష్టిసారించారని అన్నారు. ప్రభుత్వంలో కొనసాగేందుకు అన్ని పార్టీల విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు యత్నిస్తామని అన్నారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) సంస్థతో ఒప్పందాలను తమ ప్రభుత్వం కొనసాగిస్తుందని అన్నారు. తమపార్టీ సాధించిన అఖండ విజయం తర్వాత మొదటి సెషన్ ఇది అని అన్నారు. నవంబర్ 14న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో 225 స్థానాలకు గాను 159 స్థానాల్లో ఎన్‌పిపి విజయం సాధించిన సంగతి తెలిసిందే.

## అదానీని అరెస్టు చేయండి

న్యూఢిల్లీ: అదానీ గ్రూపు పాల్పడిన అవకతవకలన్నింటిపై స్వతంత్ర సంస్థతో పూర్తి స్థాయిలో దర్యాప్తు జరిపించాలని, అమెరికా ప్రాసిక్యూటర్లు అందజేసిన ఆధారాల ప్రాతిపదికన అదానీపై వెంటనే కేసు నమోదు చేయాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేసింది. ఈ మేరకు పొలిట్‌బ్యూరో ఒక ప్రకటన జారీ చేసింది.గౌతమ్ అదానీ మరో ఆరుగురిపై అమెరికా కోర్టులో అక్కడి న్యాయశాఖ దాఖలు చేసిన నేరారోపణ పత్రంలో కేంద్ర, రాష్ట్ర స్థాయిలో భారత ప్రభుత్వ అధికారులకు ముడుపులు చెల్లించడంలో గౌతమ్ అదానీ, ఆయన మేనల్లుడు సాగర్ అదానీలకు ప్రమేయం వుందంటూ తీవ్రమైన నేరాభియోగాలు వున్నాయి. సౌర విద్యుత్ సరఫరా కోసం రాష్ట్రాలు లేదా ప్రాంతీయ విద్యుత్ పంపిణీ కంపెనీలతో విద్యుత్ విక్రయానికి సంబంధించి అక్రమ ఒప్పందాలతో ముందుకు సాగడానికి భారత ప్రభుత్వ అధికారులకు రూ.2,029 కోట్లు ఇవ్వజూపారని లేదా ఇస్తామని హామీ ఇచ్చారని ఆ అభియోగ పత్రం పేర్కొంటోంది. అదానీలు అమెరికా ఇన్వెస్టర్లను తప్పుదారి పట్టించారనే ఆరోపణలపై అమెరికాలో ఈ కేసు నమోదైంది.

# ఇమ్రాన్‌ఖాన్‌కు బెయిల్.. కానీ జైలులోనే

ఇస్లామాబాద్ :అక్రమాస్తుల కేసులో మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు పాకిస్థాన్ కోర్టు బుధవారం బెయిల్ మంజూరు చేసిందని ఆయన తరపు న్యాయవాది



తెలిపారు. అయితే ఆయనపై ఉన్న ఇతర అభియోగాలు పెండింగ్‌లో ఉన్నందున జైలు నుండి విడుదల కాలేరని అన్నారు. ప్రస్తుతం ఇమ్రాన్‌ఖాన్ రావల్పిండిలోని గ్యారీసన్‌లోని అడియాలా జైలులో ఉన్నారు.ఇమ్రాన్ ఖాన్ అధికారంలో ఉన్న సమయంలో ఆయన భార్య బుష్రా బీబీతో కలిసి ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి బహుమతులను విక్రయించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ కేసులో రాజధాని ఇస్లామాబాద్‌లోని ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు ఇమ్రాన్‌ఖాన్‌కు కొంత ఉపశమనం కలిగించిందని న్యాయవాది పేర్కొన్నారు. 2022లో పార్లమెంట్‌లో జరిగిన అవిశ్వాస తీర్మానంలో బహిష్కరణకు గురైన ఖాన్, ఈ అభియోగాన్ని ఖండించారు. అక్రమాస్తుల ఆరోపణలపై జులైలో ప్రారంభమైన విచారణ ఇప్పటికీ కొనసాగుతోంది.

# గాజాలో కాల్పుల విరమణ తీర్మానానికి అమెరికా వీటో

గాజాపై ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధంలో కాల్పుల విరమణ కోసం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానాన్ని ఇతర 14 కౌన్సిల్ సభ్యులు రాజీకి వచ్చే ప్రయత్నాలకు గండి కొడుతున్నారని ఆరోపిస్తూ అమెరికా వీటో చేసింది. ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహుతో అమెరికా రాయబారి అమోస్ హౌచ్‌స్టెయిన్ ముందస్తుగా నిర్ణయించబడిన సమావేశానికి ముందు ఇజ్రాయిల్‌తో ఏదైనా ఒప్పందంలో పూర్తి కాల్పుల విరమణ జరగాలని, "లెబనాన్ సార్వభౌమాధికారాన్ని రక్షించాలని" హిజ్బుల్లా నాయకుడు నయీమ్ ఖాస్సేమ్ డిమాండ్ చేశారు. ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ డైరెక్టర్ మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న 17 మంది పిల్లలు ఈ సదుపాయానికి వచ్చారని, వారికి చికిత్స చేయడానికి సామగ్రి లేదు. ఇజ్రాయెల్ దళాలు భవనంపై కాల్పులు జరుపుతున్నాయి. వ్యక్తులను లేదా మందులను లోపలికి అనుమతించడం లేదు. అక్టోబర్ 7, 2023 నుంచి గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహొమంలో కనీసం 43,985 పాలస్తీనియన్లు చనిపోయారు. 104,092 మంది గాయపడ్డారు. ఆ రోజు హమాస్ నేతత్వంలోని దాడుల్లో ఇజ్రాయిల్‌లో 1,139 మంది మరణించారు. 200 మందికి పైగా బందీలుగా తీసుకున్నారు. గాజాపై యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడుల్లో ఇప్పటివరకు కనీసం 3,558 మంది మరణించారు. 15,123 మంది గాయపడ్డారు. ఉత్తర గాజాపై ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో కనీసం 88 మంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో 66 మంది బీట్ లాహియాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ సమీపంలో, 22 మంది గాజా సిటీలో ఉన్నారని అల్ జజీరా అరబిక్ రాసింది. ఉత్తర గాజాలోని కమల్ అద్వాన్ హాస్పిటల్ డైరెక్టర్ మాట్లాడుతూ, ఈ సదుపాయం పోషకాహార లోపంతో బాధపడుతున్న 17 మంది పిల్లలను పొందిందని, అయితే ఇజ్రాయిల్ దళాలు వైద్య సదుపాయంపై కాల్పులు జరిపి, చాలా మంది వ్యక్తులు, సామగ్రి ప్రవేశించకుండా నిరోధించడంతో

# కాగ్ అధిపతిగా కె.సంజయ్ మూర్తి ప్రమాణస్వీకారం



న్యూఢిల్లీ : కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)గా రాష్ట్రానికి చెందిన సీనియర్ ఐఎఎస్ అధికారి కొండ్రు సంజయ్ మూర్తి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆయనతో ప్రమాణ స్వీకారం చేయించారు. కాగ్ అధిపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి తెలుగు వ్యక్తిగా సంజయ్ మూర్తి నిలిచారు. 1996లో కాంగ్రెస్ నుంచి అమలాపురం మాజీ ఎంపిగా ఎన్నికైన కెఎస్ఆర్ మూర్తి కుమారుడు సంజయ్ మూర్తి. 1964 డిసెంబర్ 24న జన్మించిన ఈయన, మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తిచేశారు. 1989లో ఐఎఎస్‌లో హిమాచల్‌ప్రదేశ్ కేడర్‌కు ఎంపికయ్యారు. ఆ తరువాత కేంద్ర సర్వీసుల్లోకి వచ్చిన ఆయన, 2021 సెప్టెంబర్ నుంచి ఉన్నత విద్యా కార్యదర్శిగా పనిచేశారు. వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేయాల్సిన ఆయనకు కాగ్ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. ఆయన ఈ పదవిలో గరిష్టంగా ఆరేళ్లు కానీ, ఆయనకు 65 ఏళ్ల వయసు వచ్చే వరకు కానీ కొనసాగుతారు.

## గ్లోబల్ సమ్మిట్ నిర్వహించడం ఓ చారిత్రాత్మిక మైలురాయి



మొట్టమొదటిసారిగా స్టట్‌గార్ట్‌లోని ఫుట్‌బాల్ మైదానంలో టీవీ9 నెట్‌వర్క్ ఈ తరహా కార్యక్రమం ఒకటి నిర్వహించడం చారిత్రాత్మకం అని కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా కొనియాడారు. క్రీడలు కేవలం ఆట మాత్రమే కాదు.. ఓ జట్టు నిర్మాణం అవుతుంది, భాగస్వామ్యాలు సైతం ఏర్పడతాయి. అలాగే వ్యక్తుల మధ్య సంబంధాలు ఏర్పడుతాయని మంత్రి అన్నారు.భారతదేశం, జర్మనీ వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. జర్మనీ ఇంజనీరింగ్ ఎక్సలెన్స్‌కు పెట్టింది పేరు. దీనిని స్టట్‌గార్ట్‌లో చూస్తున్నాం. పోర్షే, మెర్సిడెస్ బెంజ్ లాంటివి ఇక్కడ ఉన్నాయి. భారతదేశం కూడా ఈ సూత్రాన్ని అనుసరిస్తోంది. భారతదేశ జనాభాలో 70 శాతం మంది 35 ఏళ్ల లోపు వారే. భారత్, జర్మనీలు తమ బంధాన్ని పెంపొందించుకోవడం ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. గత 10 ఏళ్లలో భారతదేశం ఎంతగానో రూపాంతరం చెందింది. 1920లో జర్మనీలో భారతీయ కమ్యూనిటీకి చెందిన కొన్ని వందల మంది ఉన్నారని, నేడు వారి సంఖ్య లక్షలకు చేరుకుందని చెప్పారు. భారతీయులమైన మనం మన సత్తాను ప్రపంచానికి చూపిస్తున్నామని జ్యోతిరాదిత్య సింధియా తెలిపారు. భారతదేశ సామర్థ్యం, జర్మనీ నైపుణ్యం కలిసి ప్రపంచానికి కొత్త ఉదాహరణను అందించగలవు. నేడు జర్మనీలో 50 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, దీనివల్ల భారత్, జర్మనీల మధ్య బంధం బలపడుతుందన్నారు కేంద్రమంత్రి. దీనికి కారణం భారతదేశంలోని 4 స్తంభాలు. అవే ప్రజాస్వామ్యం, జనాభా, డేటా, డిమాండ్. ప్రధాని మోదీ నాయకత్వంలో గత దశాబ్దంలో భారతదేశం పూర్తిగా అభివృద్ధి చెందింది. గత 6 దశాబ్దాల్లో భారత్ సాధించలేనిదంతా సాధించింది. టెలికాం గురించి మాట్లాడినట్లయితే, ఒక దశాబ్దంలో, ఇంటర్నెట్ వినియోగదారులు 250 మిలియన్ల నుంచి 970 మిలియన్లకు పెరిగారు. బ్రాడ్‌బ్యాండ్ 60 మిలియన్ల వినియోగదారుల నుంచి 924 మిలియన్ల వినియోగదారులకు పెరిగింది. ప్రస్తుతం భారతదేశంలో 1.16 బిలియన్ల మొబైల్ సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. సింధియా మాట్లాడుతూ, రవీంద్రనాథ్ ఠాగూర్ జర్మనీకి చాలాసార్లు వెళ్ళారు. భారతదేశంలోని శాంతినికేతన్‌ను సందర్శించాల్సిందిగా ఆయన ఇక్కడి ఆలోచనాపరులను, తత్వవేత్తలను ఆహ్వానించారు. భారతదేశం, జర్మనీ మధ్య సంబంధపరమైన ఆలోచనలు, సాహిత్యం, ఆవిష్కరణల మార్పిడి సంబంధాలు ఉన్నాయి. గత దశాబ్దకాలంలో ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం గొప్ప విజయాలు సాధించింది.

# మహారాష్ట్ర ఎన్నికలలో వార్ ఒన్ సైడే !! ప్రముఖ రాజకీయ జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర

**215 సీట్లకి పైగా సాధిస్తూ చరిత్ర సృష్టించబోతున్న మహాయుతి కూటమి !!**

**క్లీన్ స్వీప్ దిశగా మహాయుతి కూటమి**

**60లోపు సీట్లకి పరిమితమవుతు ఘోర పరాజయం దిశగా మహావికాస్ అఘాడి కూటమి**

**బలమైన సింగిల్ పార్టీ దిశగా అడుగులు వేయబోతున్న బిజెపి**

**అత్యంత దారుణమైన ఫలితాలను చవిచూడనున్న కాంగ్రెస్**

**ఈ ఎన్నికల ఫలితాలతో తలరాతలు మారనున్న రెండు పార్టీల భవితవ్యం**

**అత్యంత శక్తివంతమైన నేతగా మారనున్న ఏక్ నాథ్ షిండే**

**ఉనికి కోల్పోయి బొక్క బోర్లా పడనున్న ఉద్ధవ్ థాక్రే వర్గం**



దేశ ప్రజలంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మహారాష్ట్ర ఎన్నికల ఫలితాలు నవంబర్ 23తేదీన వెలువడనున్న నేపథ్యం లో ప్రముఖ రాజకీయ జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర పలు సంచలనమైన జ్యోతిష ఫలితాలను తెలియజేశారు.

మహారాష్ట్ర రాజకీయ ముఖ చిత్రం లో పలు దశాబ్దాల నుండి ఏ పార్టీకి కూడా రానంత అత్యధికమైన మెజారిటీ సీట్లు 133 నుండి 138వరకు బిజెపి పార్టీ ఈ ఎన్నికలలో పొందబోతుందని,ఏక్ నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేనపార్టీ రెండవ బలమైన పార్టీగా మారుతూ సుమారు 60 నుండి 65 స్థానాలలో విజయం సాధించబోతుందని,ఈ ఏక్ నాథ్ షిండే వర్గానికి చెందిన శివసేనపార్టీకి వచ్చినన్ని సీట్లు కనీసం మహావికాస్ అఘాడి కూటమి మొత్తానికి కూడా వచ్చే అవకాశాలు దాదాపు అసాధ్యం అని ఆచార్య రాఘవేంద్ర జ్యోష్యం చెప్పారు.

ఇక అజిత్ పవార్ వర్గానికి చెందిన ఎన్సిపి పార్టీ 22 నుండి 26 సీట్లు సాధించే అవకాశం ఉండగా,మహావికాస్ అఘాడి కూటమి లో ఉన్న ప్రముఖ పార్టీ కాంగ్రెస్ పార్టీకి కూటమిలోనే అత్యల్పంగా 8 నుండి 12 సీట్లు వచ్చే అవకాశం ఉండగా,ఈ కూటమిలో అత్యధికంగా శరద్ పవార్ వర్గానికి చెందిన ఎన్సిపి పార్టీ కి 31 నుండి 35 వరకు సీట్లు రానున్నాయని,ఉద్ధవ్ థాక్రే వర్గానికి చెందిన శివసేనపార్టీకి 10 నుండి 13 సీట్లు రానున్నాయని జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర చెప్పారు.అలాగే ఎస్పి పార్టీ 0-1, సిపియం 0 నుండి 1, ఎంఐఎం పార్టీ 1 నుండి 3 సీట్లు సాధించబోతుండగా,మొత్తంగా చూస్తే ఈ ఎన్నికలలో మహాయుతి కూటమి మహారాష్ట్ర రాజకీయాలలోనే ఒక నూతన అధ్యాయానికి తెరతీస్తూ అత్యధికంగా 215 నుండి 231 సీట్లు సాధించడం ద్వారా చరిత్ర సృష్టించబోతుండగా, మహావికాస్ అఘాడి కూటమి కి 49 నుండి 60 వరకు సీట్లు రానున్నాయని,అలాగే ఈ ఎన్నికల ఫలితాల అనంతరం ఒకానొక సమయంలో మహారాష్ట్ర రాజకీయాలలో చక్రం తిప్పిన శివసేన,ఎన్సీపీ లకు చెందిన ఉద్ధవ్ థాక్రే ,శరద్ పవార్ రాజకీయ జీవితం చెప్పుకోదగిన స్థాయిలో తీవ్రమైన కుదుపులకు లోను కాబోతుందని ఆచార్య రాఘవేంద్ర జోష్యం చెప్పారు.గతంలో జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర ఆంధ్ర అసెంబ్లీ,పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు,తెలంగాణ పార్లమెంట్ ఎన్నికల ఫలితాల గురించి మాత్రమే కాకుండా అంర్జాతీయంగా బ్రిటన్,ఫ్రాన్స్,అమెరికాలలో జరిగిన ఎన్నికల ఫలితాల గురించి చెప్పిన జ్యోష్యం నూటికి నూరుపాళ్లు అక్షర సత్యం గా మారడం మన పాఠకులకు తెలిసిన విషయమే.

పలుమార్లు ప్రముఖ రాజకీయ జ్యోతిష పండితులు ఆచార్య రాఘవేంద్ర ఆయా ఎన్నికల ఫలితాల గురించి చెప్పిన జోష్యం నిజమైన సందర్భంగా ఈ సారి మహారాష్ట్ర ఎన్నికల ఫలితాల పై వారి జోష్యం ఎలా ఫలించబోతుందా అని పలువురు ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వరిధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం లక్షెట్టిపేట మండల రిపోర్టర్ నవంబర్ 22** : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని,సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా 500 రూపాయల బోనస్ ఇవ్వడం జరుగుతుందని, సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణాధికారులు గుర్తించి ధృవపత్రం జారీ చేయాలని, సన్నరకం,దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలని,తెలిపారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి 2 వేల 320 రూపాయలు, సాధారణ రకానికి 2 వేల 300 రూపాయలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో 17 శాతం కంటే తక్కువగా తేమ శాతం ఉండాలని, తాలు,మట్టిగడ్డలు లేకుండా నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని,కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు.వరి పంట పూర్తి కోత దశకు వచ్చిన తరువాత హార్వెస్టర్ యంత్రంలో నిర్దిష్ట ఫ్యాన్ వేగంతో పంట కోయాలని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో తూకం,తేమ యంత్రాలు,త్రాగునీరు, నీడ,గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని,కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని,కొనుగోలు సమయంలో సంబంధిత రైతులకు రశీదు జారీ చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు,రైతులు ఆకుల శంకరయ్య,మల్లేష్, వెంకటస్వామి,పెద్ద మల్లేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రులలో ఫార్మసిస్టులు బాధ్యతతో పని చేయాలి

## మంత్రి దామోదర రాజనర్సింహా

హైదరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రులలో ఫార్మసిస్టులు బాధ్యతతో పని చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కృత్రిమ మందుల కొరత పై చర్యలు చేపట్టాలని ఆయా జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాదికారులకు ఆదేశం ఇచ్చారు. సెంట్రల్ మెడికల్ స్టోర్స్ (అటూ) లలో ఫార్మసీ సిబ్బంది, మౌళిక సదుపాయాల కల్పన, మందుల సరఫరాకు రవాణా వాహనాలు అందుబాటులో ఉంచాలే చర్యలు చేపట్టాలి. హెల్త్ ఫెసిలిటీ పనితీరుపై ఏర్పాటు చేసిన టాస్క్ ఫోర్స్ క్షేత్ర స్థాయిలో పరిశీలించిన పలు అంశాల పై మంత్రి సమీక్ష జరిపారు.

సచివాలయంలో సెంట్రల్ మెడికల్ స్టోర్స్ బలోపేతం పై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారుఏ.

ఈ కార్యక్రమంలో ష్ర వైద్యశాఖ ప్రభుత్వ కార్యదర్శి డా. క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులు, టాస్క్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# వివరాలు పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి నవంబర్ 22** : ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక,విద్య,ఉపాధి, రాజకీయ,కుల గణన సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్లు సేకరించిన సమాచారాన్ని ఆన్లైన్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.శుక్రవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీం,జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్రావు లతో కలిసి ప్రత్యేక అధికారులు,మున్సిపల్ కమీషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి,అధికారులు,మండల పంచాయతీ అధికారులు,డాటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో ఎన్యుమరేషన్ బ్లాక్లను కేటాయించి ఎన్యుమరేటర్ల ద్వారా ఆయా బ్లాక్లలోని కుటుంబ సభ్యుల వివరాలు సేకరించడం జరిగిందని, ఇట్టి సమాచారాన్ని ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో పూర్తి స్థాయిలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు.ఈ నేపథ్యంలో ఎన్యుమరేటర్లు అందించిన పూర్తి సమాచారాన్ని డాటా ఎంట్రీ ఆపరేటర్ల తమకు కేటాయించిన మేరకు ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రభుత్వ పోర్టల్లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. నిర్ధేశిత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసే విధంగా వేగవంతం చేయాలని,జిల్లాలో 562 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించడం జరిగిందని, ఒక్కొక్కరికి 300 కుటుంబాల సమాచారం అందించడం జరుగుతుందని,ఒక రోజులో కనీసం 30 కుటుంబాలకు తగ్గకుండా సమాచారం పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు.డిసెంబర్ 1వ తేదీ లోగా వివరాలు నమోదు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, వీలైతే బదిలీల పద్ధతిలో ప్రక్రియ కొనసాగించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని తెలిపారు.ఆపరేటర్లు డాటా ఎంట్రీలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే పైఅధికారులను సంప్రదించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని,వివరాలు గోప్యంగా ఉంచాలని, నిర్లక్ష్యం,అలసత్వం వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు నమోదు తీరును వివరించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాలల సింహగర్జన సభను విజయవంతం చేయండి

## మాల మహానాడు జిల్లా కన్వీనర్ తొగరు సుధాకర్



ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గం రిపోర్టర్ నవంబర్ 22 : చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ డిసెంబర్ 1న హైదరాబాద్ లో మాలమహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాలల సింహగర్జన సభను జిల్లాలోని మాలలందరు పాల్గొని విజయవంతం చేయాలని మాల మహానాడు జేఏసీ జిల్లా కన్వీనర్ తొగరు సుధాకర్ మాలలకు పిలుపునిచ్చారు.శుక్రవారం పట్టణంలోని స్థానిక విశ్రాంతి భవన ఆవరణలో మాల మహానాడు ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అయన స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ...డిసెంబర్ 1 హైదరాబాద్ లో జరిగే మాలల సింహగర్జన సభను మాలలంతా విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు,దమ్మ నారాయణ,తోగరు కాంతయ్య,దొంత నరసయ్య,మాలెం చిన్నయ్య,భూపెల్లి మల్లేష్,బైరం లింగన్న, తొగరు రాజు,అలుగునూర్ నరేష్,పెండెం సత్తయ్య, రవీందర్,మినుముల శాంతి,గుత్తికొండ శ్రీధర్, సన్నీ,కండె మొగిలి, సురేష్,తదితరులు పాల్గొన్నారు.

# పాదయాత్రను విజయవంతం చేయండి




**జమ్మికుంట ప్రజాబలం ప్రతినిధి నవంబర్ 22** జమ్మికుంట పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో ఉద్యమకారుల ఫోరం నియోజకవర్గ అధ్యక్షులు ఊకంటి మల్లాచారి ఆధ్వర్యంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర యువత కో ఆర్డినేటర్ అన్నం ప్రవీణ్ మాట్లాడుతూ వేములవాడ మహాశివునికి తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేరాలని మొక్కులు సందర్భంగా ఈ నెల 27 వ తేదిన జరగబోయే విజయ సంకల్ప మహా పాదయాత్రలో ప్రతి ఉద్యమకారుడు స్వచ్ఛందంగా పాల్గొనాలని తెలపడం జరిగింది. అదే విధంగా గత ప్రభుత్వం ఉద్యమకారుల త్యాగాల మీద పునాదులు వేసుకొని ఉద్యమకారులను అణిచివేసిందని ఉద్యమ గలాన్ని నొక్కి వేసిందని మరి ఇవాళ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ఉద్యమకారులను హక్కును చేర్చుకొని 250 గజాల స్థలాన్ని ఇవ్వడం కోసం ముందుకు వచ్చిందని కొనియాడారు. నాడు ఉద్యమంలో విద్యార్థుల పాత్ర మరువలేనిదని సబ్బండ వర్గాల ప్రజలు ఏకతాటి మీదకి వచ్చి జై తెలంగాణ అనే నినాదంతో ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపారని యావత్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశానికే చాటి చెప్పిన ఘనత ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డదని అన్నారు. కానీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమకారులపై అప్పటి బిఆర్ఎస్ ప్రభుత్వం చిన్న చూపు చూసిందని, ఉద్యమకారులు జీవితాలను సైతం పణంగా పెట్టారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పునాదిరాళ్లుగా ఉన్నటువంటి ఉద్యమకారులకు న్యాయం చేయాలన్నారు. ఎంతో మంది తమ ప్రాణాలను కుటుంబాలను వదిలి తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమించారని గతాన్ని గుర్తు చేసారు.తెలంగాణ ఉద్యమకారులను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి, యువత రాష్ట్ర కో ఆర్డినేటర్ అన్నం ప్రవీణ్, ఊకంటి మల్లాచారి నియోజకవర్గ అధ్యక్షులు, పొట్టాల మల్లేష్, కందె మహేందర్, చింతల రాజిరెడ్డి, సంఘే గట్టయ్య, గురుకుంట్ల రాజీరు, గుడికందుల రాజయ్య, ఆరే రమేష్ రెడ్డి, గోశెట్టి సమ్మయ్య, నేరెళ్ల కుమార్, లెంకలపల్లి శరత్ కుమార్, మద్దూరి శంకరయ్య, రావుల రాజబాబు, అంజన్న, పోడేటి అనిల్ ,రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



# కొత్త ఓటర్ నమోదు కొరకు స్పెషల్ క్యాంపెయిన్



**ఇల్లందకుంట ప్రజా బలం ప్రతినిధి నవంబర్ 22** తెలంగాణ రాష్ట్రంలో జరగబోయే గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మండల కేంద్రంలో నూతన ఓటర్లకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఇల్లందకుంట తాసిల్దార్ రాణి తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు మీ గ్రామంలో తేదీ 23 నవంబర్ 2024, 24 నవంబర్ 2024 రెండు రోజులు ప్రత్యేకంగా ఓటరు నమోదు కోసం ఎఫ్ 6, 7, 8, సంబంధించిన అర్జీలను స్వీకరించడానికి, గ్రామాల్లో బూత్ లెవెల్ ఆఫీసర్స్ పోలింగ్ లో అందుబాటులో ఉంటారని ఈ యొక్క అవకాశాన్ని నూతనంగా ఓటు హక్కు పొందే యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ తెలిపారు.

# భద్రాద్రి వాసికి దక్కిన అరుదైన గౌరవం.

### - ప్రముఖ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బుడగం శ్రీనివాస్ సతీమణికి ఆంగ్ల విభాగంలో డాక్టరేట్.
### - కాకతీయ విశ్వవిద్యాలయం నుంచీ డాక్టరేట్ ప్రధానం చేసిన ఆచార్య నరసింహాచారి.
### - డాక్టరేట్ పొందిన బుడగం మంజుల దేవికి అభినందనల వెల్లువ.



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నవంబర్ 22 (ప్రజాబలం )** ః-భద్రాచలం పట్టణానికి చెందిన ప్రముఖ రాజకీయ నాయకులు, టీపీసీసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బుడగం శ్రీనివాస్ సతీమణి బుడగం మంజులా దేవికి అరుదైన గౌరవం లభించింది.."సాహిత అకాడమీ అవార్డు విన్నింగ్ నోవెల్స్ ఎతిమెటిక్ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఇంగ్లీష్ నొవెల్స్" అనే అంశంపై లోతైన పరిశోధన పూర్తిచేసి పరిశోధన తీతీస్ సమర్పించిన ఆంగ్ల విభాగ పరిశోధకురాలు బి మంజుల దేవికి కాకతీయ విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య నరసింహచారి డాక్టోరేట్ ప్రధానం చేశారు.పరిశోధకురాలు డాక్టర్ బి మంజులాదేవి పరిశోధన ఆధారంగా లింగ అణచివేత, పేదరికం, సామాజిక స్థాయి పెరుగుదల కోసం పోరాటం, పాత విలువలతో కొత్త విలువల మధ్య మెలుకువ వంటి అంశాలు ప్రతిబంబించటమే కాక భారతీయ సాంస్కృతిక సంక్లిష్టత, చారిత్రక సంఘటనలు, వర్గ విభజన వంటి విభిన్న అంశాలను ఈ రచనలు ప్రతిపాదించాయని మంజుల దేవి రచనలు సాంఘిక, రాజకీయ, ఆర్థిక చారిత్రక అంశాలను అధికంగా

విశ్లేషించనున్నా యని సీనియర్ ఆచార్యులు కె.పురుషోత్తం ఈ సందర్భంగా కొనియాడారు.

పురస్కార గ్రహీత బుడగం మంజుల దేవి ఏజెన్సీ ప్రాంతం భద్రాచలం పట్టనానికి చెందిన ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బుడగం శ్రీనివాస్ సతీమణి గా అందరికి సుపరిచితురాలు..యల్లప్పుడు రాజకీయాల్లో ,వ్యాపారాలలో బిజీగా ఉండె భర్తకి మద్దతుగా తోడుగా కుటుంబ భాధ్యతలను సక్రమంగా నిర్వర్తించే గృహిణిగా వుంటూనే, భర్త సహకారంతో ఉద్యోగ భాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తు ఇటువంటి అత్యున్నత పురస్కారాలు అందుకోవడం భద్రాద్రి వాసులకు గర్వకారణం అని పలువురు ప్రసంశల వర్షం కురిపిస్తున్నారు. ఆమె కుమారుడు కుమార్తేలని ఉన్నత విద్యావంతులుగా తీర్చి దిద్దడంలో తనవంతు కృషి యనలేనిదని ,ధాని ఫలితంగానే కుమారుడు రోహిత్ ఆస్ట్రేలియాలో సిగ్నల్ ఇంజనీర్ గా రైల్వేస్ లో ఉద్యోగం,కుమార్తే రిషిత ఇటీవలె ఉస్మానియాలో ఎంబిబిఎస్ పూర్తి చేయడము జరిగిందని పలువురు కొనియాడారు.

# నిరుపేద మహిళల ఆర్థిక భరోసా కొరకు నాటు కోడి పిల్లల పంపిణీ





మెదక్ తూప్రాన్ ప్రాజబలం న్యూస్ :-మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో నిరుపేద మహిళల కుటుంబాలు ఆర్థికంగా ఉన్నతి సాధించాలని ఉద్దేశంతో శంషాబాద్ నుండి తెప్పించిన ఆరు వారాల వయస్సుగల నాటు కోడి పిల్లలను పంపిణీ చేశారు.400 గ్రాములు ఉన్న ఒక్కో కోడిపిల్ల మొత్తం 680 కోడిపిల్లలను మండల సమాఖ్య కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగింది.

# మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

### కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

### బద్వేలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రముఖ కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి

బద్వేలు నేటికి కూటమి ప్రబుత్వం ఏర్పాటు అయ్యి 150 రోజులు. పూర్తి అయిన శుభ సందర్భంగా మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రజాగలం నందు చెప్పిన మాట ప్రకారం ప్రబుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లాండ్ టైటిల్ యాక్ష రద్దు -పై సంతకం చేసినారు నేడు అసెంబ్లీ లో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయుటక న్యాయ శాఖ మంత్రి వర్యులు ఫరూక్ గారు తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు చొరవతో శాసన సభ్యుల అంగీకారంతో మరీ ముఖ్యముగా రాయలసీమ కొనసీమ సభ్యుల అంగీకారంతో కర్నూలు నందు హైకోర్టు బెంచి ఏర్పాటుకు శాసనసభ ఆమోదంపట్ల బద్వేలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హర్షం ప్రకటించారు . నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారము కర్నూలు నందు రాజదాని గాని హైకోర్టు గాని ఏర్పాటు చేయుటకు తీర్మానం అయినది కాని కర్నూలు నందు రాజ దాని ఏర్పాటు చేసినను అది మూనాళ్ళ ముచ్చటగా ఆంధ్ర ప్రదేశ్ విప్పటు చేసుకున్న మనం హైకోర్టును హైదరాబాదుకు తేరలలించటమైనది ఆనాటి నుంచి ఈ నాటి వరకు రాయల సీమలో హైకోర్టు ఏర్పాటు చేయుటకు న్యాయ్యవాదులు అనేక పోరాటాలు చేయడమైనది. గత ప్రభుత్యం కర్నూలులో హైకోర్టు రాజదానిగా. ఏర్పాటు చేస్తామని చెప్పి వారి రాజకీయ స్వలాబం చూసుకున్నారు హైకోర్టు ఒకే చోట ఉండడం ఉత్తమము అని ప్రజలకు న్యాయస్థానాలు అందుబాటులో ఉంచి త్వర తగతిన న్యాయం పొందుటకు నేడు కూటమి ప్రభుత్వం నారా చంద్ర బాబు నాయకత్వం తో మన రాయలసీమ వాసుల కలను నెరవేరుస్తూ ఈనాడు కర్నూలు నందు హైకోర్టు బెంచి ఏర్పాటు చేయట అభినందననీయ విషయం అని ప్రభుతం ఏర్పాటు అయినప్పట్టనండి రాష్ట అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం కష్టపడుతున్నట్లు మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు

# ఇద్దరిని హతమార్చిన మావోయిస్టులు

ములుగు జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం జరిగింది. పోలీస్ ఇన్ ఫార్మర్ నెపంతో మావోలు ఇద్దరిని హత్య చేసారు. వాజేడు మండలం జంగాలపల్లి లో ఘటన జరిగింది. మృతులు అర్జున్, రమేష్ గా గుర్తించారు. రమయేష్ పంచాయతీ సెక్రటరీగా పని చేస్తున్నాడు. చంపిన తరువాతమావోయిస్టులు లేఖ వదిలి వెళ్లారు. వాజేడు ఏరియా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో లేఖ రాసారు.

# శిథిలవస్థకు చేరిన కల్వర్టు ఏదైనా ప్రమాదం జరిగితే గాని పట్టించుకుంటారా?



**ఇల్లందకుంట ప్రజా బలం ప్రతినిధి నవంబర్ 22**ఇల్లందకుంట మండల పరిధిలోని రాచపల్లి నుండి నాగంపేట మధ్యన ఉండే ప్రధాన రహదారి కల్వర్టు శిథిలావస్థకు చేరింది.దీంతో ఎప్పుడు కులుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.ఏదైనా ప్రమాదం జరుగుతేనే పట్టించుకుంటారా అని ప్రజలు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఈ కల్వర్ట్ మీదుగా ప్రధానంగా జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ కు వెళ్లే భారీ వాహనాలు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటారు.గత సంవత్సరం వర్షాల వరదల తాకిడికి ఈ కల్వర్టు పూర్తిగా కుంగి ద్వసంమైంది. ఈ మార్గం ప్రధానంగా నాగంపేట, రాచపల్లి మీదుగా వంతడుపుల, వావిలాల, బుజునూర్, సీతంపేట ను కలుపుతుంది.స్కూల్ బస్సులు కూడా ఈ మార్గం గుండానే వెళుతూ ఉంటాయి. ఇంత రద్దీగా ఉండే కల్వర్టును ఆర్ అండ్ బి అధికారులు పట్టించుకోవడం పోవడం ఏమిటని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సంబంధిత అధికారులు ఈ కల్వర్టును తొలగించి కొత్తగా కల్వర్టును నిర్మించి అందుబాటులోకి తేవాలని స్థానిక గ్రామాల ప్రజలు ప్రయాణికులు, రైతాంగం కోరుతున్నారు.

# శ్రీరామ్ నగర్ లో ఉచిత పశు వైద్య శిబిరం

### -150 కి పైగా పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించిన పశు వైద్యులు




మంథని మునిసిపల్ పరిధిలోని శ్రీరామ్ నగర్ లో ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పశు సమగ్ర అభివృద్ధి సంస్థ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశువులకు యదకు రాని సమస్యలు, సూడి పరీక్షలతో పాటు ఇతర సమస్యలపై వైద్య పరీక్షలు నిర్వహించారు. దాదాపు 150 కి పైగా పశువులకు ఈ వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ శంకర్, మంథని ఏడి డాక్టర్ జి. సంపత్ రావు, గుంజపడుగు పశు వైద్యాధికారి రవి, సూపర్వైజర్లు, గోపాలమిత్ర లు పాల్గొన్నారు.

31సీఎం రేవంత్ రెడ్డి మెడకు చుట్టుకున్న అదాని కుంభకోణం అరెస్ట్ వ్యవహారం

న్యూఢిల్లీ

అదాని అవినీతిపరుడు అని రాహుల్ గాంధీ అంటున్నాడు.. అదే నిజమైతే, అదాని నుంచి రేవంత్ రెడ్డి రూ.100 కోట్ల విరాళం ఎందుకు తీసుకున్నారని బీజేపీ జాతీయ ప్రతినిధి సంబిత్ పాత్ర ప్రశ్నించారు. దావోస్లో పర్యటనలో అదానితో రేవంత్ రెడ్డి రూ.12,400 కోట్ల పెట్టుబడులకు ఒప్పందం ఎలా కుదుర్చుకున్నారని అన్నారు. అదాని కుంభకోణం అరెస్ట్ వ్యవహారం, సీఎం రేవంత్ రెడ్డి మెడకు చుట్టుకున్నదని అయన అన్నారు.

33టైగర్ రిజర్వ్ ల గవర్నింగ్ బాడీస్ భేటీ

పాల్గోన్న మంత్రి కొండ సురేఖ

హైదరాబాద్

డా. బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని అటవీ,పర్యావరణ మంత్రిత్వ శాఖ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మంత్రి, టైగర్ రిజర్వ్ గవర్నింగ్ బాడీస్ చైర్ పర్సన్ కొండా సురేఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ల గవర్నింగ్ బాడీస్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అటవీశాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పిసిసిఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్)ఆర్.ఎం.డోబ్రియాల్, పిసిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఏలూసింగ్, డిసిసిఎఫ్ ఆంజనేయులు(హెడ్ ఆఫీస్), సిఎఫ్ రాంబాబు (అమ్రాబాద్ టైగర్ రిజర్వ్), శాంతారాం(కవ్వాల్ టైగర్ రిజర్వ్), డిఎఫ్ఓలు రోహిత్ (నాగర్ కర్నూల్), బాజీరావ్ పాటిల్ (ఆదిలాబాద్), రాజశేఖర్ (నల్గొండ), ఎఫ్ డిఓ రామ్మూర్తి, ఓఎస్డీ శంకరన్ తదితరులు పాల్గొన్నారు.

## సన్న వడ్లకు బోనస్ అందడంతో మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం

మంథని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు రూ.500బోనస్ అందడంతో మంథని పట్టణంలోని శ్రీపాద కాలనిలోని వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతు నాయకుడు మూల పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి రైతులతో కలిసి పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేసి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకుడు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ భారత దేశంలో ఏ రాష్ట్రం చేయని విదంగా రైతులకు క్వింటాలకు రూ. 500 ల బోనస్ ను రైతుల ఖాతాలో జమ చేయడం జరుగుతుందని అన్నారు. రైతులందరి తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి, మంత్రి శ్రీధర్ బాబు కు, శ్రీను బాబులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:**గోషామహల్ అసెంబ్లీ నియోజకవర్గం లోని జాంబాగ్ డివిజన్ లో ఉస్మాన్గంజ్ రిసాలాఅబ్దుల్లాలో సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గోన్న ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమీటీ ఉపాధ్యాక్షులు ఎస్.ధన్‌రాజ్ మాదిగ మరియు జీహెచ్ఎంసీ అధికారులు ట్యాక్స్ ఇన్స్పెక్టర్ రాజు ,బిల్ కలెక్టర్ జగన్ తదితరులు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com